07-02Pg1exHMNWJQEBPRCKLT.qxd:07-02Pg1exHMNWJQEBPRCKLT.qxd 1/1/02 6:43 AM Page 1




తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

శ్రీకాకుళం

epaper.vaartha.com WWW.VAARTHA.COM

: fb.com/vaartha Digital

Published from Srikakulam, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,

7-2-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 07 పేజీలు: 16 వెల: 6.50






7-2Pg3exHMNWJQEV.qxd:7-2Pg3exHMNWJQEV.qxd 1/1/02 8:20 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

శ్రీకాకుళం

: fb.com/vaartha Digital

Published from Srikakulam Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,

7-2-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 07 పేజీలు: 16 వెల: 6.50

చర్చలు విఫలమైతే బలప్రయోగమే 5లో

కీలక వడ్డీరేట్లు యధాతథం: ఆర్బీఐ గవర్నర్

# ఎపిలో 3 విద్యుత్ డిస్కంలకు రూ.24,420కోట్ల నష్టం

## ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ ప్రశ్నకు కేంద్రం జవాబు

విజయవాడ,ఫిబ్రవరి 6,ప్రభాతవార్తప్రతినిధి: ఏపీలోని 3 డిస్కంలకు 2025 మార్చి 31 నాటికి రూ.29,420 కోట్ల నష్టాలు ఉన్నట్లు కేంద్ర విద్యుత్తుశాఖ సహాయమంత్రి శ్రీపాద యశోనాయక్ తెలిపారు. అప్పటికి డిస్కంల అప్పులు రూ.77,583 కోట్ల మేర ఉన్నట్లు చెప్పారు. లోక్ సభలో అడిగిన ఒక ప్రశ్నకు ఈ మేరకు ఆయన సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలోని డిస్కంల సగటు సరఫరా, వాణిజ్య నష్టాలు 7.87 శాతం ఉన్నట్లు చెప్పారు. 2021 జులైలో రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం ని ప్రారంభించారు. దీన్ని అనుసరించి 28 రాష్ట్రాల్లోని 45 డిస్కంలకు స్మార్ట్ మీటరింగ్ పనులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది జనవరి 1 నాటికి దేశ వ్యాప్తంగా 4.19 కోట్ల స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఏపీలో 56,08,846 మీటర్లకు గాను 22,88,414 మీటర్లు ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. రాష్ట్రంలో 20202024 మధ్య కాలంలో 1,629 బస్సు ప్రమాదాలు జరిగినట్లు కేంద్ర రహదారి, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ప్రైవేట్ బస్సు ప్రమాదాల పై ఏలూరు లోక్‌సభ సభ్యుడు పుట్టా మహేష్‌కుమార్ అడిగిన ప్రశ్నకు ఆయన బదులు ఇచ్చారు. ఇదే సమయంలో దేశ వ్యాప్తంగా 58,987 ప్రమాదాలు జరిగినట్లు చెప్పారు.ఏపీలో గత 6 ఏళ్లలో 3,443 కిలోమీటర్ల నేషనల్ హైవేల నిర్మాణం జరిగిందని మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఇదే సమయంలో రాష్ట్రంలో కొత్తగా 34 టోల్ ప్లాజాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.ఇదిలా ఉండగా మరోవైపు జాతీయ రహదారి విస్తరణ మొదట ప్రతిపాదనల ప్రకారం మల్కాపురం నుంచి విజయవాడ శివారులోని గొల్లపూడి దగ్గర పశ్చిమ బైపాస్ వరకు ఇప్పుడు ఉన్న 226 కిలోమీటర్లు 4 లైన్ల నుంచి 6 లైన్లుగా విస్తరించాలి. దీనికి రూ.8 వేల కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేసి, డీపీఆర్ సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గొల్లపూడి వరకు కాకుండా అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు క్రాస్ అయ్యే కంచికచర్ల వరకే విస్తరించే ప్రతిపాదనను హైవే అథారిటీ అధికారులు లేవనెత్తారు.




శుక్రవారం అండర్-19 వన్డేలో ఇంగ్లండ్‌పై గెలిచిన భారత్ జట్టు విజయోత్సవ హేల

# అండర్-19 వన్డే వరల్డ్ కప్ భారత్‌దే

## ఆరోసారి గెలిచిన ఇండియా

## 80 బంతుల్లోనే 175 పరుగులు తీసిన వైభవ్ సూర్యవంశీ

## 2022లోనూ ఇంగ్లండ్ జట్టును ఓడించి టైటిల్‌ను సాధించిన భారత్

**న్యూఢిల్లీ:** అండర్ 19 ప్రపంచకప్ 2026లో టీమిండియా విజేతగా నిలిచింది. అద్వితీయమైన ప్రదర్శనతో ఆరో టైటిల్‌ను ముద్దాడింది. ఇంగ్లండ్‌తో గురువారం జరిగిన ఫైనల్లో సమష్టిగా రాణించిన భారత్ 100 పరుగుల తేడాతో గెలుపొం దింది. బ్యాటింగ్‌లో వైభవ్ సూర్యవంశీ, బౌలింగ్‌లో >>2




# ప్రవాసాంధ్రుల కోసం కొత్త బీమా పథకం



## విదేశాల్లో పనిచేస్తున్న తెలుగువారికి ఆర్థికభద్రత లక్ష్యం: సిఎం చంద్రబాబు

**విజయవాడ.ఫిబ్రవరి 6,ప్రభాతవార్తప్రతినిధి:** విదేశాలల్లో ఉండే ప్రవాసాంధ్రులకు అండగా ఉండేందుకు కొత్త బీమా పథకాన్ని అమలులోకి తీసుకుని వచ్చినట్లు ఏపీ సీఎం చంద్రబాబు వెల్లడించారు.సామాజిక మాధ్యమం 'ఎక్స్' ద్వారా ప్రవాస ఆంధ్రా భరోసా పేరిట ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు వివరించారు. విదే శాల్లో పనిచేస్తున్న ఆంధ్రులకు ఆర్థిక భద్రత, పూర్తి భరోసా కల్పించాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టామని సీఎం చంద్రబాబు తెలిపారు.ఇది ప్రవాసాంధ్రుల కుటుంబాలకు భీమా తో ధీమాను, భరోసాను అందించి రక్షణ కవచంలా పనిచేస్తుంది. ఈ పథకం ద్వారా ఉద్యోగం, విద్య లేదా వ్యాపారం కోసమైనా విదేశాలకు వెళ్లిన ఆంధ్రప్రదేశ్ నివాసితులకు బీమా రక్షణ లభిస్తుంది. ప్రవాసాంధ్ర భరోసా భీమా పథకం ప్రధాన లక్ష్యం ఇదే ముఖ్యంగా, విదేశాల్లో చదువుకునే వారికి, పని చేసేవారికి ఊహించని ఆకస్మిక సంఘటనలు ఎదురైనప్పుడు, వారి మరణం సంభవించినప్పుడు ప్రవాసాంధ్రుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా నివారించడమే ఈ పథకం యొక్క ప్రధాన లక్ష్యం. పథకంలో నమోదైన వ్యక్తికి ప్రమాదవశాత్తు మరణం సంభవించినా లేదా శాశ్వత అంగవైకల్యం ఏర్పడినా, వారి కుటుంబానికి రూ.10 లక్షల వరకు ఆర్థిక సహాయం ఇస్తారు. ఈ పథకం పొందటానికి వీరే అర్హులు ఇది రాష్ట్ర >>2

# ఇక డిజిటల్ పాస్‌బుక్‌లు



రైతులకు పాస్‌బుక్‌లు అందచేస్తున్న సిఎం చంద్రబాబు

## రైతుల భూములకు పూర్తి భద్రత

## 2027 జూన్‌లోపే పోలవరం పూర్తి చేస్తాం

## ఉద్యానహబ్‌గా రాయలసీమ

## నేను 1995 నాటి చంద్రబాబునే: ముఖ్యమంత్రి

**ఎమ్మిగనూరు క్రైం, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త :** రైతుల భూములకు సంపూర్ణ భద్రత కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ కు ఎవరైనా భంగం కలిగిస్తే తాట తీస్తానని సీఎం చంద్రబాబు నాయుడు హెచ్చ రించారు. ఎమ్మిగనూరు మండలం కలుగట్ల గ్రామంలో శుక్రవారం నిర్వహించిన మీ భూమిమీ హక్కు కార్యక్రమంలో భాగంగా పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ఆయన విస్తృతంగా ప్రసంగించారు. రాజముద్రతో, విశిష్ట భద్రతా ఫీచర్లతో కూడిన భూ యాజమాన్య పత్రాలను రైతులకు అందించడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. భూమి రైతుకు నమ్మకం, విశ్వాసం, అమ్మతో సమానమని ముఖ్యమంత్రి అన్నారు. తాతలు, తండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన భూములపై ఎవరూ అక్రమంగా హక్కు చెలాయించకుండా భద్రత కల్పించేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని తెలిపారు. గతంలో భూ రికార్డులను తారుమారు చేసి రైతులను ఇబ్బందులకు గురి చేసిన ఘటనలు చోటుచేసుకున్నాయని విమర్శించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ద్వారా వివాదాస్పద భూములపై పెత్తనం చేయడానికి ప్రయత్నాలు జరిగాయని ఆరోపిస్తూ, ఆ చట్టాన్ని రద్దు చేసి పారదర్శక వ్యవస్థను అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం క్యూఆర్ కోడ్ సహా పలు భద్రతా ఫీచర్లతో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేస్తున్నామని >>2

## వెంకన్న లడ్డూ నెయ్యి బాత్‌రూమ్ రసాయనాలతో తయారీ?

తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ వ్యవహారంపై గత ప్రభుత్వంపై ముఖ్యమంత్రి తీవ్ర విమర్శలు గుప్పించారు. గత ఐదేళ్ల పాలనలో శ్రీవేంకటేశ్వర స్వామి వారి ప్రతిష్టను దెబ్బ తీసేలా అపవిత్ర పనులు చేశారని ఆయన ఆరోపించారు. ముఖ్యంగా భక్తులు ఎంతో పవిత్రంగా భావించే లడ్డూ ప్రసాదం తయారీలో రసాయనాలతో కూడిన కల్తీ నెయ్యిని వాడటం అత్యంత దారుణమని ఆయన పేర్కొన్నారు. ప్రసాదం తయారీలో వాడిన నెయ్యి నాణ్యతపై వివరిస్తూ, బాత్రూంలను శుభ్రపరిచేందుకు ఉపయోగించే ప్రమాదకరమైన రసాయనాలతో ఆ నెయ్యిని తయారు చేయించారని ముఖ్యమంత్రి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఐదేళ్ల పాటు ఇలాంటి కల్తీ నెయ్యితోనే >>2

## జగన్ పర్యటనలో అపశ్రుతి ఇద్దరు మృతి

**విజయవాడ.ఫిబ్రవరి 6,ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్సార్సీపీ అధినేత జగన్ ఇబ్రహీంపట్నం పర్యటనలో అపశ్రుతి చోటు చేసుకుంది. ఆయనను చూసేందుకు వచ్చిన ఒక యువ కార్యకర్త, నాయకుడు మరణించారు. ఇబ్రహీంపట్టణంలో జోగి రమేష్‌ను పరామర్శించేందుకు ఆయన వచ్చారు.ఈ కార్యక్రమానికి వచ్చిన వైఎస్సార్సీపీ నాయకుడు డి. రాంబాబు జోగి ఇంటి సమీపంలో మృతి చెందాడు. జగన్ ఇబ్రహీంపట్నం పర్యటన దృష్ట్యా జోగి రమేష్ ఇంటికి వెళ్తున్న రాంబాబు ఇంటి సమీపంలోనే పల్స్ పడిపోయి కుప్పకూలాడు. సమీప ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధరించారు. ఇబ్రహీంపట్నంలోని చిల్లకల్లు వైఎస్సార్సీపీ గ్రామ అధ్యక్షుడిగా డి. రాంబాబు ఉన్నారు. ఈ విషయంపై టీడీపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని,రాంబాబు హృద్రోగ సమస్యతో ఉన్నారని,జగన్‌పై అభిమానం కార్యక్రమానికి వచ్చారని వైకాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు తన్నీరు నాగేశ్వరరావు తెలిపారు. రాంబాబు ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నామని,ఆయన కుటుంబానికి అండగా నిలుస్తామని తన్నీరు తెలిపారు.ఇక జగన్ వస్తున్నారనే ఉత్సాహంతో బైక్ పై స్టంట్ చేస్తూ రోడ్డుపై బార్ గేట్ ను గుద్దుకుని ఒక యువకుడు మృతి చెందారు.అతన్నియువకుడు భార్గవ్ గా గుర్తించారు.ఇబ్రహీంపట్నం కొత్తగేట్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు >>2




శుక్రవారం అవగాహన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి

# స్వర్ణగ్రామ, స్వర్ణవార్డు నిర్మాణమే లక్ష్యం

## ప్రతి ఉద్యోగి భాగస్వామికావాలి: మంత్రి డోలాబాల వీరాంజనేయస్వామి

**విజయవాడ,ఫిబ్రవరి 6,ప్రభాతవార్తప్రతినిధి:** స్వర్ణాంధ్ర 2047లక్ష్యసాధనలో ప్రతి ఉద్యోగి భాగస్వాములవ్వాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ, స్వర్ణ వార్డు స్వర్ణ గ్రామ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు.స్థానిక తుమ్మలపల్లి కళా క్షేత్రంలో శుక్రవారం జిల్లా, మండల, స్వర్ణ గ్రామ/స్వర్ణ వార్డు అధికారులకు, అర్బన్ స్వర్ణ వార్డు అధికారులకు రెండు రోజుల అవగాహన కార్యక్రమానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ, వికలాంగుల, సీనియర్ సిటిజన్ల సంక్షేమ, స్వర్ణ గ్రామ,వార్డు శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి ముఖ్యఅతిథి గా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మంత్రి మాట్లాడుతూ స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు, స్వర్ణ మండల, స్వర్ణ జిల్లాల ద్వారా స్వర్ణాంధ్రప్రదేశ్ సాధించడమే లక్ష్యమని అని అన్నారు. ముఖ్యమంత్రి నారా >>2

## మచిలీపట్నం పోర్టు అనుసంధాన హైవేకి

# 573 కోట్లు మంజూరు

## విజయవాడ-మచిలీపట్నం ఎన్‌హెచ్65 ఆరులేన్లుగా విస్తరణ: కేంద్రమంత్రి గడ్కరీ



**విజయవాడ.ఫిబ్రవరి 6,ప్రభాతవార్తప్రతినిధి:**ఏపీలో ఎన్‌హెచ్ నెట్‌వర్క్ అభివృద్ధికి నిరంతర నిధులు కేటాయిస్తున్నట్లు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ పార్లమెంటులో తెలిపారు.తన సామాజిక మాధ్యమంలోను కీలకం ఈ విషయం వెల్లడించారు. మచిలీపట్నం పోర్టుకు ఎన్‌హెచ్ 65, ఎన్‌హెచ్ 216 జంక్షన్ నుంచి ఆరు వరుసల రోడ్డు నిర్మాణానికి రూ.573.77 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు ట్వీట్‌లో నితిన్ గడ్కరీ వివరించారు.ఈ ప్రాజెక్ట్ ద్వారా ఫ్రైట్ టర్న్‌అరౌండ్ టైమ్ సహా ట్రాఫిక్ కంజెస్టన్ తగ్గుతుందని కేంద్రం వెల్లడించారు. విజయవాడ వైపు నుంచి వెళ్లే వాహనాలు నేరుగా మచిలీపట్నం పోర్టుకు రాకపోకలు సాగించేందుకు వీలుగా అనుసంధాన హైవే నిర్మాణానికి రూ.573.77 కోట్ల మేర నిధులు మంజూరయ్యాయి. దీంతో 8 కి.మీ. మేర ఆరు వరుసలతో దీనిని నిర్మించనున్నారు. ఈ మేరకు కేంద్ర రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వశాఖ (మోర్త్) >>2



# ఇస్లామాబాద్‌లో భారీ పేలుడు 5లో

## 31మందిపైగా దుర్మరణం

## 160మందికిపైగా గాయాలు

# ఇస్లామాబాద్‌లో భారీ పేలుడు

## 31 మందికిపైగా దుర్మరణం, 160 మందికి పైగా గాయాలు

### క్షతగాత్రులలో పలువురి పరిస్థితి విషమం

### ఓ ప్రార్థనామందిరం వెలుపల జరిగిన ఆత్మాహుతి దాడి

### ఇస్లామాబాద్‌లో ఎమర్జెన్సీ విధింపు



**ఇస్లామాబాద్, ఫిబ్రవరి 6:** పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో భారీ పేలుడు సంభవించింది. షెహజాద్ టౌన్ ఏరియా టేర్లాయి ఇమామ్ బారగాహ్ వద్ద శుక్రవారం జరిగిన ఈ పేలుడులో సుమారు 31 మందికిపైగా మరణించగా.. 160 మందికిపైగా గాయపడినట్టు తెలుస్తోంది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని స్థానిక అధికారులు చెబుతున్నారు. ఇది ఆత్మాహుతి బాంబర్ దాడిగా అనుమానిస్తున్నారు. సమాచారం తెలిసిన వెంటనే పెద్దఎత్తున భద్రతా బలగాలు ఆ ప్రాంతానికి చేరుకుని తక్షణ సహాయక చర్యలు చేపట్టాయి. క్షతగాత్రులను పాకిస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు తరలిస్తున్నారు. గాయపడిన వారిలో చాలామంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం షియా ప్రార్థనా మందిరం ప్రధాన ద్వారం వద్ద ఆత్మాహుతి దాడి జరిగినట్టు చెబుతున్నారు. భారీ దాడిలో ఇస్లామాబాద్‌లో పాకిస్థాన్ ప్రభుత్వం ఎమర్జెన్సీ విధించింది. బాంబర్‌ను ముందుగా ద్వారాల వద్దే సెక్యూరిటీ అధికారులు నిలిపివేశారు. ప్రధాన మందిరంలోకి ప్రవేశించకుండా అడ్డుకున్నారని అక్కడి అధికారులు చెబుతున్నారు. అదే సమయంలో ఆత్మాహుతి బాంబర్ తనను తాను పేల్చుకున్నాడని చెప్పారు. ఒకవేళ ప్రధా ప్రార్థనా స్థలంలో పేలు జరిగితే భారీ సంఖ్యలో భక్తులు మరణించేవారని చెబుతున్నారు. భక్తులు బయటకు వస్తున్న సమయంలో ఈ దాడి జరిగినట్లు తెలుస్తోంది. పేలుడు తీవ్రతతో ప్రార్థనా మందిరం ప్రవేశద్వారం పూర్తిగా ధ్వంసమవ్వగా, చుట్టుపక్కల భవనాల కిటికీలు పగిలిపోయాయి. రోడ్లపై శిథిలాలు చెల్లా చెదురుగా పడిపోయాయి.

ఇది బలోచిస్థాన్ లిబరేషనన ఆర్మీ (బిఎల్ఎ) పనిగా అనుమానిస్తున్నారు. దాడి నేపథ్యంలో ఇస్లామాబాద్‌లో అత్యవసర పరిస్థితిని అధికారులు ప్రకటించారు.

గత మూడు నెలల్లో ఇస్లామాబాద్‌లో ఆత్మాహుతి దాడులు జరగడం ఇది రెండోసారి. గతేడాది నవంబరులో ఇస్లామాబాద్ జిల్లా జ్యుడిషియల్ కాంప్లెక్స్ వద్ద జరిగిన ఆత్మాహుతి దాడిలో 12 మంది మరణించగా.. 27 మంది గాయపడ్డారు.



# చర్చలు విఫలమైతే బలప్రయోగమే

## ఇరాన్‌కు అమెరికా హెచ్చరిక

**వాషింగ్టన్, ఫిబ్రవరి 6:** ఒమన్ వేదికగా ఇరాన్-అమెరికాల మధ్య అణుచర్చలు ప్రారంభం కానున్నాయి. ఈ చర్చల్లో ఇరు దేశాలు ఎలాంటి నిర్ణయం తీసుకోనున్నాయా అని అంతా ఆసక్తికరంగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ కీలక వ్యాఖ్యలు చేశారు. చర్చలు విఫలమైతే బలప్రయోగానికి కూడా తమ దేశ అధ్యక్షుడు ట్రంప్ వెనుకాడబోరన్నారు. గురువారం (అమెరికా కాలమానం ప్రకారం) విలేకరులతో మాట్లాడుతూ లీవిట్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఒమన్ చర్చల్లో ఇరాన్‌తో ఒక ఒప్పందం కుదుర్చుకోవడం కోసం ట్రంప్ ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. అణురహిత ఇరాన్ డిమాండ్‌కు తాము కట్టుబడి ఉన్నామన్నారు. ఈ క్రమంలో దౌత్యం సాధ్యం కాకపోతే.. ట్రంప్‌నకు మరిన్ని ఎంపికలు ఉన్నాయని హెచ్చరించారు. చర్చల నేపథ్యంలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీకి ట్రంప్ గట్టి హెచ్చరికలు చేశారు 'ఖమేనీ కలత చెందక తప్పదు' అని వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా.. రివల్యూషనరీ గార్డ్స్ స్థావరంలోని అండర్ గ్రౌండ్‌లో టెహ్రాన్ దీర్ఘశ్రేణి ఖోర్రామ్‌షహర్-4 క్షిపణులను మోహరించిందని స్థానిక మీడియా పేర్కొంది. అమెరికాకు చెందిన విమాన వాహక నౌకలు, యుద్ధనౌకలు, నిఘా విమానాలతోపాటు అనేకమంది అదనపు దళాలు ఈ ప్రాంతంలో ఇప్పటికే మొహరించిన సంగతి తెలిసిందే. ఇరాన్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో వేలాది మంది ఆందోళనకారులు ప్రాణాలు కోల్పోయారు. దీనిపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆందోళనకారులకు ఏమైనా జరిగితే తాము జోక్యం చేసుకుంటామని టెహ్రాన్‌ను హెచ్చరించారు. ఈ క్రమంలో అమెరికా యుద్ధనౌకలను ఆ దేశం దిశగా పంపించడం ఉద్రిక్తతలను మరింత పెంచింది. ఆ తర్వాత అణు చర్చలకు ఇరు దేశాలు అంగీకరించాయి. శుక్రవారం ఒమర్ వేదికగా ఇది జరగనున్నాయి. ఇందులో అణు చర్చలతోపాటు మరికొన్ని విషయాలపై కూడా సమాలోచనలు జరపాలని టెహ్రానన భావిస్తున్నట్లు తెలుస్తోంది.

# కీలక వడ్డీరేట్లు యథాతథం

## - ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడి



**ముంబయి, ఫిబ్రవరి 6:** కీలక వడ్డీరేట్లలో రిజర్వ్ బ్యాంక్ ఎలాంటి మార్పు చేయలేదు. మునుపటి వడ్డీరేట్లను యథాతథంగా ఉంచింది. ఈ మేరకు శుక్రవారం నిర్వహించిన ద్రవ్య పరపతి విధాన సమీక్షలో తీసుకున్న నిర్ణయాలను ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. ఈసారి రెపో రేటులో ఎలాంటి మార్పు లేదని, 5.25 శాతం వద్దే కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కేంద్రం బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తర్వాత ఆర్‌బిఐ నిర్వహించిన తొలి ద్వైమాసిక సమీక్ష ఇది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 7.4 శాతం వృద్ధి నమోదవుతుందని ఆబిఐ అంచనా వేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27) తొలి త్రైమాసికంలో 6.9శాతం, రెండో త్రైమాసికంలో 7శాతం వృద్ధి నమోదవ్వొచ్చని సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం 2.1 శాతంగా ఉండొచ్చని తెలిపారు. అదేవిధంగా 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో 4 శాతం, రెండో త్రైమాసికంలో 4.2 శాతం ద్రవ్యోల్బణం నమోదు కావచ్చని అర్బీఐ అంచనా వేసినట్లు వివరించారు.

**డిజిటల్ మోసాల్లో బాధితులకు రూ.25 వేల సాయం:** సైబర్ నేరాలు ఇటీవల పెరిగిపోతున్న క్రమంలో బాధితులకు అండగా నిలిచేందుకు ఆర్బీఐ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం కీలక ప్రకటన చేశారు. సైబర్ నేరాలు జరిగినప్పుడు బ్యాంకింగ్ కస్టమర్లకు పరిహారం అందేందేలా ఆర్బీఐ కొత్త నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సైబర్ నేరాల బారిన పడ్డ బాధితులకు రూ.25 వేల వరకు పరిహారం అందించాలని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. బ్యాంకింగ్ ఖాతాదారులు నష్టపోయిన సమయంలో కొంతమేర ఆర్థిక సాయం అందించేందుకు ఈ పరిహారం ఉపయోగపడుతుంది. డిజిటల్ చెల్లింపులపై వినియోగదారులకు భద్రత కల్పించడం, కస్టమర్ల ప్రయోజనాలను కాపాడటం, తక్షణ ఆర్థిక సాయం అందించే విధంగా ప్రతిపాదించినట్లు వివరించారు. త్వరలో దీనిపై మార్గదర్శకాలను రూపొందించి విడుదల చేస్తామన్నారు.

**ఖాతాదారుల భద్రతకు పెద్దపీట.. మూడు కీలక అంశాలపై కొత్త రూల్స్:** బ్యాంకు ఖాతాదారుల ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. చిన్న మొత్తంలో జరిగే మోసపూరిత లావాదేవీలకు పరిహారం, ఆర్థిక ఉత్పత్తుల మిస్‌సెల్లింగ్‌కు అడ్డుకట్ట, లోన్ రికవరీ ఏజెంట్లపై ఏకరీతి నిబంధనలు తీసుకురానున్నట్లు ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ప్రకటించారు. ఈ మూడు కీలక అంశాలపై త్వరలోనే ముసాయిదా మార్గదర్శకాలను ప్రజాభిప్రాయ సేకరణ కోసం విడుదల చేయనున్నట్లు తెలిపారు. చిన్న విలువ గల మోసపూరిత లావాదేవీలు జరిగినప్పుడు వినియోగదారులకు పరిహారం అందించేందుకు కొత్త నిబంధనలను రూపొందిస్తున్నట్లు ఆర్బీఐ గవర్నర్ తెలిపారు. ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్ లావాదేవీలలో కస్టమర్ల బాధ్యతను పరిమితం చేస్తూ 2017లో మార్గదర్శకాలు జారీ చేశామని, అయితే అప్పటి నుంచి సాంకేతికతలో భారీ మార్పులు వచ్చిన నేపథ్యంలో వాటిని సమీక్షి స్తున్నామని వివరించారు. అలాగే బ్యాంకులు, నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు (ఎన్‌బిఎఫ్‌సిలు) ఆర్థిక ఉత్పత్తులను, సేవలను తప్పుదోవ పట్టించేలా విక్రయించడాన్ని (మిస్‌సెల్లింగ్) అరికట్టేందుకు నిబంధనలను కఠినతరం చేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారుల అవసరాలకు, వారి రిస్క్ సామర్థ్యానికిసరిపోని ఉత్పత్తులను విక్రయించడం వల్ల ఇరు వర్గాలకూ నష్టమని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఆర్థిక ఉత్పత్తుల ప్రకటనలు, మార్కెటింగ్, విక్రయాలపై సమగ్ర మార్గదర్శకాలను తీసుకురానున్నారు. ఇక, లోన్ రికవరీకి సంబంధించి రికవరీ ఏజెంట్ల నియామకం, వారి ప్రవర్తనపై ప్రస్తుతం బ్యాంకులకు, ఎన్‌బిఎఫ్‌సిలకు వేర్వేరు నిబంధనలు అమలవుతున్నాయని గవర్నర్ గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో అన్ని నియంత్రిత సంస్థలకు ఒకే రకమైన, ఏకీకృత నిబంధనలను తీసుకురావాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ అంశంపైనా ముసాయిదా మార్గదర్శకాలను త్వరలో ప్రజాభిప్రాయ సేకరణకు అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు.

**రూ.20 లక్షల వరకు పూచీకత్తు లేకుండా రుణం:** చిన్న వ్యాపారాలు చేసుకునేవారికి రిజర్వ్ బ్యాంక్ శుభవార్త అందించింది. వీరికి ఇప్పటివరకు పూచీకత్తు లేకుండా అందిస్తున్న బ్యాంకు రుణాల పరిమితిని పెంచుతూ నిర్ణయం తీసుకుంది. శుక్రవారం నుంచి మొదలైన ఆర్బీఐ ద్రవ్య పరపతి విధాన సమావేశంలో ఈ ప్రకటన చేశారు. ఇప్పటివరకు మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ వ్యాపారాలకు రూ.10 లక్షల వరకు పూచీకత్తు లేని రుణం అందిస్తున్నారు. దీనిని ఇప్పుడు రూ.20 లక్షలకు పెంచుతూ ఆర్బీఐ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు బ్యాంకులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో చిన్న వ్యాపారులు చేసేవారికి ఎలాంటి హామీ లేకుండా రూ.20 లక్షల వరకు లోన్ పొందే అవకాశం లభించనుంది. కొత్తగా లోన్ తీసుకునేవారితో పాటు వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేసుకునేవారికి కూడా రూ.20 లక్షల వరకు పూచీకత్తు ఉండదు. 2026 ఏప్రిల్ 1 నుంచి ఈ నిర్ణయాన్ని అమలు చేయనున్నట్లు ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టం చేశారు. చిన్న వ్యాపారాలు, స్టార్టప్స్ కంపెనీలకు ఈ నిర్ణయంతో ఎంతో ప్రయోజనం కలగనుంది.

## విజయ్‌కు మద్రాస్ హైకోర్టులో ఎదురుదెబ్బ

### ఐటి జరిమానా రూ.1.5 కోట్లు చెల్లించాల్సిందేనంటూ తీర్పు

**చెన్నై, ఫిబ్రవరి 6:** ప్రముఖ తమిళ హీరో, టివికె అధినేత విజయ్‌కు మద్రాస్ హైకోర్టులో చుక్కెదురైంది. ఆదాయపు పన్ను శాఖ విధించిన ట్యాక్స్ పెనాల్టీని రద్దు చేయాలంటూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. రూ.1.5 కోట్ల పెనాల్టీని చెల్లించాల్సిందేనని శుక్రవారం తీర్పు వెలువరించింది. 2015-16 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి విజయ్ తన ఆదాయాన్ని ఉద్దేశపూర్వకంగా తక్కువగా చూపించారని ఆదాయపు పన్ను శాఖ ఆరోపించింది. అప్పట్లో విడుదలైన పులి సినిమాకు తీసుకున్న పారితోషికాన్ని తగ్గించి చూపారని పేర్కొంది.

ఆ సినిమాకు రూ.15 కోట్లు పారితోషికంగా విజయ్ అందుకున్నారని, అందులో రూ.5 కోట్లను నగదు రూపంలో తీసుకున్నారని అధికారులు తెలిపారు. ఈ మొత్తాన్ని లెక్కల్లో చూపకుండా ఆదాయపు పన్ను ఎగ్గొట్టారని ఆరోపించారు. శాఖాపరమైన దర్యాప్తులో ఈ విషయం తేలడంతో విజయ్‌కు ఆదాయపు పన్ను శాఖ రూ.1.5 కోట్ల పెనాల్టీ విధించింది. ఈ పెనాల్టీని రద్దు చేయాలంటూ విజయ్ మద్రాస్ హైకోర్టులో అప్పీల్ చేసుకున్నారు. దీనిపై సుదీర్ఘ విచారణ జరిపిన మద్రాస్ హైకోర్టు గత నెల 23న తీర్పు రిజర్వు చేసింది. శుక్రవారం తీర్పు వెలువరిస్తూ.. ఆదాయపు పన్ను శాఖ విధించిన రూ.1.5 కోట్ల పెనాల్టీని చెల్లించాల్సిందేనని స్పష్టం చేసింది.

## వెండికోసం వృద్ధురాలిని పడుకున్న మంచం సహా ఎత్తుకెళ్లిన దొంగలు

### రాజస్థాన్‌లో ఘటన!

**జైపూర్, ఫిబ్రవరి 6:** వెండి ధరలు ఆకాశాన్నంటుతున్న వేళ, దొంగలు దారుణంగా ప్రవర్తిస్తున్నారు. రాజస్థాన్‌లోని భిల్వారా జిల్లాలో జరిగిన ఓ ఘటన అందరినీ దిగ్భ్రాంతికి గురి చేసింది. సుమారు కిలోన్నర బరువున్న వెండి ఆభరణాల కోసం 90 ఏళ్ల వృద్ధురాలిని ఆమె పడుకున్న మంచంతో సహా ఎత్తుకెళ్లారు. ఈ షాకింగ్ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే భిల్వారా జిల్లా అర్వాడ్ ప్రాంతంలోని కోఠియా గ్రామంలో మాజీ సర్పంచ్ నత్తి దేవి మాలి ఇంట్లోకి రాత్రి సమయంలో దొంగలు చొరబడ్డారు. ముందుగా ఇంట్లోని వారిని గదుల్లో బంధించి బయట గడి య పెట్టారు. వరండాలో మం చంపై నిద్రిస్తున్న నత్తిదేవి అత్తగారైన 90 ఏళ్ల ఛోటీ దేవిని గమనించారు. ఆమె ఒంటిపై భారీగా వెండి ఆభరణాలు ఉండటంతో నోరు నొక్కి మంచంతో పాటు సమీపంలోని పొలంలోకి ఎత్తుకెళ్లారు.

## చర్లపల్లి రైల్వే స్టేషన్ వద్ద తల్లీ బిడ్డల ఆత్మహత్యలపై వీడని మిస్టరీ

### విజయశాంతి రెడ్డి సహచర ఉద్యోగులు, కుటుంబ సభ్యులను విచారిస్తున్న పోలీసులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** చర్లపల్లి రైల్వే స్టేషన్ వద్ద ఘట్‌కేసర్ మార్గంలో గత నెల 30వ తేదీన అర్ధరాత్రి 12.40 గంటల సమయం లో బోడుప్పల్‌కు చెందిన విజయశాంతి రెడ్డి (38) ఆమె కుమార్తె చేతనా రెడ్డి (18), కుమారుడు విశాల్ రెడ్డి (16)లు గూడ్సు రైలు కిందపడి ఆత్మ హత్య చేసుకున్న ఘటనపై మిస్టరీ కొనసాగుతోంది. ఈ ఉదంతంపై అటు ఆమె భర్త సురేందర్ రెడ్డి సహా ఇతర కుటుంబ సభ్యుల నుంచి ఎలాంటి అనుమానాలు వ్యక్తం కాకపోవడం, అటు విజయశాంతి రెడ్డి పనిచేసే కార్యాలయంలోని సిబ్బంది సైతం నోరుమెదపక పోవడంతో దీనిపై ముందు కు సాగేందుకు పోలీసులకు క్లిష్టంగా మారింది. ఈ ఘటన జరిగిన రోజున దుబాయ్‌లో వున్న విజయశాంతి రెడ్డి భర్త సురేందర్ రెడ్డి మరుసటి రో జు హైదరాబాద్‌కు వచ్చి ముగ్గురి అంత్యక్రియలు నిర్వహించారు. రెండు రోజుల అనంతరం ఆయన పోలీసులకు వాంగ్మూలం ఇచ్చారు. తమ కుటు ంబంలో ఎలాంటి గొడవలు లేవని, తన భార్య విజయశాంతి రెడ్డి చాలా ధైర్యవంతురాలని, ఇద్దరు పిల్లలంటే ఆమెకు ప్రాణమని, తన భార్య ఇద్దరు పిల్లలతో కలిసి ఎందుకు ఆత్మహత్య చేసుకుందో తనకు ఇప్పటికీ అర్థం కావడం లేదని సురేందర్ రెడ్డి చెప్పారు. మరోవైపు విజయశాంతి రెడ్డి సోద రుడు చిరంజీవి రెడ్డి కూడా ఇదే విధంగా వాంగ్మూలం ఇచ్చారు. అయితే చివరగా విజయశాంతి రెడ్డి తన సోదరుడితోనే ఫోన్‌లో మాట్లాడడంతో అ తనితో వున్న లావాదేవీల గురించి పోలీసులు ఆరా తీస్తున్నారు. చిరంజీవి రెడ్డి బ్యాంకు స్టేట్ మెంట్లను, వ్యాపార లావాదేవీలను పోలీసులు పరిశీలిం చారు. ఆయన ఇంట్లో సోదాలు చేశారని తెలిసింది. ఇదే సమయంలో విజయ శాంతి రెడ్డి ఇంట్లోనూ పోలీసులు సోదాలు చేశారు. ఆమె బ్యాంకు లా వాదేవీలను పరిజ శీలించారు. పాస్ పుస్తకాన్ని, చెక్ పుస్తకాన్ని, ఇంకొన్ని వస్తువులను జప్తు చేశారు. విజయ శాంతి రెడ్డి దంపతుల మధ్య ఎలాంటి త గా దాలు లేవని స్థానికులు చెబుతున్నారు. వారుండే బోడుప్పల్‌లోని అపార్ట్‌మెంట్లో సహచరులు వారి గురించి సదాభిప్రాయాన్నే వ్యక్తం చేశారు. వా రి సొంతవూరైన మోత్కూరులోనూ వీరికి మంచి పేరే వుందని పోలీసుల విచారణలో తేలింది. ఈ దంపతులకు ఆర్థికంగా ఎలాంటి ఇబ్బందులు లే వని పోలీసుల విచారణలో నిర్ధారణ అయ్యింది. అటువంటి సమయంలో విజయశాంతి రెడ్డి తాను ఆత్మహత్య చేసుకోవడంతో పాటు తనతో పా టు ఇద్దరు పిల్లలను కూడా ఆత్మహత్యలకు పురిగొల్పడం పోలీసులకు అంతు చిక్కడం లేదు. మరోవైపు వీరిది హత్యగా జరుగుతున్న ప్రచారాన్ని పో లీసులు ఖండించారు. వీరిది ఆత్మహత్యేనని స్వయంగా గూడ్స్ రైలు డ్రైవర్ చెప్పడం ఇందుకు బలమైన సాక్ష్యంగా పోలీసులు నమోదు చేశారు. ఈ కేసులో విజయశాంతి రెడ్డి గత నెల 30వ తేదీన సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు ఎక్కడెక్కడ తిరిగింది...? ఆత్మహత్య చేసుకునే వరకు వున్న సిసి ఫుటేజీలను పోలీసులు స్వాధీనం చేసుకుని వాటిని పరిశీలిస్తున్నారు. ఈ కేసులో చర్లపల్లి రైల్వే స్టేషన్ అధికారులు, ఆర్‌పిఎఫ్ పోలీసుల వైఫల్య ంపైనా పోలీసులు విచారిస్తున్నారు.

## సంక్షిప్తంగా..

### నేపాల్‌లో బస్సులోయలో పడి 13 మంది మృతి

**ఖాట్మండ్, ఫిబ్రవరి 6:** నేపాల్ బైతాడి జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. ప్రయాణికులతో వెళ్తున్న బస్సు అదుపుతప్పి లోయలో పడిపోయింది. గురువారం రాత్రి జరిగిన ఈ ప్రమాదంలో 13 మంది అక్కడికక్కడే మృతి చెందగా.. 30 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ దుర్ఘటన ఉత్తరాఖండ్ సరిహద్దు సమీపంలో జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. మృతుల్లో ఎక్కువ మంది బజాంగ్ జిల్లాకు చెందిన వారని కఠ్మాండు పోలీసులు తెలిపారు. బస్సు కొండపై ప్రయాణిస్తున్న సమయంలో బ్రేక్ పైపు పగిలిపోవడంతో, డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు. దీంతో బస్సు లోయలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### స్కిడ్ గేమ్ చూసాడని మరణదండన

**ప్యాంగ్‌యాంగ్, ఫిబ్రవరి 6:** స్కిడ్ గేమ్ వంటి దక్షిణ కొరియా టివి షోలను వీక్షించినా, కే-పాప్‌ను ఆలకించినా ఉత్తరకొరియా ప్రభుత్వం తన ప్రజలకు మరణశిక్ష విధిస్తున్నదని మానవ హక్కుల సంస్థ ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ తాజాగా వెల్లడించింది. దక్షిన కొరియాకు చెందిన మీడియాను వినియోగించినా స్కూలు పిల్లలను సైతం ఉత్తర కొరియా ప్రభుత్వం కఠినంగా శిక్షిస్తున్నదని ఆమ్నెస్టీ తెలిపింది. విదేశీ కంటెంట్ వాడకంపై యువజనులను హెచ్చరించడానికి బహిరంగ మరణశిక్షలను బలవంతంగా వారికి చూపిస్తున్నదని ఉత్తరకొరియా నుంచి తప్పించుకుని పారిపోయిన పౌరుల వాంగ్మూలాన్ని ఉటంకిస్తూ ఆమ్నెస్టీ వెల్లడించింది. ఆరోగ్యం, సామాజిక హోదాపై శిక్షలు ఆధారపడి ఉంటాయని, పేద ప్రజలు మరణం సహా కఠిన శిక్షలను ఎదుర్కోవలసి ఉంటుందని, పలుకుబడి ఉన్న కుటుంబాల వారు అధికారులకు లంచాలు ఇచ్చి మరణశిక్షలను తప్పించుకుంటారని హక్కుల సంస్థ వివరించింది.



### 'ఘుష్ఖోర్ పండిట్' సినిమా నిలిపేయండి: మాయావతి




**లక్నో, ఫిబ్రవరి 6:** 'ఘుష్ఖోర్ పండిట్ ' సినిమా ఉత్తరప్రదేశ్‌లో తీవ్ర రాజకీయ దుమారం రేపుతోంది. ఈ సినిమాపై సోషల్ మీడియాలో ప్రకంపనలు సృష్టిస్తోంది. సినిమా టైటిల్ కుల తత్వానికి సంబంధించినదిగా, అవమానకరమైందిగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తక్షణమే సినిమాపై నిషేధం విధించాలని డిమాండ్ పెరుగుతోంది. ఇక ఈ వ్యవహారంపై బిఎస్పీ అధినేత్రి మాయావతి స్పందించారు. ఘుష్ఖోర్ పండిట్ సినిమాను నెట్‌ఫ్లిక్స్‌లో నిలిపివేయాలని కేంద్రాన్ని మాయావతి కోరారు. సినిమాలో పండిట్ అనే పదాన్ని ప్రతికూలంగా ఉపయోగించడం వల్ల బ్రాహ్మణ సమాజంలో ఆగ్రహావేశాలు ఉన్నాయని తెలిపారు. మాయావతి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉత్తరప్రదేశ్‌లోనే కాకుండా దేశవ్యాప్తంగా చిత్రం ద్వారా బ్రాహ్మణ సమాజాన్ని అగౌరవపరుస్తున్నారని తెలిపారు. సమాజంలోని పెద్ద వర్గం మనో భావాలను దెబ్బతీస్తున్నందున అటువంటి సినిమాను నిలిపివేయాలని కేంద్రాన్ని మాయావతి కోరారు.

### చైనా వెళుతున్న ఓడలో ఒడిశా నేవీ అధికారి మిస్సింగ్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6:** మారిషస్ సమీపంలో ఓ నౌకలో విధుల్లో ఉన్న భారత్‌కు చెందిన మర్చంట్ నేవీ అధికారి అదృశ్యమయ్యారు. ఈ విషయంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే జోక్యం చేసుకోవాలని బాధితుడి కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఆ అధికారిని ఒడిశాకు చెందిన సార్థక్ మహాపాత్రోగా గుర్తించారు. బాధితుడి కుటుంబ సభ్యులు పేర్కొన్న వివరాల ప్రకారం గతేడాది జులైలో ఒక ప్రైవేట్ షిప్పింగ్ కంపెనీలో సార్థక్ ఉద్యోగంలో చేరారు. అతడు ప్రయాణిస్తున్న నౌక సింగపూర్ నుంచి చైనాకు తిరిగివస్తోంది. ఫిబ్రవరి 2న తల్లిదండ్రులు, స్నేహితులతో అతడు వీడియో కాల్‌లో మాట్లాడాడు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుద్ధ్య శాఖ
నెం. 46/2025-26/ఎఇ2, ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు తేది: 02.02.2026
పని పేరు: విజయనగరం జిల్లాలో గంట్యాడ మండలంలో కిర్తుపర్తి గ్రామానికి త్రాగునీటి సౌకర్యం కల్పించడం గురించి. అంచనా విలువ: రూ.42.00 లక్షలు. టెండరు డాక్యుమెంట్ లభించు తేది: 10.02.2026, ఉ.11.00 గం.ల నుండి 25.02.2026 మ.3.00 గం.ల వరకు. ఇతర వివరాలను www.apeprocurement.gov.in లో చూడగలరు. ఫోన్: 9100120777.
సం/- పర్యవేక్షక ఇంజనీరు, గ్రా.నీ.స & పారిశుధ్యం, విజయనగరం
DIPR.No.19016/CL/Advt/1/1/2022-23, తేది: 06.02.2026

## మీకు ఏది కరెక్టయితే అదే చేయండి

### - ప్రధాని మోడీపై రాహుల్‌గాంధీ సెటైర్లు - ప్రభుత్వం వాస్తవాలను దాచిపెడుతోంది - ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6:** పార్లమెంట్‌లో ప్రతిపక్ష సభ్యులను మాట్లాడనివ్వరు. కానీ, విపక్షాలపై ఆరోపణలు గుప్పి స్తారంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ విరుచుకుపడ్డారు. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై రాజ్యసభలో ప్రధాని మోడీ ప్రసంగంపై విపక్ష నేత విమర్శలు గుప్పించారు. జో ఉచిత్ సమో... వహీ కరో (మీరు సరైనది అనుకున్నది చేయండి) అంటూ వ్యంగ్యంగా విమర్శించారు. పార్లమెంట్ మకర్ ద్వార్ వద్ద కాంగ్రెస్ సహా ప్రతిపక్ష ఎంపీలు శుక్రవారం ఉదయం చేపట్టిన నిరసనలో పాల్గొన్న రాహుల్, ఈ మేరకు పలు వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఉదయం పార్లమెంట్ మకర్ ద్వార్ వద్ద కాంగ్రెస్ సహా ప్రతిపక్ష ఎంపీలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జో ఉచిత్ సమ్జో వహీ కరో అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆందోళన కొనసాగించారు. భారత్, అమెరికా డీల్‌ను ట్రాప్ డీల్‌గా వర్ణిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఆ సమయంలో వారితోపాటు రాహుల్ గాంధీ కూడా పాల్గొని నినాదాలు చేశారు. అప్పుడే మీడియాతో మాట్లాడుతూ, జో ఉచిత్ సమ్జో వహీ కరో అంటూ విమర్శించారు. అదే సమయంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా మోడీ ప్రసంగం తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం వాస్తవాలను దాచిపెడుతోందని, ప్రతిపక్షం లేవనెత్తిన కీలక అంశాలకు ప్రధాని సమాధానం ఇవ్వకుండా తప్పించుకున్నారని ఆరోపించారు. ప్రధాని ప్రసంగ సమయంలో ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేస్తూ వాకౌట్ చేసిన విషయం తెలిసిందే. జాతీయ భద్రత, చైనా అంశాలపై తమ ఆందోళనలకు సరైన సమాధానం రాలేదనే కారణంతో సభను బహిష్కరించామని ఖర్గే తెలిపారు. ప్రధాని ప్రసంగంలో పనికొచ్చే అంశం ఒక్కటీ లేదని విమర్శలు గుప్పించారు. రాహుల్ గాంధీలో, కాంగ్రెస్ పార్టీలో సిక్కుమతంపై ద్వేషం ఉందని ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలపై ఖర్గే తీవ్రంగా స్పందించారు. ప్రధానమంత్రి వ్యాఖ్యలను ఆయన ఖండించారు.

## క్షయ వ్యాధిని గుర్తించేలా ఎఐ స్టెతస్కోప్‌లు

### రూపొందించిన జర్మనీ వైద్య బృందం

### వైద్య రంగంలో సరికొత్త ఆవిష్కరణ



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6:** ప్రపంచవ్యాప్తంగా మరణాలకు అత్యంత ప్రాణాంతకమైన క్షయవ్యాధి (టిబి) కొనసాగుతున్నందున, కృత్రిమ మేధస్సు (ఎఐ) ఆధారిత డిజిటల్ స్టెతస్కోప్‌లు క్లిష్టమైన స్క్రీనింగ్ అంతరాలను పూరించడంలో సహాయపడతాయని ఒక కొత్త అధ్యయనం చూపించింది, ముఖ్యంగా చేరుకోవడానికి కష్టతరమైన మారుమూల ప్రాంతాల్లో టిబి స్క్రీనింగ్‌లో ఉన్న లోపాలను ఈ టెక్నాలజీతో అధిగమించవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. జర్నల్ మెడ్ (సెల్ ప్రెస్)లో ప్రచురించబడిన కథనం ప్రకారం... డిజిటల్ టెక్నాలజీ, ఎఐతో కలిపి స్టెతస్కోప్‌లు స్క్రీనింగ్ కార్యక్రమాలలో ఎదురయ్యే సవాళ్లైన అండర్‌డిటెక్షన్, అధిక ధర, అసమాన యాక్సెస్ వంటి వాటికి వ్యతిరేకంగా మెరుగైన ఎంపికగా ఉండవచ్చని ప్రపంచ నిపుణులు అభిప్రాయపడ్డారు. ఎఐ ఆధారిత డిజిటల్ స్టెతస్కోప్‌లు ఊపిరితిత్తుల, హృదయ సంబంధ అసాధారణతలను గుర్తించడానికి ఆశాజనకమైన ఖచ్చితత్వం, సాధ్యతను ప్రదర్శించాయి, తొలి అధ్యయనాలలో ఆశాజనకమైన ఫలితాలు వచ్చాయి. ఈ సాధనం సామర్థ్యాన్ని మరింత అన్వేషించడానికి విభిన్నమైన, అధికభారం ఉన్న సెట్టింగ్‌లలో శిక్షణ, ధ్రువీకరణ చాలా అవసరం" అని కెనడాలోని మెక్‌గిల్ విశ్వవిద్యాలయ పరిశోధకుడు మధుకర్ పాయ్ బృందం పేర్కొంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (జూబీవీ) నివేదిక ప్రకారం, ప్రస్తుత స్క్రీనింగ్ విధానాల ద్వారా ఏటా సుమారు 27 లక్షల టీబీ కేసులను గుర్తించలేకపోతున్నారు. లక్షణాలు లేని వారిని గుర్తించడం, ఎక్స్‌రే వంటి పరీక్షల అధిక ఖర్చు, రేడియేషన్ భయాలు వంటివి ఇందుకు ప్రధాన కారణాలుగా ఉన్నాయి. ఈ సవాళ్లకు ఏఐ ఆధా రిత డిజిటల్ స్టెతస్కోప్‌లు సరైన పరిష్కారం చూపగలవని మెడ్ (సెల్ ప్రెస్) జర్నల్‌లో ప్రచురితమైన కథనంలో అంతర్జా తీయ నిపు ణులు పేర్కొన్నారు కెనడాలోని మెక్‌గిల్ యూని వర్సిటీ పరిశోధకుడు మధుకర్ పాయ్ నేతృత్వం లోని బృందం ఈ అధ్యయనం చేసింది.

# తిరుమల సమాచారం



## ఎన్ఆర్ఐలకు వివిపి బ్రేక్ దర్శనం

● ప్రతిరోజూ తల్లిదండ్రులతో వందమందికి అవకాశం

తిరుమల, ఫిబ్రవరి 6 ప్రభాతవార్తప్రతినిధి: విదేశాల్లో స్థిరపడిన ప్రవాసభారతీయులు కలియుగ ప్రత్యక్షదైవం ఏడుకొండల శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకునేలా తిరుమల తిరుపతి దేవస్థానం అవకాశం కల్పించింది. గతంలోనే ఈ సదుపాయం ఉన్నా ఇప్పుడు మరింత మెరుగు పరచి సౌలభ్యంగా తిరుమలకు చేరుకునేలా ముందుగానే ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే సదుపాయం ఉంది. ఇందుకు ఎన్ఆర్ఐ భక్తులకు వందమందికి ఈ విఐపి బ్రేక్ దర్శన భాగ్యం కలిగింది. ఎన్ఆర్ఐలు వారి తల్లిదండ్రులతో కలసి వచ్చినా వారికి అవకాశం కల్పిస్తోంది. గతంలో ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి (పొలిటికల్)నుండి అందిన లేఖమేరకు టిటిడి పాలకమండలిలో చర్చించి ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారు. ఎన్ఆర్ఐలు ఆయారోజుల్లో తిరుమలకు చేరుకుని ముందురోజు ఆధారాలతో ఫారమ్ పూర్తిచేసి దాఖలుచేస్తే విఐపి బ్రేక్ దర్శన భాగ్యం కల్పిస్తున్నారు. టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, పేష్కార్ రామకృష్ణ సానుకూలంగా వ్యవహరిస్తున్నారు. ఈ మేరకు ఏపిఎన్ఆర్ఐలు బ్రేక్ టిక్కెట్లు కొనుగోలుచేసి ఈ సదవకాశం వినియోగించుకోవచ్చు.



## వెంకన్న దర్శనంతో మనసు సంతోషం

తిరుమల, ఫిబ్రవరి 6 ప్రభాతవార్తప్రతినిధి: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులు అందరిపై ఉండాలని, స్వామివారిని దర్శించుకోవడంతో మనసు సంతోషంగా ఉందని పలువురు ప్రముఖులు తెలిపారు. శుక్రవారం ఉదయం స్వామివారి సుప్రభాతసేవలో సినీనటి మీనాక్షిచౌదరి, డాట్ శాఖ ఉద్యోగులు రామమనోహర్, తేజస్విని తదితరులు విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకున్నారు. శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. టిటిడి అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## గాజుసీసాలో ఆలయాల గోపురం



తిరుమల, ఫిబ్రవరి 6 ప్రభాతవార్తప్రతినిధి: దేశంలోని అనేక పుణ్యక్షేత్రాల ఆలయాల మహ ద్వార గోపురాలను గాజుసీసాలో అద్భుతంగా చిత్రీకరించి తనదైన అద్భుత చిత్ర కారుడిని వెలికిచూపాడు. మధ్యప్రదేశ్‌కు చెందిన మహేశ్ భూపాల్ చిన్నప్పటినుండి భక్తి భావంతో ఉండే వాడని, ఆలయాల గోపురాలను అద్భుతంగా సీసాలో చిత్రీకరించడం జరిగిందన్నారు.

## వేదనారాయణస్వామి ఆలయవిమాన అష్టబంధన మహాసంప్రోక్షణ

● గోడపత్రికల ఆవిష్కరణలో నూతన టిటిడి ఇఒ రవిచంద్ర

తిరుమల, ఫిబ్రవరి 6 ప్రభాతవార్తప్రతినిధి: తిరుమల తిరుపతి దేవస్థానంకు అనుబంధంగా ఉన్న తిరుపతి జిల్లా నాగలాపురం వేదనారాయణస్వామి ఆలయంలో ఈనెల 17నుండి చేపట్టే ఆలయ విమాన అష్టబంధన మహా సంప్రోక్షణ కార్యక్రమాల గోడపత్రికలను శుక్రవారం టిటిడి నూతన ఇఒ ముద్దాడ రవిచంద్ర ఆవిష్కరించారు. ఈ వైదిక కార్యక్రమం పోస్టర్లను ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. ఈనెల 17వతేదీ నుండి 22వరకు జరగనున్న రాజగోపుర, అష్టబంధన మహాసంప్రోక్షణ కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. తొలుత 17న ఉదయం 5.30గంటలకు ఆచార్య రుత్విక్‌వరణం, పుణ్యాహం, మృత్సంగ్రహణం, అంకురార్పణం జరగనుంది. 18న ఉదయం అష్టబంధన సమర్పణ, సాయంత్రం పుణ్యాహం, పంచాగ్ని ప్రతిష్ట, కుంభ వాహనం, ఆరాధన, హోమం, మహాపూర్ణాహుతి, 19న పంచగవ్యాదివాసం, నవకలశస్నపనం నిర్వహించనున్నారు. 20,21న యాగశాలలో వైదిక కార్యక్రమాలు జరుగుతాయి. 22న ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం వరకు విమాన రాజగోపుర సంప్రోక్షణం, 11.30గంటల నుండి గర్భాలయ మూలవర్లు మహాసంప్రోక్షణ నిర్వహిస్తారు. ఆ తరువాత భక్తులకు స్వామివారి దర్శనం కల్పిస్తారు. ఈ పోస్టర్లు ఆవిష్కరణలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఇఒలు వీరబ్రహ్మం, డాక్టర్ శరత్, డిప్యూటీ ఇఒ గోవిందరాజన్, ఆలయ సూపరింటెండెంట్ ధర్మయ్య పాల్గొన్నారు.

# గుడికొచ్చే ప్రతి మహిళకు పసుపు కుంకుమ, జాకెట్



● ఎవరైనా ఆలయం బయటే ● ఆలయం లోపల ఆగమశాస్త్ర ప్రకారమే ● మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: రాబోవు రోజుల్లో రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల్లో ఆలయానికి వచ్చే ప్రతి మహిళకు నిత్యం జాకెట్, పసుపు, కుంకుమ ప్రసాదంగా అంది స్తామని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఇక్కడి ఆలయ ఆవరణలోని బ్రహ్మగుడి వద్ద జరిపిన సమీక్ష తరువాత మీడియా సమావేశం లో మాట్లాడుతూ ఈ కార్యక్రమాలను శ్రీకాళ హస్తి నుంచి శ్రీకారం చుడుతున్నట్లు మంత్రి ప్రకటించారు. ఏ కార్యక్రమం అయినా శ్రీకాళ హస్తి నుంచి ప్రారంభిస్తారని అలాగే శ్రీకాళహస్తి నుంచి ప్రారంభించనున్నట్లు వివరించారు. ఇందుకు తాను, తన కుమార్తె, కోడలు చెరి రూ.1.8లక్షలు విరాళం అందించినట్లు మంత్రి ప్రకటించారు.

రాష్ట్రంలోని 495 ఆలయాల జీర్ణోద్ధారణకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 605 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు మంత్రి ప్రకటిం చారు. ఐదేళ్ళ వైకాపా ఒక్క ఆలయానికి సంబంధించి నిధులు కేటాయించారా? ఈ ఆల యాలు 18 నెలల్లో పూర్తి చేయుటకు ఆదేశించి నట్లు మంత్రి నారాయణరెడ్డి వివరించారు.

### శ్రీకాళహస్తి బ్రహ్మోత్సవాలకు రూ.6 కోట్లు

శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయంలో 13రోజుల పాటు నిర్వహించే శివరాత్రి బ్రహ్మోత్సవాలను రూ.6కోట్ల బడ్జెట్‌లో నిర్వహిస్తున్నట్లు మంత్రి ఆనం నారాయణరెడ్డి వివరించారు.

శివరాత్రి పర్వదినాన నాయకులు, అధికారులు, ఇతరులు ఆలయం బయటే పర్యవేక్షించాలి. ఆలయం లోపల ఆగమశాస్త్రానికి, హిందూ ధర్మ, సనాతన ధర్మాలకే ప్రాధాన్యత అన్నారు. ఆలయం లోపల నిలబడి క్యూలైన్లలో పలుకుబడి చేయటం తగదన్నారు. లోపల వేదపండితుల నిర్ణయం మేరకు పూజలు జరుగుతుందన్నారు.

### రూ.50ల టిక్కెట్లు రద్దు

మహాశివరాత్రి సందర్భంగా రూ.50ల దర్శనం టిక్కెట్లును రద్దు చేసినట్లు మంత్రి నారాయణ రెడ్డి ప్రకటించారు. మిగిలిన వారందరూ క్యూలైన్లలో ఫ్రీ దర్శనం అన్నారు. స్థానికులకు ఒక రోజు ఉచిత దర్శనం ఏర్పాటు చేయ నున్నట్లు వివరించారు. ఆలయాల్లో ఆధ్యాత్మి కతతో పాటు టూరిజంతో భక్తుల్లో భక్తి భావాన్ని పెంచుటకు కారిడార్‌ను అమలుకు పరిశీలిస్తున్నామని మంత్రి ఆనం నారాయణ రెడ్డి అన్నారు. ఈ సమావేశంలో శాసన సభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి, కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర, దేవాదాయశాఖ ప్రధాన కార్యదర్శి హరిజవహర్ లాల్, కమిషనర్ రామచంద్ర మోహన్, ఎస్‌పి సుబ్బరాయుడు, ఎఎస్‌పి రవిమనోహరాచారి, జాయింట్ కలెక్టర్ సందీప్ రఘువంశీ, ఆలయ చైర్మెన్ కొట్టె సాయి ప్రసాద్, ఇఒ డి.బాపిరెడ్డి పాల్గొన్నారు.

# బోధనాసుపత్రుల్లో హెర్బల్ గార్డెన్స్



● రోగులు, వారి సహాయకులకు ఆహ్లాదాన్ని పంచేలా ఏర్పాటు
● వాకింగ్ ట్రాక్ తోపాటు ఇతర సౌకర్యాలు
● స్థలాల గుర్తింపు ప్రక్రియ ప్రారంభం
● రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ వెల్లడి

విజయవాడ, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో ఔషధ మొక్కల తోటల (హెర్బల్ గార్డెన్స్) ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. రోగులు, వారి సహాయకులకు ఆహ్లాదాన్ని పంచేలా ఈ తోటల్లో పూల, ఔషధ మొక్కలను నాటతారు అలాగే వాకింగ్ ట్రాక్, బెంచీలు, మంచినీటి సదుపాయాన్ని కల్పించేందుకు అనువైన స్థలాలను అధికారులు పరిశీలిస్తున్నారు. తొలివిడతలో డైరెక్టరేటు ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) పరిధిలో ఉన్న అన్ని బోధనాసుపత్రులు, ప్రత్యేక స్పెషాలిటీ ఆసుపత్రు ల్లో పూల, ఔషధ మొక్కలతో కూడిన తోటలను ఏర్పాటుచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. డీఎంఈ పరిధిలో ఉన్న అన్ని బోధనాసుపత్రులు, విశాఖలోని స్విమ్స్, ఈఎన్టి, తిరుపతిలోని మెటర్నటీ ఆసుపత్రి, పలాసలోని కిడ్నీ రీసెర్చి ఇన్స్టిట్యూటు, ఇతర ప్రత్యేక ఆసుపత్రుల్లో ఔషధ మొక్కల తోటల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ కూడా ఈ తోటల ఏర్పాటులో భాగస్వామ్యం కానుంది.

### తులసి, ఆమ్లా, ఇతర ఔషధ మొక్కలు

ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న సలాల లభ్యత అనుసరించి తులసి, ఆమ్లా, బిల్వపత్ర, మునగ, ఆశ్వగంధ, రోస్మేరి, రణపాల, కలబంధ (ఆలోవెరా), అశోక, పసుపు, బ్రహ్మి వంటి ఔషధ మొక్కలను నాటతారు కనిష్ఠంగా 15 నుంచి 40 రకాల మొక్కలను తోటల్లో పెంచేందుకు వీలుంది కనీసం అర ఎకరా వరకు స్థలం అందుబాటులో ఉంటే దానిని తోటగా తీర్చిదిద్దుతారు. వీటిల్లో రోగులు నడిచేందుకు వాకింగ్ ట్రాకింగులను ఏర్పాటుచేస్తారు. ఇన్పషంట్లుగా ఉన్న వారితో ఉండే సహాయకులు కాసేపు ఈ తోటల్లో సేదదీరే విధంగా ఏర్పాట్లు చేయనున్నారు. వైద్య విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని కూడా ఈ తోటల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని ఔషధ, సుగంధ మొక్కల బోర్డు ముఖ్య కార్య నిర్వహణాధికారి ఆవుల చంద్రశేఖర్ తెలిపారు ఈ తోటల ఏర్పాటుకు దాతల నుంచి ఆర్థిక సహకారం కూడా తీసుకోనున్నారు. ఇటీవల జరిగిన డిపార్ట్మెంట్ రివ్యూలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఔషధ మొక్కల తోటల ఏర్పాటు పై ఆదేశాలు ఇచ్చారు.

# ఉచిత నిర్బంధ విద్య

## 1వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

విజయవాడ, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త ప్రతినిధి: ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం కింద ప్రైవేట్ పాఠశాలల్లో 2026-27 విద్యాసంవత్సరానికి సంబంధించి 1వ తరగతిలో పేద పిల్లల ప్రవేశాలకు ఈ నెల 6 నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తూ నోటిఫికేషన్‌ను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న, బలహీన వర్గాల పిల్లలకు రాష్ట్రంలో వారి నివాస సమీప ప్రాంతంలో అన్ని ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతిలో 25శాతం సీట్లు కేటాయిస్తామని సమగ్రశిక్ష డైరెక్టర్ బి.శ్రీనివాస రావు గురువారం పేర్కొన్నారు. ఈ నెల 20 నుంచి మార్చి 10 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. వివరాలకు సంబంధిత జిల్లా విద్యాశాఖ అధికారులను సంప్రదించవచ్చని, టోల్‌ఫ్రీ నెంబర్ 18004258599 ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అన్ని ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలలు ఆన్‌లైన్ పోర్టల్‌లో ఈ నెల 7 నుంచి 16వ తేది వరకు నమోదు చేయాలని, దరఖాస్తులను బట్టి విద్యార్థుల ప్రవేశానికి అర్హతను నిర్ణయిస్తారని తెలిపారు. ప్రస్తుత చిరునామా ధ్రువీకరణకు తల్లిదండ్రుల ఆధార్, ఓటరు, రేషన్ కార్డులు, భూమి హక్కుల పత్రం, ఉపాధి హామీ జాబ్ కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, విద్యుత్తు బిల్లు, అద్దె ఒప్పంద కాపీని ప్రామాణికంగా తీసుకుంటారు. పిల్లల వయసు ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుంది. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ పాఠశాలల్లో ప్రవేశాలకు 2020 ఏప్రిల్ 2 నుంచి 2021 మార్చి 31లోపు జన్మించి, ఐదేళ్ల వయసు నిండిన ఉండాలి. రాష్ట్ర సిలబస్ పాఠశాలల్లో ప్రవేశాలకు 2020 జూన్ 2 నుంచి 2021 మే 31 మధ్య జన్మించి ఉండాలి. ప్రవేశాలకు శుక్రవారం ప్రకటన విడుదల చేసింది. ఈ నెల 7 నుంచి 16 వరకు ప్రైవేటు పాఠశాలలు వివరాలను వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి. 20 నుంచి మార్చి 10 వరకు విద్యార్థుల ఆన్‌లైన్ వివరాల నమోదు జరుగుతుంది. మార్చి 17న గ్రామ, వార్డు సచివాలయాల డేటా ఆధారంగా ప్రవేశాలకు విద్యార్థుల అర్హత నిర్ధారిస్తారు.

## ఏ డిగ్రీ అయినా చదివించండి పిల్లలకు సమయం కేటాయించండి

### దేవ్‌బన్ యూనివర్శిటి గురువు ముఫ్తి ఆషరఫ్ అబ్బాస్



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: పిల్లలను డాక్టర్లు చేయండి, ఇంజనీర్లు చేయండి కానీ వారి మనస్సుల్లో మన సంప్రదాయాలు, సంస్కృతిని జొప్పించాలని దేవబన్ యూనివర్శిటి మత గురువు ముఫ్తి అషరప్ అబ్బాస్ సాహెబ్ ఖాస్మీ అన్నారు. శుక్రవారం శ్రీకాళహస్తిలోని జామియా దారుల్ ఉలుమ్ ముహమ్మదీయా పాఠశాలలు నలుగురు విద్యార్థులు 'హాపీజే ఖుర్ అన్' అయిన సందర్భంగా వారికి డిగ్రీలను బహూకరించారు. ఈ సందర్భంగా ఆషరఫ్ అబ్బాస్ మాట్లాడుతూ నేడు సమాజంలో నైతిక విలువలు కొరవడ్డాయన్నారు. మనం సంపాదనే ముఖ్యధ్యేయంగా పిల్లల ప్రవర్తనను విస్మరిస్తున్నామన్నారు. నేటి సమాజంలో డాక్టర్లు, లాయర్ల అవసరం ఎంతైనా ఉంది అయితే వారి మనస్సుల్లో ఇస్లాం మతం, ఈమాన్‌కు సంబంధించి అవగాహన కల్పించాలన్నారు. మన పిల్లల ప్రవర్తన తల్లిదండ్రుల ప్రవర్తన మీద కూడా ఆధారపడి ఉంటుందన్నారు. మనం సంపాదించిన సంపాదన మనతో రాదని మనం సంపాదించుకున్న మంచి మాత్రమే మరణం తరువాత నిలిచి ఉంటుందన్నారు.

ఈ సభలో మత గురువులు హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్ సాహెబ్, హాఫీజే ఖుర్‌ఆన్ అబ్దుల్ మతీన్ అల్లాఫ్, మౌలానా సుహేఫ్, షేహాజాద, ఆలం, మున్షి ఖాదర్ అన్వర్ అలి తదితరులు పాల్గొని దివ్యఖుర్ ఆన్‌లోని అంశాలను మహమ్మద్ ప్రవక్త జీవితాన్ని గురించి వివరించారు.

# డాక్టర్ దీపిక మృతిపై అన్ని కోణాల్లో వైద్యపరంగా వాస్తవ నిర్ధారణకు చర్యలు



● సిద్దార్థ ప్రభుత్వ వైద్యకాలేజీ ప్రిన్సిపల్ ఏడుకొండలరావు

విజయవాడ, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త ప్రతినిధి: సిద్ధార్థ మెడికల్ కాలేజీలో మూడో సంవత్సరం పీజీ చదువుతున్న దీపిక మృతి చెందటం చాలా బాధాకరమని సిద్దార్ధ ప్రభుత్వ వైద్యకాలేజీ ప్రిన్సిపల్ ఏ.ఏడుకొండలరావు అన్నారు. ఆమె మృతిపై అన్ని కోణాల్లోను వైద్యపరంగా వాస్తవ నిర్ధారణకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. అనంతపురంకి చెందిన స్టూడెంట్ డాక్టర్ దీపిక అనస్థీషియా డిపార్ట్మెంట్లో పీజీ చేస్తుందని తెలిపారు. దీపికా బుధవారం రాత్రి భోజనం బయట నుంచీ తెప్పించుకున్నారన్నారు. ఆమె ఆ భోజనం చేసింది. పీజీ చేస్తున్న దీపిక జూనియర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఇద్దరు కలిసి ఈవినింగ్ సమయంలో రెండు కేసులు కూడా కలిసి చేశారు. రాత్రి 9 గంటల ప్రాంతంలో బయట నుంచి భోజనం తెచ్చుకోవడం జరిగింది. రాత్రి 1.10 గంటల ప్రాంతంలో సీనియర్ పిజి దీపికను జూనియర్ పిజి ఒక కేసు సర్జరీ గురించి అడిగారు. నాకు హెల్త్ బాగోలేదు మీరు వెళ్ళండి అని దీపిక సలహా ఇవ్వటం జరిగింది. ఆ సమయంలో తనకు వాంతుల సమస్య ఉందని ఇంజక్షన్ చేయమని జూనియర్ పిజీని అడగటం జరిగిందన్నారు. తర్వాత దీపికకు కాల్ చేసినప్పుడు కాల్ లిఫ్ట్ చెయ్యలేదు. డాక్టర్ దీపికా రూములో కనిపించలేదు. ఎమెర్జెన్సీ వార్డ్‌లో స్పృహ తప్పి పడిపోయి ఉన్న స్థితిలో కనిపించగా జూనియర్ పీజీ హాస్పిటల్లో ఉన్న అనస్తేషియా డాక్టర్స్‌ను హెచ్ఓడిలను పిలిపించి సీపీఆర్ మొదలు పెట్టారు. గురువారం ఉదయం 2:10 హెచ్ఓడి ఇతర డాక్టర్ల బృందం వచ్చి ఆమెను రక్షించే ప్రయత్నం చేశారు. తర్వాత సిటీ స్కాన్ ఇతర పరీక్షలను నిర్వహించారు. అపస్మారక స్థితిలోకి వెళ్లి పోయిన నేపథ్యంలో ఆమె తల్లిదండ్రులకు.. హైదరాబాదులో ఉన్నటువంటి వాళ్ళ అక్కకు సమాచారం అందించాము. గత మూడు రోజుల నుండి తాను సెలవులో ఉన్నట్లు ఏడు కొండలు తెలిపారు. గురువారం తెల్లవారుజామున 3:36 నిమిషాలకు తనకు కాల్ చేయడం జరిగిందన్నారు. తనకు విషయం తెలిసిన వెంటనే డీఎంఈకి సమాచారం అందించానన్నారు. ఈసీజీ సిటీ స్కాన్ పలు రకాల టెస్టులు చేయడం జరిగిందన్నారు. వాటిలో ఎలాంటి మార్పు కనపడలేదు. 5 గంటల ప్రాంతంలో ఆమె మృతి చెందడం జరిగింది. పోస్టుమార్టం అనంతరం మరికొన్ని వివరాలు తెలిసే అవకాశం ఉందని డాక్టర్ ఏడుకొండలు వివరించారు.

## ఉపాధి హామీని భ్రష్టు పట్టించారు

### ప్రధాని మోడీపై పిసిసి చీఫ్ షర్మిల ఆరోపణలు

గంగవరం, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: కేంద్రంలో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో కాంగ్రెస్ అధికారంలో వున్న పదేళ్ళ పాటు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అద్భుతంగా నడిచిందని, ప్రధాని నరేంద్రమోడి అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఈ పథకంను భ్రష్టు పట్టిస్తున్నారని ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి తీవ్రంగా విమర్శించారు. మన్రేగ పరిరక్షణ యాత్రలో భాగంగా పలమనేరు నియోజకవర్గం గంగవరం మండలంలో ఏర్పాటు చేసిన రచ్చబండలో ఆమె మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఉపాధి హామీ పథకం అద్భుతంగా నడిచిందన్నారు. మోడి బాధ్యతలు స్వీకరించిన అనంతరం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంను భ్రష్టు పట్టించి, ఉపాధికి గ్రహణం పట్టించారని ధ్వజమెత్తారు. ఉపాధి హామీ రక్షణకు పేద కూలీలు ముందుకు వచ్చి కాంగ్రెస్ పార్టీ చేస్తున్న పరిరక్షణ పోరాటంలో ఉపాధి కూలీలు భాగస్వామ్యులు కావాలని ఆమె పిలుపునిచ్చారు.

# నిజాయితీ, అంకితభావంతో సేవలందిద్దాం

● అవసరాలకు అనుగుణంగా పనితీరు మెరుగుపరచుకోవాలి ● టిటిడి నూతన ఇఒ ముద్దాడ



తిరుమల, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రపంచ ప్రసిద్ధ హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతిష్టను మరింత ఇనుమడింపజేసేలా ప్రతి అధికారి, ఉద్యోగి నిజాయితీ, అంకితభావంతో సేవ లందించాలని నూతన టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర నిర్మొహమాటంగా వెల్లడించారు. తిరుమలక్షేత్ర ప్రాధా న్యతను, ఆలయ పవిత్రతను ముఖ్యమంత్రి ఆశయాల కనుగుణంగా కాపాడటంలో అందరూ కలసి పనిచేద్దా మని స్పష్టం చేశారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వం నుండి, సిఎం సూచించే ఆదేశాలతో శ్రీవారి సామాన్యభక్తులకు మరింత మెరుగ్గా సేవలందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు.

టిటిడిలో సాంకేతికతను మరింతగా ఉపయోగించుకునేలా ప్రణాళికలు రూపొందించు కుందామన్నారు. వేంకటేశ్వరస్వామి ఆశీర్వాదబలం, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కల్పించిన అవకాశంతోనే ధార్మిక సంస్థ టిటిడిఇఒగా బాధ్యతలు చేపట్టే అవకాశం కలిగిందని ఆయన అధికారులతో విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ అవకాశం తనలో మరింత బాధ్యతను పెంచిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు తెలిపారు.

టిటిడి ఇఒగా శుక్రవారం ఉదయం శ్రీవారి ఆలయంలో బాధ్యతలు చేపట్టిన తరువాత అన్నమయ్య భవనంలో, తిరుపతిలోని టిటిడి పరిపాలన భవనంలో అన్ని విభాగాధిపతులు, ముఖ్యమైన అధికారులతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. భక్తుల నుండి అభిప్రాయ సేకరణతో సేవల నాణ్యతను పెంచేందుకు నిర్ణయాలు తీసుకుందామని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలసిన సమయంలో టిటిడిలో పారదర్శకత, నిజాయితీ నాణ్యమైన సేవలందించేలా సూచనలు, సలహాలు ఇచ్చారన్నారు. దేవుని లడ్డూ ప్రసాదం, అన్నప్రసాదాల నాణ్యత మెరుగుపడటంతో భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. దేశంలోని అన్నిరాష్ట్రాల రాజధానుల్లో కూడా శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయాలు నిర్మించేందుకు అందరి సహకారం తీసుకుందామన్నారు.

భక్తులకు సేవ చేసే అవకాశం కల్పించిన సిఎం ఆశయాలకు అనుగుణంగా పనిచేద్దామని అధికారులకు నిర్దేశం చేశారు. టిటిడి అధికారులు, ఉద్యోగులు కూడా అంకితభావంతో అశేషసంఖ్యలో వస్తున్న భక్తులకు సంతృప్తికరంగా సేవలందిస్తుండటం అభినందనీయమన్నారు.

భక్తుల సూచనలు, అభిప్రాయాలు తీసుకుని టిటిడి సేవలు మెరుగుపరుస్తామని చెప్పారు. టిటిడి ఇన్‌ఛార్జి, అదనపు ఇఒ వెంకయ్యచౌదరి, జెఇఒలు వీరబ్రహ్మం, డాక్టర్ శరత్, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, డిప్యూటీ ఇఒలు భాస్కర్, ఆలయ పేష్కార్ రామకృష్ణ, డిఎఫ్ఒ ఫణికుమార్ నాయుడు, ధర్మగిరి వేద పాఠశాల ప్రిన్సిపాల్ కుప్పా శివ సుబ్రహ్మణ్యం అవధాని, డిప్యూటీ ఇఒలు సోమన్నారాయణ, ప్రశాంతి, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, పిఆర్ఒ నీలిమ ఉన్నారు.



## ఆలయం ఎదుట లక్కీడ్రా రీల్స్ ప్రధాన నిందితుడు అరెస్ట్

తిరుమల, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమల ఆలయ పవిత్రతకు భంగం కలిగించేలా, ఎలాంటి అనుమతి లేకుండా గోవిందుని ఆలయం ముందు లక్కీడ్రా పేరుతో రీల్స్‌వీడియో చేసి సామాజిక మాధ్యమంలో పోస్ట్‌చేసిన ప్రధాన నిందితుడు హైదరాబాద్‌కు చెందిన గోలి అనిల్‌ను తిరుమల పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుండి కారును స్వాధీనం చేసుకున్నారు.

ఈ సామాజిక మాధ్యమం మోసంకేసుపై తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆదేశాలతో తిరుమల పవిత్రతను కాపాడటంలో, పుణ్యక్షేత్రం ప్రాధాన్యత దృష్ట్యా కొండపై, ఆలయం పరిసరాల్లో ఎటువంటి రీల్స్, వీడియోలు తీయడం నిషేధం అన్నారు. దీన్ని ఖాతరుచేసి ఇద్దరు యువకులు హైదరాబాద్‌వాసి అనిల్, సిద్ధమోని నరేందర్ ఇద్దరూ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా "లక్కీడ్రా" పేరున ప్రజలను నమ్మించేందుకు తిరుమల శ్రీవారి ఆలయం ఎదుట వీడియో చిత్రీకరించి వాటిని సామాజిక మధ్యమంలో పోస్టుచేశారు. ఇదే లక్కీడ్రా వ్యవహారంలో భాగస్వామి నరేందర్‌పై హైదరాబాద్ పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయడంతో జైల్లో ఉన్నాడని తెలిపారు. ప్రతి భక్తుడు తిరుమల పవిత్రతను కాపాడాలని, ఇందుకు భక్తుడు ప్రవర్తించాలన్నారు. స్వలాభం కోసం పవిత్రస్థలాల గౌరవాన్ని భంగం కలిగించే పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తిరుమల పోలీసులు హెచ్చరించారు.

## ఉన్నత విద్యలో నాణ్యత ప్రమాణాలు పెంపు

### - యుజిసి కార్యదర్శి ఆచార్య మనీష్ జోషి



తిరుపతి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త ప్రతినిధి: ఉన్నత విద్యలో నాణ్యత ప్రమాణాలను పెంపొందించడం, వికసిత్ భారత్ లక్ష్య సాధన వైపు యువతను నడిపించటం ముఖ్య ఉద్దేశ్యంగా వికాస్ 2026 సదస్సు నిర్వహించడం జరిగిందని యుజిసి కార్యదర్శి ఆచార్య మనీష్ జోషి తెలిపారు. అప్రెంటిషిప్ ఎంబెడెడ్ డిగ్రీ ప్రోగ్రాం గైడెన్స్ అమలు చేసిన విద్యా సంస్థలు మరొకరితో దాని ఉపయోగాలను, అది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించటంలో ఎలా ఉపయోగపడుతుందో పరస్పరం పంచుకోవటానికి ఇదీ ఒక వేదికగా ఉంటుందన్నారు.

తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వికాస్ 2026 పై యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ జోనల్ సదస్సు, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం సంయుక్తంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా యూజీసీ కార్యదర్శి ఆచార్య మనీష్ జోషి పాల్గొని మాట్లాడుతూ ప్రయోగాత్మక అమలులో వచ్చే ఛాలెంజస్‌ని, విద్యార్థుల అభిప్రాయాలను అనుసరించి పాలసీ డెవలప్మెంట్‌ను రూపొందించడం జరుగుతుందన్నారు. ఇండస్ట్రీ అకాడమియా అనుసంధానం, బ్రెయిన్ స్టార్మింగ్ సెషన్స్ ఒక పాలసీ మాత్రమే రూపకల్పన చేసి అలా వదిలేయడమే కాకుండా దానిని ఉన్నత విద్యా సంస్థలలో అమలు చేయటం ముఖ్యమన్నారు.

ఈ కార్యక్రమానికి విశిష్ట అతిధిగా ఉన్నత విద్యామండలి వైస్ చైర్‌పర్సన్ ఆచార్య ఎస్.విజయభాస్కరరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పలు కొత్త ప్రణాళికలను, ఎంట్రప్రెన్యూర్స్ అభివృద్ధి చేయడంలో వ్యవస్థాపన రూపకల్పన చేస్తోందని తెలిపారు. పారిశ్రామికవేత్తలుగా తయారై ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని, స్టార్ట్ అప్స్‌ని ఇంకా ఎక్కువగా చేయాలని ఆంధ్రప్రదేశ్‌కి అవసరమైన స్కిల్డ్ ఫోర్స్ని త్వరితగతిన తయారు చేసుకుని వచ్చే అవకాశాలని అందిపుచ్చుకోవాలని అన్నారు.

మహిళ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వెన్నం ఉమా మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఎన్ఈపి ట్వంటీ ట్వంటీ రిఫార్మ్స్‌ను అమలు చేయటం ఇండస్ట్రీ అకడమియ అనుసంధానం స్వయంప్లస్ మాడ్యూల్స్ రూపకల్పన, కో క్రియేషన్ ఆఫ్ కరికులం వంటి ముఖ్య అంశాలపైన ఉపయోగకరమైన అర్థవంతమైన చర్చలు జరిపిందన్నారు. ఈఏఈడిపి ప్రోగ్రాంను అమలు చేయడంలో సఫలీకృతం అవటం కోసం ఈ సదస్సు ముఖ్య ఉద్దేశం అన్నారు. మహిళా వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఆర్.ఉష, సదస్సు కోఆర్డినేటర్స్ ఆచార్య విద్యావతి, ఆచార్య శోభారాణి, పరిపాలనాధికారులు పాల్గొన్నారు.



## ఎర్రచందనం నిందితులపై పిడి యాక్ట్

తిరుపతి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త ప్రతినిధి: శేషాచలం అడవుల్లో నుండి ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్న నిందితులను పట్టుకుంటున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. తిరుపతి జిల్లా ఎస్పీ, టాస్క్‌ఫోర్స్ చీఫ్ లంకెల సుబ్బరాయుడు ఆదేశాల మేరకు ఎర్రచందనం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నారు. పలు కేసుల్లో ముద్దాయిలుగా ఉన్న కర్నాటకకు చెందిన నారాయణస్వామి(48), తమిళనాడుకు చెందిన సయ్యద్ అబ్దుల్ లతీఫ్, ఎలియాస్ సేటు ఎలియాస్ సేటు బాయ్ (49)లపై టాస్క్‌ఫోర్స్ అధికారులు పీడీ యాక్ట్ అమలు చేశారు. టాస్క్‌ఫోర్స్ చీఫ్ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యాచరణ అములులో ఎస్పీ పి.శ్రీనివాస్, ఏఎస్పీ జె.కులశేఖర్ ఎక్కువ కేసుల్లో ఎర్రచందనం అక్రమ రవాణా వృత్తిగా చేసుకుని, ముఠాగా ఏర్పడి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న వారిపై పీడీ యాక్ట్‌లు అమలు చేస్తున్నారు. వీరిద్దరూ ఎర్రచందనం కొల్లగొట్టడుతూ, వన్య మృగాల చట్టాలను ఉల్లంఘించి నేరాలు చేస్తూ ప్రజాజీవనానికి అటంకం కలిగిస్తున్నట్లు గుర్తించారు. పీడీ యాక్ట్ అమలులో భాగంగా నిందితులను కడప సెంట్రల్ జైలుకు తరలించారు. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధకంలో పీడీ యాక్ట్ అమలు చేయడానికి వెనుకాడబోమని ఎస్పీ పి.శ్రీనివాస్ హెచ్చరించారు.

విశాఖపట్నం
అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు

వార్త

శనివారం 7, ఫిబ్రవరి 2026







## ఉపాధ్యాయుడుగా మారిన ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్...

ఎలమంచిలి, ఫిబ్రవరి 06, ప్రభాతవార్త

మున్సిపాలిటీ పరిధిలోని కొక్కిరాపల్లి గ్రామంలో గల కొక్కిరాపల్లి గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే సుందర విజయకుమార్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాలలోని విద్యార్థులతో ఎమ్మెల్యే సుందర్ విజయకుమార్ ఉపాధ్యాయుడుగా మరి ప్రేరణాత్మక సందేశం సమాజం పై అవగాహన పరీక్షలు రాయడంలో మెలకులను చేతి దస్తూరి పై అవగాహన కల్పించారు. విద్యార్థులతో వారి చదివే విధానాన్ని ప్రతి సబ్జెక్టుపై ఆరుకున్న జ్ఞానాన్ని మూల్యాంకనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఉన్నప్పటినుండి సమాజం దేశం తమ భవిష్యత్తుపై ప్రణాళికను 8వ పేజీలో

## విలువలతో కూడిన రాజకీయాలకు నిలువుటద్దం 'మండలి'



### సభకు రాని ఎమ్మెల్యేల జీతాల్లో కోత విధించాలన్నది నా అభిప్రాయం: స్పీకర్ అయ్యన్నపాత్రుడు -'అమ్మా.. నాన్న' పిలుపుల్లోనే మాధుర్యం.. 'మమ్మీ.. డాడీ' సంస్కృతికి స్వస్తి పలకాలి -ఘనంగా మండలి వెంకట కృష్ణారావు శత జయంతి ఉత్సవాలు

విశాఖపట్నం, ప్రభాతవార్త

విలువలతో కూడిన రాజకీయాలకు, నిస్వార్థ సామాజిక సేవకు నిలువుటద్దంలా నిలిచిన మహనీయుడు దివంగత మండలి వెంకట కృష్ణారావు అని ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు కొనియాడారు. గాంధేయవాది మండలి వెంకట కృష్ణారావు శత జయంతి ఉత్సవాలు శుక్రవారం సాయంత్రం విశాఖలోని కళాభారతి ఆడిటోరియంలో అత్యంత వైభవంగా జరిగాయి. రైటర్స్ అకాడమీ, కళాభారతి, గాంధీ సెంటర్, గాంధీ కళాక్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి స్పీకర్ అయ్యన్నపాత్రుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన స్పీకర్, వేదికపై ఉన్న మండలి వెంకట కృష్ణారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కృష్ణాజిల్లా అభివృద్ధికి, తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణకు 8వ పేజీలో

## గడువులోగా మాస్టర్ ప్లాన్ రోడ్ల విస్తరణ: గంటా

విశాఖపట్నం, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త



భీమిలి నియోజకవర్గంలో రూ.170 కోట్ల వ్యయంతో ప్రతిపాదించిన 7 మాస్టర్ ప్లాన్ రోడ్ల విస్తరణను గడువులోగా పూర్తి చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. మాస్టర్ ప్లాన్ రోడ్ల ప్రగతి, టీడీఆర్, నష్టపరిహారం అంశాలపై వీఎంఆర్డీఏ కార్యాలయంలో అధికారులు, స్థలాలు కోల్పోయిన వారితో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం వీఎంఆర్డీఏ ఛైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్, కమిషనర్ తేజ్ భరత్ లతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. భోగాపురం ఎయిర్ పోర్టు సిద్ధమయ్యే జూన్ 26 నాటికి విస్తరణ పూర్తి కావాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నామని, సీఎం చంద్రబాబు రోడ్ల ప్రగతిపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని తెలిపారు. ఎయిర్ పోర్టు నుంచి వచ్చే వారికి ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చేయడానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నామని వెల్లడించారు. స్థానికంగా వ్యక్తమవుతున్న అభ్యంతరాల గురించి సమావేశంలో బాధితులతో చర్చించామని పేర్కొన్నారు. రాజకీయ లబ్ధి కోసమే చలో గుంటూరు పేరుతో వైసీపీ హడావిడి చేస్తోందన్నారు. దేశంలోనే సీనియర్ రాజకీయ నాయకుడైన చంద్రబాబును అంబటి రాంబాబు ఏరకంగా దూషించారో ప్రజలందరూ చూశారని వ్యాఖ్యానించారు. ఆర్డీఓ సంగీత్ మాథుర్, సీసీపీ ప్రభాకర్, సీయూపీ శిల్ప తదితరులు పాల్గొన్నారు.

## కాలుష్య కోరల్లో మహా విశాఖ

### వాయు కాలుష్యంతో నగర వాసులు ఉక్కిరిబిక్కిరి



విశాఖపట్నం, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త

వాయు కాలుష్యంతో నగర వాసులు అల్లాడిపోతున్నారు. శుక్రవారం గాలిలో వాయు కాలుష్య సాంద్రత 205 (ఏక్యూఐ) పాయింట్లకు చేరింది. అదే సమయంలో ఢిల్లీలో 195 పాయింట్లే నమోదు కావడం గమనార్హం. హైదరాబాద్‌లో16 పాయింట్లే ఉండడంతో అన్నింటికంటే విశాఖలోనే అత్యధిక కాలుష్యం కనిపిస్తోంది. 'హైపొల్యూషన్ ఇన్ విశాఖపట్నం టుడే' అంటూ నగర వాసులు బయటకు కూడా రాలేకపోతున్నారు. అధికారులు చర్యలు చేపట్టాలంటున్న డిమాండ్ కూడా అధికమైంది.

## ఉక్కు సెగ..నిర్వాసితుల కదనరంగం!

### 8న గాజువాక లంక మైదానంలో 'మహాగర్జన' -40 ఏళ్ల నిరీక్షణకు ముగింపు పలకాలి -ఆర్-కార్డు దారులకు వన్ టైం సెటిల్మెంట్ చేయాలని డిమాండ్ -కదలిరావాలని ఐక్య సంఘం, డిపి యూనియన్ పిలుపు

గాజువాక,ఫిబ్రవరి 6,ప్రభాతవార్త



విశాఖ ఉక్కు సాక్షిగా.. నాలుగు దశాబ్దాలుగా న్యాయం కోసం పోరాడుతున్న నిర్వాసితులు ఇప్పుడు తమ గళాన్ని మరింత ఉధృతం చేయనున్నారు. తమ భూములను త్యాగం చేసి దశాబ్దాలు గడు స్తున్నా, నేటికీ పూర్తిస్థాయి న్యాయం జరగలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్న నిర్వాసిత సంఘాలు.. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు గాజువాక లంక మైదానంలో "మహాగర్జన"కు సిద్ధమయ్యారు. ఇటీవల పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సమావేశంలో సంఘం నాయకులు మాట్లాడుతూ, మిగిలి ఉన్న ఆర్-కార్డు దారులందరికీ తక్షణమే వన్ టైం సెటిల్మెంట్ ద్వారా పరిహారం అందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర టీడీపీ అధ్యక్షులు, స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ శ్రీభరత్ చొరవతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువచ్చేలా ఈ పోరాటాన్ని మలుస్తామని స్పష్టం చేశారు. నిర్వాసిత కుటుంబాలతో పాటు గాజువాక నియోజకవర్గ ప్రజలు, జిల్లా వ్యాప్తంగా ఉన్న మద్దతుదారులు భారీ సంఖ్యలో తరలివచ్చి ఈ సభను జయప్రదం చేయాలని ఐక్య సంఘం అధ్యక్షులు పీతన భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి ఉమ్మడి అప్పారావు పిలుపునిచ్చారు. సంఘం నాయకులు మహదేవ్, శీర సంజీవ్రావు, గల్లా రామకృష్ణ, అంగల దేముడు, మొల్లీ రవి, ఆనంద్ కుమార్, జ్యోతి రెడ్డి, తులసి, పేర్ల జగన్, నెల్లి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

## 2029లో వైకాపాదే అధికారం

### పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై ధ్వజం-అరెస్టులతో భయపెట్టలేరు -లడ్డు వ్యవహారం పక్కదారి పట్టించేందుకు కుట్ర -వైకాపా అధికార ప్రతినిధి ప్రముఖ యాంకర్ శ్యామల



గాజువాక,ఫిబ్రవరి 6,ప్రభాతవార్త :

వచ్చే 2029 ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించడం ఖాయమని, తిరిగి అధికారంలోకి వస్తామని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రముఖ యాంకర్ శ్యామల ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం మింది మాజీ మంత్రి గుడివాడ అమరనాథ్ విచ్చేసిన సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వంపై ఆమె తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అక్రమ అరెస్టులకు పాల్పడుతూ ప్రతిపక్ష గొంతు నొక్కాలని చూస్తోందని శ్యామల మండిపడ్డారు. "అరెస్టులతో మమ్మల్ని భయపెట్టాలని చూస్తున్నారు..కానీ వైకాపా శ్రేణులు

## స్థానిక అసోసియేషన్లకు పార్కుల అభివృద్ధి బాధ్యత

### భీమిలి రోడ్ల విస్తరణపై త్వరితగతిన నివేదిక :ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



భీమిలి, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త

స్థానిక అసోసియేషన్లకు అప్పగించడం ద్వారా పార్కులను.. సీఎస్ఆర్ నిధులతో స్మశానాలను.. అభివృద్ధి చేయాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. భీమిలి క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం జీవీఎంసీ మధురవాడ, భీమిలి జోన్ల సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. రెండు జోన్లలో ఉన్న పార్కులు, ఓపెన్ స్పేస్ లు, స్మశానాల సమాచారం, అక్కడున్న సమస్యలపై సమగ్ర వివరాలు అందజేయాలని ఆదేశించారు. ఒక ప్రణాళిక లేకుండా అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్స్ కోసం గోతులు తవ్వడం వల్ల 8వ పేజీలో

## వికసిత భారత్ దిశగా అడుగులు వేయాలి

### కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో అవగాహన పెంచాలి -20 పాయింట్ ప్రోగ్రాం చైర్మన్ లంక దినకర్




విశాఖపట్నం ఫిబ్రవరి 6 ప్రభాతవార్త

దేశాభివృద్ధిలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేపట్టిన 'వికసిత భారత్' సంకల్పం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్దేశించిన 'స్వర్ణాంధ్ర 2047' లక్ష్యాలను చేరుకోవడానికి ప్రభుత్వ అధికారులు సమన్వయంతో పనిచేయాలని 20 పాయింట్ ప్రోగ్రాం చైర్మన్ లంక దినకర్ కోరారు. శుక్రవారం మధ్యాహ్నం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్, విశాఖ ఉత్తర శాసనసభ్యులు విష్ణు కుమార్ రాజులతో కలసి విద్య, వైద్యం, జలజీవన్ మిషన్, పి ఎం సూర్య గర్ పథకాలపై చైర్మన్ లంక దినకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ విశాఖపట్నం జిల్లాను వికసిత విశాఖ జిల్లాగా తీర్చిదిద్దడానికి అధికారులు కృషి చేయాలని ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సమగ్రంగా ప్రజలకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజల్లో సంతృప్తి చెందే విధంగా అధికారులు నాయకులను భాగస్వామ్యం చేయాలని అన్నారు. ప్రజల ఆరోగ్యానికి స్వచ్ఛమైన నీరు అత్యంత అవసరమని, అందుకే జల్ జీవన్ మిషన్, అమృత్ పథకాల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉపాధి 8వ పేజీలో

## కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుతో పోర్ట్ డిప్యూటీ చైర్‌పర్సన్ భేటీ

(ప్రభాతవార్త-విశాఖపట్నం)



నగరంలో వున్న పోర్ట్ గెస్ట్ హౌస్‌లో శుక్రవారం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడ్ని పోర్ట్ డిప్యూటీ చైర్‌పర్సన్ రోషిణి అపరంజి కోరాధి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. సి.ఐ.ఎస్.ఎఫ్ కార్యకలాపాలను, భవిష్యత్ కార్యక్రమాలను పోర్ట్ డిప్యూటీ చైర్‌పర్సన్ రోషిణి అపరంజి కోరాధిను కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అడిగి తెలుసుకున్నారు. ఎఫ్.ఏ అండ్ సి.ఐ.ఓ రమణమూర్తి, సి.ఐ.ఎస్.ఎఫ్ కమాండెంట్ ఎస్.కే. బాజ్ పాయ్ పాల్గొన్నారు.

## పద్మశ్రీ మురళీ మోహన్‌ని సన్మానించిన మాజీ మంత్రి అవంతి




## బస్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రభుత్వ చర్యలు : గంటా

భీమిలి, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త



తగరపువలస బస్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. బస్ కాంప్లెక్స్ కోసం కేటాయించిన 4 ఎకరాల భూమిని ఆర్టీసీ ఆర్.ఎం.అప్పలనాయుడితో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కాంప్లెక్స్‌తో పాటు వాణిజ్య అవసరాల దృష్ట్యా మాల్‌ను కూడా అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. 2016లో శంకుస్థాపన చేసిన బస్ కాంప్లెక్స్ ఈ ప్రాంత ప్రజల కలగా అభివర్ణించారు. రవాణా వ్యవస్థలో వచ్చిన మార్పుల నేపథ్యంలో ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సులకు ప్రాధాన్యమిస్తోందన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టులో మరో 5 నెలల్లో పూర్తి స్థాయి కార్యకలాపాలు ప్రారంభం కానున్నందున బస్ కాంప్లెక్స్ కు విపరీతమైన డిమాండ్ ఉంటుందని వెల్లడించారు. కాంప్లెక్స్ నిర్మాణ అంచనాలు, 8వ పేజీలో

## మీరు ప్రజాప్రతినిధులా లేక బానిసలా?

### పాపప్రక్షాళన చేయాల్సింది పోయి.. సమర్థిస్తారా? వైసీపీ నేతల తీరుపై ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ నిప్పులు...




ఎలమంచిలి ఫిబ్రవరి 06, ప్రభాతవార్త

తిరుమల శ్రీవారి లడ్డు ప్రసా దం అపవిత్రం కావడంపై ఎమ్మె ల్యే సుందరపు విజయ్ కుమార్ వైసీపీ నాయకుల పై నిప్పులు చెరిగారు. పవిత్రమైన సనాతన ధర్మాన్ని, భక్తుల నమ్మకాలను కాలరాస్తున్నా వైసీపీ నేతలు నోరు మెదపకపోవడం శోచనీయమని ఆయన మండిపడ్డారు. శుక్రవారం పట్టణంలోని జిల్లా పరిషత్ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ వైయస్సార్సీపి నాయకులకు భక్తి 8వ పేజీలో

## కాపులంటే ముఖ్యమంత్రికి కక్ష ఎందుకు?

### మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్

విశాఖపట్నం, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త



కాపులు అంటే మొదటి నుంచి చంద్ర బాబుకు చిన్న చూపని వారంటే శత్రువులా చూస్తారని అని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ తెలిపారు. శుక్రవారం మద్ది లపాలెంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వంగవీటి రంగాను హత్య చేసి ముద్రగడను అనేక రకాలుగా వేధించడంతో పాటు అంబటి మీద దాడి చేసి ఆయన మీద తప్పుడు కేసులు పెట్టారని ఆరోపించారు. ఎవరికి అన్యాయం జరిగిన వైసీపీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. రేపు ఉదయం అంబటి రాంబాబు కుటుంబ సభ్యులకు సంఘీభావం తెలిపేందుకు వెళ్తున్నామని వెల్లడించారు. దాడులు చేసిన వారిని వదిలేసారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము చేసేది సంఘీభావ యాత్ర మాత్రమే 8వ పేజీలో

## అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



### వీఎంఆర్డీఏ, జీవీఎంసీ సమీక్షలో మంత్రి నారాయణ - వీఎంఆర్డీఏ రహదారుల అభివృద్ధి పనుల ప్రగతి పట్ల మంత్రి సంతృప్తి -వెలంపేటలో 177 మందికి ఇళ్ళ నిర్మాణం -త్వరలోనే శంకుస్థాపన చేయాలని నిర్ణయం

(ప్రభాతవార్త-విశాఖపట్నం)

జీవీఎంసీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులతో పాటు వీఎంఆర్డీఏ ప్రాజెక్టులను వేగవంతం చేయాలని మునిసిపల్, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి.నారాయణ అధికారులను ఆదేశించారు. శుక్రవారం అమరావతి, వెలగపూడిలో జీవీఎంసీ, వీఎంఆర్డీఏ అధికారులతో వివిధ అభివృద్ధి పనులపై ఆయన సమీక్షించారు. వీఎంఆర్డీఏ చేపడుతున్న బృహత్తర ప్రణాళిక ప్రాధాన్యత రహదారుల ప్రగతిని, బృహత్ ప్రణాళిక రీ-విజిట్ తదితర కీలక అంశాలపై

# స్థానిక అసోసియేషన్‌లకు పార్కుల అభివృద్ధి బాధ్యత

## భీమిలి రోడ్ల విస్తరణపై త్వరితగతిన నివేదిక : ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

భీమిలి, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త



స్థానిక అసోసియేషన్లకు అప్పగించడం ద్వారా పార్కులను.. సీఎస్ఆర్ నిధులతో స్మశానాలను.. అభి వృద్ధి చేయాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. భీమిలి క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం జీవీఎంసీ మధురవాడ, భీమిలి జోన్ల సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. రెండు జోన్లలో ఉన్న పార్కులు, ఓపెన్ స్పేస్‌లు, స్మశానాల సమాచారం, అక్కడున్న సమస్యలపై సమగ్ర వివరాలు అందజేయాలని ఆదేశించారు. ఒక ప్రణాళిక లేకుండా అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్స్ కోసం గోతులు తవ్వడం వల్ల అస్తవ్యస్త స్థితి నెలకొందని ఆగ్రహం వ్యక్తం చేశారు. భీమిలి బీచ్ రోడ్డు, మెయిన్ రోడ్డు, తగరపువలస రోడ్డు విస్తరణ వల్ల ఎన్ని కట్టడాలు పోతున్నాయనేది నివేదిక సిద్ధం చేయాల న్నారు. గతంలో భీమిలి - తగరపువలస రోడ్డు విస్తరణ కోసం 150 అడుగుల ఆర్డీపీ తయారు చేసినప్పటికీ, 80 అడుగులకు పరిమితం చేయాలని స్థానికుల నుంచి విజ్ఞప్తులు వస్తున్నాయని అధికారులు తెలియజేశారు. ఎండాడ రైతుబజార్ కోసం స్థలాన్ని ఎంపిక చేయాలని.. నిర్మాణం లో ఉన్న సాగర్ నగర్- ఎండాడ రోడ్డు మధ్యలో అడ్డంకులు తొలగించాలని ఎమ్మెల్యే చెప్పారు. భీమిలిలో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని.. వాటర్ ఫిల్టరేషన్ ప్లాంట్ లేకపోవడంతో క్లోరినేటెడ్ నీటినే తాగాల్సి వస్తుందని స్థానిక నాయకులు ఫిర్యాదు చేయగా.. పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. చిల్లపేట చెరువు, ఎండాడ చెరువు దగ్గర వాకింగ్ ట్రాక్ సహా సుందరీకరణ పనుల డిజైన్లు తయారు చేయాలన్నారు. అసంపూర్తిగా ఉన్న కళ్యాణ మండపాలను గుర్తించి పూర్తి చేయాలని, తగరపువలసలో కళ్యాణ మండపం కోసం స్థలాన్ని అన్వేషించాలని సూచించారు. పర్యాటకులను ఆకర్షించేలా బీచ్ రోడ్డులో విగ్రహాలు ఏర్పాటు చేయాలన్నారు. గంట స్తంభం దగ్గర మార్కెట్ వివాదాన్ని పరిష్కరించాలని, లైట్ హౌస్ ప్రాంతం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. జోనల్ కమిషనర్లు వి. అయ్యప్ప నాయుడు, నాగేంద్ర, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శాంతిరాజు, కార్పొరేటర్ గాదు చిన్ని కుమారి లక్ష్మి, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, గంటా నూకరాజు, గొలగాని నరేంద్ర, మొల్లి లక్ష్మణరావు, మాన్యాల సోంబాబు, కె.అచ్యుతరావు, లొడగల జానకిరామ్, కొప్పల రమేష్, తమ్మిన సూరిబాబు, చెట్టిపల్లి సన్యాసిరావు, పాసి త్రినాథరావు పాల్గొన్నారు.

# టి20 వరల్డ్ కప్.. బెట్టింగ్ బజార్‌కు విశాఖ హాట్‌స్పాట్..?

## - ఆన్‌లైన్ లింకులే ఆయుధం.. పోలీసుల నిఘా పెంపు

(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)

నేటి నుంచి టి20 వరల్డ్ కప్ ప్రారంభం కానున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా క్రికెట్ అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. అయితే ఈ ఉత్సాహాన్ని ఆసరాగా చేసుకుని అక్రమ క్రికెట్ బెట్టింగ్ మాఫియా మరోసారి రంగంలోకి దిగేందుకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తుంది. గతంలో జరిగిన సంఘటన ఆధారంగా విశాఖ జిల్లా కూడా బెట్టింగ్ కార్యక లాపాలకు కేంద్రంగా మారే అవకాశం ఉందన్న అంచనాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఐపీఎల్, వన్డే వరల్డ్ కప్ సమయాల్లో విశాఖ నగరం, పరిసర మండలాల్లో కోట్ల రూపాయల అక్రమ బెట్టింగ్ జరిగిన ఉదంతాలు వెలుగుచూశాయి. ఈసారి టి20 వరల్డ్ కప్ కావడంతో తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు ఆశిస్తూ యువతను టార్గెట్‌గా చేసుకుని బెట్టింగ్ నిర్వాహకులు కొత్త పద్ధతులకు తెరలేపినట్టు సమాచారం.

### ఆన్‌లైన్ బెట్టింగ్‌దే పైచేయి



మునుపటిలా ప్రత్యక్షంగా బుకీల వద్దకు వెళ్లకుండా, ఇప్పుడు ఆన్‌లైన్ యాప్‌లు, నకిలీ గేమింగ్ లింకులు, వాట్సాప్--టెలిగ్రామ్ గ్రూపుల ద్వారా బెట్టింగ్ జరుగుతోందని క్రికెట్ ప్రేమికులు చెబుతున్నారు. 'మ్యాచ్ ఫలితం', 'ఎన్ని రన్స్', 'తదుపరి ఓవర్‌లో ఎన్ని పరుగులు' వంటి అంశాలపై కూడా బెట్టింగ్ కొనసాగు తున్నట్టు తెలుస్తోంది. కొందరు బుకీలు విదేశీ సర్వర్లను ఉపయోగిస్తూ నగదు లావాదేవీలను డిజిటల్ వాలెట్ల ద్వారా నిర్వహిస్తున్నారని సమాచారం.

### యువతే లక్ష్యం

కళాశాల విద్యార్థులు, ప్రైవేట్ ఉద్యోగులు ముఖ్యంగా ఈ బెట్టింగ్ వలలో చిక్కుతున్నారు.చిన్న మొత్తంతో ప్రారంభమై, ఆ తర్వాత పెద్ద మొత్తాల వైపు దారితీసేలా మాఫియా మాయమాటలు చెప్పి మోసం చేస్తున్న ఉదంతాలు గతంలో నమోదయ్యాయి. అప్పులపాలై కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్న సంఘటనలు కూడా చోటుచేసుకున్నాయి.

### పోలీసుల అప్రమత్తత

బెట్టింగ్‌ను అరికట్టేందుకు విశాఖ జిల్లా పోలీస్ యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టినట్టు సమాచారం. విశాఖ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు సైబర్ క్రైమ్ విభాగం ప్రత్యేకంగా ఆన్‌లైన్ లావాదేవీలు, అనుమానాస్పద లింకులపై నిఘా పెట్టినట్టు తెలుస్తోంది. అక్రమ బెట్టింగ్‌లో పాల్గొంటే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

### ప్రజలకు హెచ్చరిక

క్రికెట్ వినోదంగా చూడాలి తప్ప, లాభనష్టాల ఆటగా మార్చుకోవద్దని పోలీస్ అధికారులు సూచిస్తున్నారు. బెట్టింగ్ చట్ట విరుద్ధమే కాకుండా ఆర్థికంగా, మానసికంగా తీవ్ర నష్టాన్ని మిగులుస్తుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని కోరుతున్నారు. అనుమానాస్పద బెట్టింగ్ కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు లేదా సైబర్ క్రైమ్ విభాగానికి తెలియజేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఉపాధ్యాయుడుగా మారిన ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్...

7వ పేజీ తరువాయి ..

రూపొందించుకోవాలని అన్నారు. తరగతి గదిలో కూర్చున్నప్పుడు నుండి టీచర్లు చెప్పే పాఠాలు సామాజిక అంశాలపై ప్రశ్నలను తయారు చేసుకుని ఉపాధ్యాయులతో వాటికి సమాధానాలు తెలుసుకొని చర్చించాలన్నారు. ప్రతి విద్యార్థి చేతి దస్తూరి బుద్ధి పరచుకోవాలని చేతి దస్తూరి బాగున్నట్లయితే పరీక్షల్లో మరిన్ని మార్పులు సాధించి వచ్చినని తెలిపారు. పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులు తొందరలోనే పరీక్షలు సమీపిస్తున్నందున సన్నద్ధంగా ఉండాలని సూచించారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి విద్యార్థులతో నాణ్యమైన ఆహారాన్ని మెనూకు తగ్గట్టుగా ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలోని ఎంఈఓ లు ప్రధానోపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం జాతీయ అంధత్వ , దృష్టిలోప నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ అనకాపల్లి జిల్లా 2025-26 పాఠశాల జూనియర్ కళాశాల విద్యార్థులకు ఉచిత కంటి అద్దములను ఎమ్మెల్యే సుందర్పు విజయకుమార్ పంపిణీ చేశారు. ఎలమంచిలి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డా.నిహారిక, పాల్గొన్నారు.

# మీరు ప్రజాప్రతినిధులా లేక బానిసలా?

7వ పేజీ తరువాయి ..

లేదు.. పోనీ భయం కూడా లేదా అని ప్రశ్నించిన ఆయన "ప్రపంచమంతా కొలిచే శ్రీనివాసుడు మన రాష్ట్రంలో ఉండటం మనం చేసుకున్న అదృష్టం. అలాంటి స్వామివారి ప్రసాదం విషయంలో ఇంత దారుణం జరిగితే.. కనీసం భయం, భక్తి కూడా లేకుండా వైసీపీ నేతలు మాట్లాడుతున్నారు. అసలు ఆ లడ్డులో నెయ్యి ఉందా? అని నేను అడుగుతున్నా. ఆగమ శాస్త్రం, సనాతన ధర్మం ప్రకారం జరగాల్సిన ప్రసాదం తయారీలో జంతువుల కొవ్వు కలవడం అక్షరాలా నేరమన్నారు. వైసీపీలో ఉన్న సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులను ఉద్దేశించి విజయ్ కుమార్ కీలక ప్రశ్నలు సంధించారు. "తప్పు జరిగినప్పుడు నాయకుడిని ప్రశ్నించలేరా? మీ పార్టీ అధ్యక్షుడు చెప్పిన స్క్రిప్ట్ చదవడం తప్ప, మీకు సొంత ఆలోచన లేదా? తప్పును తప్పు అని చెప్పలేనప్పుడు మీరు నాయకులు ఎలా అవుతారు? కేవలం పదవుల కోసమే పనిచేసే బానిసలుగా మిగిలిపోతారా?" అని నిలదీశారు. తమ నాయకుడు పవన్ కళ్యాణ్ జనసేన శ్రేణులు అందరూ కూడా ఈ పాపంలో తమకు భాగం లేకపోయినా, రాష్ట్రానికి జరిగిన అపవిత్రతకు బాధ్యత వహిస్తూ ప్రాయశ్చిత్త దీక్ష చేశారు. మేమందరం మాల వేసుకుని పాపప్రక్షాళన కోరాం. కానీ వైసీపీ నేతలు మాత్రం జరిగిన తప్పును ఖండించాల్సింది పోయి, సిగ్గు లేకుండా సమర్థిస్తున్నారు. ప్రజలు మిమ్మల్ని ఓడించి ఇంట్లో కూర్చోబెట్టినా మీ పంథా మారకపోవడం దారుణమని, రాజకీయాల్లోకి కుటుంబ సభ్యులను, ఆడబిడ్డలను లాగి ఇష్టానుసారంగా మాట్లాడటం నీచమైన సంస్కృతి అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పదవులు ఎవరికీ శాశ్వతం కాదని, సంప్రదాయాలను వదిలేస్తే అంతకన్నా దారుణం మరొకటి ఉండదని హెచ్చరించారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు ఆత్మవిమర్శ చేసుకోవాలి. జరిగిన తప్పుకు భగవంతుడిని క్షమాపణ కోరి ప్రక్షాళన చేసుకోవాలి. ఏ పార్టీలో ఉన్నా సరే, మన సంస్కృతిని, మన దైవాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది అని విజయ్ కుమార్ స్పష్టం చేశారు. ఎంపీపీ రాజాన శేషు, జనసేన పట్టణ పార్టీ అధ్యక్షుడు బొద్దపు శ్రీనివాసరావు జనసేన నాయకులు ఊటకూటి రమేష్ నాయుడు, కొటారు శ్రీనివాసరావు, గుర్రాల శేఖర్, కొటారు నరేష్, లాలం సోమనాయుడు, మాజీ సర్పంచ్ లవుడు లోవరాజు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# వికసిత భారత్ దిశగా అడుగులు వేయాలి

7వ పేజీ తరువాయి ..

హామీ పథకంలో గతంలో ఉన్న లోపాలను సవరించి, పారదర్శకతను పెంచేందుకు వి.బి.జి. రామ్ జీ అనే కొత్త విధానాన్ని ప్రవేశపెట్టినట్లు వెల్లడించారు. దీని ద్వారా పనుల కొలతల్లో మరియు చెల్లింపుల్లో ఎటువంటి అవకతవకలకు తావు ఉండదని స్పష్టం చేశారు. ఉపాధి హామీ పని దినాలను 100 నుండి 125 రోజులకు పెంచడం జరిగిందని, వ్యవసాయ పనుల సమయంలో రైతులకు ఇబ్బంది కలగకుండా 60 రోజుల మినహాయింపు ఇచ్చామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఈ పథకానికి దాదాపు 96,000 కోట్ల రూపాయలు కేటాయించిందని, ఇది గ్రామీణ ప్రాంతాల్లో ఆస్తుల కల్పనకు ఎంతో దోహదపడుతుందని చైర్మన్ లంకా దినకర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అనేక సంక్షేమ పథకాలు గురించి క్షేత్ర స్థాయిలో ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన లేదని, 20 పాయింట్స్ ప్రోగ్రామ్' (20 సూత్రాల పథకం) అమలు పై అన్ని జిల్లాల్లో పర్యటిస్తూ, పథకాల అమలుపై విస్తృతమైన సమీక్షలు నిర్వహిస్తున్నారని కొనియాడారు. జి.ఎస్.డి.పి లో జిల్లా ప్రమాద స్థానంలో ఉందన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జి ఎస్ డి పి లో జిల్లా ప్రమాద స్థానంలో ఉందని, గ్రోత్ రేట్ ఇంకా పెంచేందుకు కృషి చేస్తామని కలెక్టర్ తెలిపారు. కేంద్ర నిధులను సద్వినియోగం చేసుకుంటూ జిల్లాను అభివృద్ధి పథంలో వికసిత్ జిల్లాగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. చైర్మన్ మరియు ఉత్తర నియోజకవర్గం శాసనసభ్యులు అడిగిన సమాచారాన్ని అధికారుల ద్వారా నివేదికలను ఇస్తామని కలెక్టర్ తెలిపారు. సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ - అక్రమ మద్యం విక్రయాలు గుట్టు రట్టు

(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)



విశాఖ నగరంలోని పి.ఎం.పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం పోలీసులు నిర్వహించిన కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమంలో రెండు అక్రమ బెల్ట్ షాపులను గుర్తించి నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నారు. సేవా నగర్, సాయిరామ్ కాలనీ ప్రాంతాల్లో పి.ఎం. పాలెం సీఐ బాలకృష్ణ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న రెండు బెల్ట్ షాపులను గుర్తించి మూసి వేశారు. అక్కడ నుంచి అక్రమంగా నిల్వ చేసిన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.తనిఖీల సమయంలో సరైన పత్రాలు లేకుండా ఉన్న నాలుగు వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అక్రమ మద్యం వ్యాపారానికి వీటిని వినియోగిస్తున్నట్టు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు తెలిపారు. సంబంధిత వ్యక్తులను విచారణ నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.నగరంలో అక్రమ మద్యం విక్రయాలపై కఠిన చర్యలు కొనసాగిస్తామని, ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తప్పవని పిఎంపాలెం సీఐ బాలకృష్ణ హెచ్చరించారు.

# డిజిటల్ అరెస్ట్ మోసానికి చెక్

## రిటైర్డ్ హెడ్ నర్స్ నగదు కాపాడిన సీపీ శంఖబ్రత బాగ్చీ

(విశాఖ క్రైమ్ -ప్రభాత వార్త)



డిజిటల్ అరెస్ట్ పేరుతో సైబర్ ముఠా చేసిన మోసాన్ని విశాఖపట్నం సిటీ పోలీసులు అడ్డుకున్నారు. హెడ్ నర్స్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన ఓ మహిళను బెదిరించి రూ.50 లక్షలు దోచుకునేందుకు ప్రయత్నించిన సైబర్ నేరగాళ్ల ఆగడాలకు సిటీ పోలీస్ కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చీ కళ్లెం వేశారు. ఆయన సకాలంలో జోక్యం చేసుకోవడంతో బాధితురాలి రిటైర్మెంట్ మొత్తం సురక్షితంగా నిలిచింది. గుర్తు తెలియని వ్యక్తులు మహిళకు ఫోన్ చేసి, ఇటీవల తెలంగాణ సైబర్ క్రైమ్ పోలీసులు కంబోడియా కేంద్రంగా వెలుగులోకి తీసుకువచ్చిన హ్యూమన్ ట్రాఫికింగ్--సైబర్ నేరాల కేసుకు ఆమెకు సంబంధం ఉందని భయపెట్టారు. శహదత్ ఖాన్ అనే కీ ఏజెంట్ కేసు దర్యాప్తులో ఆమె డాక్యుమెంట్లు లభ్యమయ్యాయని చెబుతూ, కేసు నుంచి తప్పించాలంటే రూ.50 లక్షలు వారు సూచించిన ఖాతాలో జమ చేయాలని బెదిరించారు. భయభ్రాంతులకు గురైన మహిళ తన రిటైర్మెంట్ అమౌంట్, ఫిక్స్‌డ్ డిపాజిట్లు క్యాన్సిల్ చేసి చెక్కుతో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖకు చేరుకుంది. ఈ లావాదేవీపై అనుమానం వ్యక్తం చేసిన బ్యాంక్ రీజినల్ ఆఫీస్ అసిస్టెంట్ మేనేజర్ ఎం. అనిల్‌కుమార్ వెంటనే స్పందించారు. ఇటీవల బ్యాంకర్లతో జరిగిన సమావేశంలో సైబర్ నేరాలపై కమిషనర్ ఇచ్చిన సూచనలు గుర్తు చేసుకుని, సీపీ అందించిన వ్యక్తిగత ఫోన్ నంబర్‌కు సమాచారం అందించారు.విషయం తెలుసుకున్న వెంటనే స్పందించిన కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చీ ఆదేశాల మేరకు సిటీ సైబర్ క్రైమ్, టాస్క్ ఫోర్స్ పోలీసులు రంగంలోకి దిగారు. ఎటువంటి ఆర్థిక లావాదేవీలు జరగకుండా వెంటనే నిలుపుదల చేయడంతో భారీ మోసం తప్పింది. కమిషనర్ మాట్లాడుతూ, డిజిటల్ అరెస్ట్, సైబర్ నేరాల పేరుతో వచ్చే బెదిరింపు కాల్స్‌కు ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ భయపడకూడదని సూచించారు. అనుమానాస్పద కాల్స్ వస్తే వెంటనే పోలీసులకు లేదా సైబర్ క్రైమ్ విభాగానికి సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

# లారీ డ్రైవర్‌కు ఐదేళ్ల జైలు, జరిమానా

(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)



వాహనాన్ని అతి నిర్లక్ష్యంగా వేగంగా నడిపి ఒక వ్యక్తి మృతికి కారణమైన లారీ డ్రైవర్ కు 5 సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష విధిస్తూ గాజువాక ఎనిమిదవ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి ఎస్ కవిత శుక్రవారం తీర్పునిచ్చారు. జైలు శిక్షతోపాటు పదివేల రూపాయలు జరిమానా చెల్లించా లని లేనిపక్షంలో అదనంగా రెండు నెలలు సాధారణ శిక్ష అను భవించాలని న్యాయమూర్తి తమ తీర్పులు స్పష్టం చేశారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి రాంబాబు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు దాసరి బంగారు రెడ్డి (31) వృత్తిరీత్యా లారీ డ్రైవరు. 2019 జనవరి 16వ తేదీన దువ్వాడ నుంచి గాజువాక వస్తుండగా చిన్న పాలెం దగ్గర భీముని పట్నానికి చెందిన మోటార్ సైకిల్ లిస్ట్ షేక్ మహమ్మద్ హుస్సేన్ తన కుమారునితో ఎదురుగా వెళుతున్నాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న లారీ డ్రైవర్ బంగారు రెడ్డి ఎదురుగా వెళుతున్న మోటార్ సైకిల్ ను బలంగా ఢీకొట్టాడు. బైక్ ను డ్రైవ్ చేస్తున్న హుస్సేన్ బలంగా గాయపడ్డాడు. వెనుక కూర్చున్న సిరాజుద్దీన్ బలమైన గాయాలతో అక్కడికక్కడే మరణించాడు. గాజువాక ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ వై కిషోర్ కుమార్ కేసుని నమోదు చేశారు. భారతీయ శిక్షాస్మృతి సెక్షన్ 304(2), ఇతర సెక్షన్ల కింద కేసు నమోదు చేసి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పునిచ్చారు. ప్రాసక్యూషన్ 12 మంది సాక్షులను విచారించింది. కేసు విచారణకు స్థానిక కోర్టు కానిస్టేబుల్ పిఎన్ మూర్తి సహకరించారు

# వైభవంగా శ్రీ రాధా మధన మోహన్ మందిరం వార్షికోత్సవం

ఆనందపురం, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:



మండలంలోని గంభీరంలో ఉన్న హరే కృష్ణ వైకుంఠం ప్రాంగణంలో నిర్మించిన శ్రీ రాధా మధన మోహన్ మందిర ప్రథమ వారికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మందిరంలో ఆవిష్కరించిన విగ్రహలు వద్ద ఆంధ్ర, తెలంగాణ హరే కృష్ణమూవ్ మెంట్ ప్రెసిడెంట్ శ్రీమాన్ సత్యగౌర చంద్రదాస, విశాఖపట్నం హరే కృష్ణ మూవ్ మెంట్ ప్రెసిడెంట్ డాక్టర్ నిష్కించిన భక్తదాస ఆధ్వర్యంలో పంచసూక్త హోమాన్ని పంచగవ్య, వివిధ సుగంధ ద్రవ్యాలతో పండితుల వేద మంత్రోచ్చరణల మధ్య నిర్వహించారు. వివిధ రకాల పువ్వులు, వస్త్రాలతో రథాన్ని అలంకరించి శ్రీ రాధా మధన మోహన్ విగ్రహాలు, శ్రీ భక్తి వేదాంత స్వామి ప్రభుపాద విగ్రహాలతో ఐఐఎం రోడ్‌లో రథయాత్ర నిర్వహించారు. అడుగడుగునా భక్తులు భగవంతునికి పూలతో, హారతిలతో స్వాగతం పలికారు. హరే కృష్ణ వైకుంఠ మందిర ప్రాంతం హరినామ సంకీర్తనతో మారుమోగింది.

# ధారపాలెం బిఆర్టిఎస్ రోడ్లో ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు

## కార్ డ్రైవర్ మృతి... మరొకరి పరిస్థితి విషమం

ఆరిలోవ, ఫిబ్రవరి 6, మేజర్ న్యూస్



దారపాలెం బిఆర్టిఎస్ రోడ్ లో ఆర్టీసీ బస్సును కారు ఢీకొన్న సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ప్రమాదంలో కారు నడుపుతున్న బంగారు రాజేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆరిలోవ శాంతి భద్రతల ఎస్సై వరహాల నాయుడు తెలిపిన వివరాలు ప్రకారం కాకినాడకు చెందిన ఓ కుటుంబం ఎక్స్ యు వి 300 కారులో శ్రీకాకుళం రాజమ్మ తల్లి ఉత్సవాలకు బయలు దేరి దారిలో సింహాచలం టెంపుల్ కి వెళ్లి అక్కడనుండి ధారపాలెం బి ఆర్ టి ఎస్ రోడ్ లో వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును అతి వేగంతో కారు ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందగా కారులో ఉన్న ఇద్దరు పిల్లలు, ముగ్గురు వ్యక్తులు గాయాల పాలయ్యారు. ఈ ప్రమాదం చూసిన వాహనదారులు భయభ్రాంతులకు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాదంలో గాయపడిన వాళ్లను వాహనదారులు, స్థానికులు సాయంతో అపోలో ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన రాజేష్ ను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్ ఆసుపత్రికి తరలించారు. ఈ కేసు ఆరిలోవ సీఐ హెచ్ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# బస్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రభుత్వ చర్యలు : గంటా

7వ పేజీ తరువాయి ..

డిజైన్ లను ప్రభుత్వానికి పంపించామన్నారు. ఈ స్థలంలో నిర్మించిన కబేళాలో ఎలాంటి కార్యకలాపాలు జరగని కారణంగా ఇతర అవసరాలకు వాడనున్నట్టు చెప్పారు. ఇదే స్థలంలో ఉన్న ఆలయం గురించి ఆలోచించి నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. భూగర్భ జలాలు ఉప్పునీటి మయంగా ఉన్నాయని, తాగు నీటి విషయంలో జీవీఎంసీ నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని స్థానికులు ఫిర్యాదు చేశారని వివరించారు. సమస్య పరిష్కారానికి ఒక నిర్దిష్టమైన కార్యాచరణను రూపొందిస్తామన్నారు. జోనల్ కమిషనర్ నాగేంద్ర, జెడ్పీటీసీ గాదు వెంకటప్పడు, కార్పొరేటర్ గాదు చిన్ని కుమారి లక్ష్మి, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, తమ్మిన సూరిబాబు, కొప్పల రమేష్, జీరు సత్యం, భువనేశ్వరి, గొలగాని నరేంద్ర, గరికిన కింగ్, పాసి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక అసోసియేషన్లకు పార్కుల అభివృద్ధి బాధ్యత

7వ పేజీ తరువాయి ..

అస్తవ్యస్త స్థితి నెలకొందని ఆగ్రహం వ్యక్తం చేశారు. భీమిలి బీచ్ రోడ్డు, మెయిన్ రోడ్డు, తగరపువలస రోడ్డు విస్తరణ వల్ల ఎన్ని కట్టడాలు పోతున్నాయనేది నివేదిక సిద్ధం చేయాలన్నారు. గతంలో భీమిలి - తగరపువలస రోడ్డు విస్తరణ కోసం 150 అడుగుల ఆర్డీపీ తయారు చేసినప్పటికీ, 80 అడుగులకు పరిమితం చేయాలని స్థానికుల నుంచి విజ్ఞప్తులు వస్తున్నాయని అధికారులు తెలియజేశారు. ఎండాడ రైతుబజార్ కోసం స్థలాన్ని ఎంపిక చేయాలని.. నిర్మాణంలో ఉన్న సాగర్ నగర్ - ఎండాడ రోడ్డు మధ్యలో అడ్డంకులు తొలగించాలని ఎమ్మెల్యే చెప్పారు. భీమిలిలో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని.. వాటర్ ఫిల్టరేషన్ ప్లాంట్ లేకపోవడంతో క్లోరినేటెడ్ నీటినే తాగాల్సి వస్తుందని స్థానిక నాయకులు ఫిర్యాదు చేయగా.. పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. చిల్లపేట చెరువు, ఎండాడ చెరువు దగ్గర వాకింగ్ ట్రాక్ సహా సుందరీకరణ పనుల డిజైన్లు తయారు చేయాలన్నారు. అసంపూర్తిగా ఉన్న కళ్యాణ మండపాలను గుర్తించి పూర్తి చేయాలని, తగరపువలసలో కళ్యాణ మండపం కోసం స్థలాన్ని అన్వేషించాలని సూచించారు. పర్యాటకులను ఆకర్షించేలా బీచ్ రోడ్డులో విగ్రహాలు ఏర్పాటు చేయాలన్నారు. గంట స్తంభం దగ్గర మార్కెట్ వివాదాన్ని పరిష్కరించాలని, లైట్ హౌస్ ప్రాంతం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. జోనల్ కమిషనర్లు వి. అయ్యప్ప నాయుడు, నాగేంద్ర, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శాంతిరాజు, కార్పొరేటర్ గాదు చిన్ని కుమారి లక్ష్మి, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, గంటా నూకరాజు, గొలగాని నరేంద్ర, మొల్లి లక్ష్మణరావు, మాన్యాల సోంబాబు, కె.అచ్యుతరావు, లొడగల జానకిరామ్, కొప్పల రమేష్, తమ్మిన సూరిబాబు, చెట్టిపల్లి సన్యాసిరావు, పాసి త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

# విలువలతో కూడిన రాజకీయాలకు నిలువుటద్దం 'మండలి'

7వ పేజీ తరువాయి ..

మండలి వెంకట కృష్ణారావు చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. ప్రస్తుత తరం రాజకీయ నాయకులు, యువత ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. మండలి బుద్ధ ప్రసాద్ అంటే తనకు అత్యంత అభిమానమని, స్పీకర్‌గా తాను ఆయన అడుగుజాడల్లోనే నడుస్తున్నానని తెలిపారు.తెలుగు భాషా పరిరక్షణపై స్పీకర్ ఈ వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. శాసనసభలో తాను తెలుగు భాష అమలుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలందరూ తెలుగు భాష అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. పాశ్చాత్య పోకడలకు పోయి 'మమ్మీ, డాడీ' సంస్కృతికి అలవాటు పడొద్దని, 'అమ్మా, నాన్న' అనే పిలుపుల్లోనే అమృతం ఉందని హితవు పలికారు. అవసరాల రీత్యా బయట ఆంగ్లం మాట్లాడినా, ఇంటిలో మాత్రం పిల్లలతో కచ్చితంగా తెలుగులోనే మాట్లాడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అసెంబ్లీ నిర్వహణపై స్పీకర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సభకు హాజరుకాని ఎమ్మెల్యేల జీతాల్లో కోత విధించాలన్నది తన వ్యక్తిగత అభిప్రాయమని స్పష్టం చేశారు. "ఒక ఉద్యోగి పనికి వెళ్లకపోతే జీతం కోత విధిస్తారు. మరి అదే నిబంధన ప్రజా ప్రతినిధులకు ఎందుకు వర్తించకూడదు?" అని ప్రశ్నించారు. సభ్యులు సమస్యలపై అసెంబ్లీలోనే మాట్లాడాలని, బయట మాట్లాడితే ప్రయోజనం ఉండదని హితవు పలికారు. సభలో మాట్లాడితే మంత్రుల చేత కచ్చితంగా సమాధానం చెప్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా అవనిగడ్డ ఎమ్మెల్యే, మండలి కుమారుడు శ్రీ మండలి బుద్ధప్రసాద్, మాజీ ఉపకులపతి ఆచార్య బాల మోహన్ దాస్, కళాభారతి అధ్యక్షులు ఎం.ఎస్.ఎన్. రాజు, కార్యదర్శి డా. జి.ఆర్.కె. ప్రసాద్ (రాంబాబు), రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి. రమణమూర్తి, సమన్వయకర్త మేడా మస్తాన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాపులంటే ముఖ్యమంత్రికి కక్ష ఎందుకు?

7వ పేజీ తరువాయి ..

అని రాజకీయ యాత్ర కాదని స్పష్టం చేశారు. సంఘీభావం తెలియజేయడానికి పోలీస్ పర్మిషన్ అవసరం లేదన్నారు. సుప్రీం కోర్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సిట్ నివేదిక జంతు కొవ్వు కలవలేదని చెప్పిన తర్వాత కూడా మరొక కమిటీ ఎందుకు అని ప్రశ్నించారు. టీటీడీ లడ్డూ జంతు కొవ్వు ఉందని చెప్పించడం కోసం చంద్రబాబు కమిటీ వేశారా అని అడిగారు. వైసీపీ మీద నెపం నెట్టడం కోసం మరొక కమిటీ వేస్తున్నారా అని ఎద్దేవా చేశారు. తిరుపతి లడ్డూలో జంతు కొవ్వు లేదని వచ్చిన నివేదికపై మీడియా అడిగిన ప్రశ్నకు చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం వ్యక్తం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో తాను నాస్తికుడుని అని ప్రకటించుకున్న నాగేంద్రబాబు నేడు సనాతన ధర్మం కోసం ఎలా మాట్లాడుతున్నారన్నారు. కల్తీ లడ్డుపై పవన్ కళ్యాణ్ స్టాండ్ ఎప్పటికప్పుడు మారిపోతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ కాపులను కూటమి ప్రభుత్వం వేధిస్తూ తప్పుడు కేసులు పెడుతోందన్నారు. అంబటి రాంబాబును చంపేందుకు టీడీపీ గుండాలు ప్రయత్నం చేశారని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

7వ పేజీ తరువాయి ..

మంత్రి చర్చించారు. ప్రాజెక్టుల అమలులో జరుగుతున్న పురోగతిని మెట్రోపాలిటన్ కమిషనర్ తేజ్ భరత్ మంత్రికి వివరించగా, ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు. నిర్దేశిత కాలవ్యవధిలో పనులు అన్ని పూర్తి చేయాలని, నాణ్యతలో ఎటువంటి రాజీ ఉండకూడదని మంత్రి నారాయణ అధికారులకు సూచించారు. ప్రస్తుతం వేగంగా జరుగుతున్న రహదారుల అభివృద్ధి పనుల ప్రగతి పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ, రానున్న రోజుల్లో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందుబాటులోకి వస్తాయని మంత్రి నారాయణ చెప్పారు. ఇటీవలే సీఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో వెలంపేట మురికివాడలో మంత్రి నారాయణ పర్యటించి అక్కడి వారి బాధలు అడిగి తెలుసుకున్నారు. వివిధ అంశాలను స్థానికులు, ప్రజాప్రతినిధులు ఆయన దృష్టికి తీసుకొనివచ్చారు. వెలంపేట మురికివాడలో నివసిస్తున్న 177 మందికి ఇళ్లు నిర్మించేందుకు మంత్రి నారాయణ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. త్వరలోనే ఇళ్ల నిర్మాణానికి శంఖుస్థాపన చేయాలని ఈ సమీక్షలో నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా విశాఖపట్నం సమగ్ర నీటి రక్షణ ప్రణాళికపై చర్చించారు. ఈ సమీక్షలో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్ భరత్, టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ విద్యుల్లత, జీవీఎంసీ సీఈ సత్యనారాయణరాజు, సీసీపీ ప్రభాకర్, అదనపు కమిషనర్ వర్మ అధికారులు పాల్గొన్నార

# 2029లో వైకాపాదే అధికారం

7వ పేజీ తరువాయి ..

దేనికీ వెరవవు" అని స్పష్టం చేశారు. లడ్డు వ్యవహారాన్ని పక్కదారి పట్టించేందుకు కూటమి కుట్ర పన్నుతుందని,అందులో భాగమే కమిటీ నియామకం అని అన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గత కొన్ని రోజులుగా చేస్తున్న వ్యాఖ్యలను ఆమె తప్పుబట్టారు. పవన్ తన వైఖరిని మార్చుకోవాలని, కేవలం విమర్శలకే పరిమితం కాకుండా ఇచ్చిన హామీలపై దృష్టి సారించాలని హితవు పలికారు.పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా నిలిచిన వారికే భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ స్థానిక నేతలు, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# పద్మశ్రీ మురళీ మోహన్‌ని సన్మానించిన మాజీ మంత్రి అవంతి

విశాఖపట్నం, ఫిబ్రవరి 06, ప్రభాతవార్త

కేంద్ర ప్రభుత్వం ఇటీవల పద్మశ్రీ ప్రకటించిన ప్రముఖ సినీ నటుడు, నిర్మాత మాగంటి మురళీ మోహన్ ఈరోజు హైదరాబాద్ గుంతపల్లి లో గల అవంతి కళాశాల లో ఈరోజు జరిగిన టెక్ ఇగ్నైట్ - 2026 కార్యక్రమం కి ముఖ్య అతిథిగా హాజరైన ఆయనను దుశ్శాలు వారితో సత్కరించి ఘనంగా సన్మానించి అబినంనలతో మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు శుభాకాంక్షలు తెలిపారు. అవంతి శ్రీనివాసరావు మాట్లాడుతూ సినీ రంగానికి సుదీర్ఘ సేవలు అందించడంతో పాటు వెండి తెరపై తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్న మురళీ మోహన్ కు పద్మశ్రీ అవార్డు ప్రకటించడం తెలుగు సినీ పరిశ్రమ ను కేంద్ర స్థాయిలో గుర్తించి గౌరవించడం అని,మురళీ మోహన్ సినీ రాజకీయ ప్రస్థానం యువ హీరోలకు ఆదర్శనీయమైనదని కొనియాడారు. కార్పోరేటర్ ( అవంతి విద్యాసంస్థల జనరల్ సెక్రటరీ) డా.ప్రియంక,అవంతి విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ శ్రావణ్ కుమార్,అవంతి కళాశాల ప్రిన్సిపాల్, డైరెక్టర్,బోధన సిబ్బంది పాల్గొన్నారు

# ఆభరణాలతోనే మగువలకు మరింత అందం

విశాఖపట్నం, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త

మగువలు తమ అందంతోపాటు ధరించే ఆభరణాలతోనే మరింత కాంతివంతంగా కనిపిస్తారని డైరెక్టర్ డా. జోయ్ అలుక్కాస్ తెలిపారు. శుక్రవారం సిరిపురంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'బ్రిలియన్స్ డైమండ్ జ్యువెల్లరీ షో' విశాఖపట్నంలో ఫిబ్రవరి 6 నుండి 22 వరకు నిర్వహిస్తున్నమని చెప్పారు. అత్యద్భుతమైన వివాహ ఆభరణాల సెట్‌ల నుండి సమకాలీన నిత్య మెరుపుల వరకు, ఈ ప్రదర్శనలో కాలాతీత సంప్రదాయాన్ని ఆధునిక సౌందర్యంతో కలిపే ఆభరణాలు ఉన్నాయి. ప్రతి డిజైన్ ఒక కళాఖండం, ప్రదర్శన సమయంలో పరిమిత కాలం వరకు మాత్రమే అందుబాటులో ఉంటుంది తెలియజేశారు.

**మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ, విశాఖపట్నం**

**ప్రజా ప్రకటన**

RC No.5/2019/ACP-III/G1 Dt.06.02.2026

భానునగర్ రెసిడెన్షియల్ కాలనీలోని అంతర్గత 30 అడుగుల రహదారి నుండి డా.వి.ఎస్. కృష్ణ ప్రభుత్వ కళాశాల ప్రధాన రహదారి వరకు, మద్దిలపాలెం రెవెన్యూ గ్రామం, సర్వే నెం.45/1బి1/బి2లో రహదారి విస్తరణ గతంలో నిర్వహించబడినది. ప్రభుత్వ మెమో నెం.2250050/ఎం2/2023, తేది:30.10.2023 ప్రకారం క్రింది ప్రభావిత స్థల యజమానులకు టీడీఆర్ మంజూరు చేయుటకు ప్రతిపాదించబడినది:

**శ్రీ అచ్చి కోటేశ్వర రెడ్డి, శ్రీ అచ్చి సదాశివ రెడ్డి, శ్రీ అచ్చి బాల కృష్ణ రెడ్డి.**

పై యజమానుల హక్కులపై అభ్యంతరాలు ఉంటే, ఈ ప్రకటన తేదీ నుండి 15 రోజుల్లోగా జి.వి.యం.సి.కు తెలియజేయవలెను. గడువు లోపల అభ్యంతరాలు లేనిచో, నిబంధనల ప్రకారం టీడీఆర్ మంజూరు చేయబడును.

sd/- కమిషనర్, జి.వి.యం.సి.

# విశాఖలో ఎంఆర్ఎఫ్ మోగ్రిప్ ఎఫ్ఎంఎస్సిఐ నేషనల్ సూపర్ క్రాస్ ఛాంపియన్షిప్ రేసింగ్ పోలీసుల సూచనలు

(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)

విశాఖపట్నంలో నేడు ఎంఆర్ఎఫ్ మోగ్రిప్ ఎఫ్ఎంఎస్సిఐ నేషనల్ సూపర్ క్రాస్ ఛాంపియన్షిప్ రేసింగ్ ఈవెంట్ జరుగనుండటంతో, పెద్ద ఎత్తున ప్రేక్షకులు పాల్గొననున్నారు. దాదాపు ద్విచక్ర , నాలుగు చక్ర వాహనాలతో వస్తున్న వారు కింద పేర్కొన్న ప్రదేశాలలో మాత్రమే వాహనాలను పార్క్ చేయాల్సిన విధంగా అధికారులు సూచించారు.

### గాజువాక--కంచరపాలెం మార్గం..

కాన్వెంట్ జంక్షన్ వైపు వచ్చే వారు పోర్ట్ లోపల రోడ్ పక్కన వాహనాలను పార్క్ చేసుకుని, చిలకల జంక్షన్ ద్వారా వేదికకు రావలెను.

### పూర్ణా మార్కెట్--టౌన్ కొత్త రోడ్..

గోపాల్ ఆటో జంక్షన్ దగ్గర జీవీఎంసీ సేవేజ్ వాటర్ ట్యాంక్ వద్ద వాహనాలను పార్క్ చేయాలి.

### విశాఖపట్నం సిటీ నుండి

డాల్ఫిన్-అద్వానీ మార్గం ద్వారా కాన్వెంట్ జంక్షన్ వద్ద వాహనాలను పార్క్ చేసి, వేదికకు నడుస్తూ రావలెను.

### వివిఐపి/వెహికిల్ పాసులు

మునిసిపల్ స్టేడియం లో వాహనాలను మాత్రమే పార్క్ చేయవచ్చు.

వార్త VAARTHA CLASSIFIEDS CLASSIFIEDS వార్త VAARTHA CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, BODDU KRISHNA VENI W/O BODDU SRINIVASA RAO, previously called MAJJI V KRISHNA VENI R/O MIG B-197, SAGAR NAGAR, VIZAG, now changed my name from MAJJI V KRISHNA VENI to BODDU KRISHNA VENI. Henceforth I will be called as BODDU KRISHNA VENI for all purposes.
(Ro.No.42066)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

## గుండెనొప్పిల వ్యాధులపై ఆర్ఎంపిలకి అవగాహన సదస్సు



పద్మనాభం, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త

మండలంలో పలు గ్రామాలలో ఉన్న గ్రామీణ వైద్యులకు గురువారం పద్మనాభం గ్రామంలో విశాఖ పట్నం ప్రముఖ వైద్యులు సత్యానంద్, జి అచ్యుత గుండె నొప్పిలపై వైద్య విద్యాజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోగులకి గుండె నొప్పి వచ్చినపుడు చేయవలసిన వైద్యం ఏవిధంగా చేయాలి, తీసుకోవలసిన జాగ్రత్తలు వారు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర ఆర్ ఎం పిల సంఘ అధ్యక్షుడు జంగం జోషి, పద్మనాభం మండల అధ్యక్షులు ఆర్ అప్పారావు, ప్రసాదు, ఎంవి రమణ పాల్గొన్నారు.

## గాజువాకలో బీసీ సింహ గర్జన పోస్టర్ల ఆవిష్కరణ

గాజువాక, ఫిబ్రవరి 6,ప్రభాతవార్త



ఫిబ్రవరి 22న జరగనున్న బీసీ సింహ గర్జన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను శుక్రవారం ఉదయం 11 గంటలకు గాజువాకలోని బీసీవై పార్టీ కార్యాలయంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కో-కన్వీనర్ అనుపమ యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు అల్లు రమణారావు యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీసీల హక్కుల సాధన కోసం ఫిబ్రవరి 22న జరగనున్న బీసీ సింహ గర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బీసీ వర్గాల సమస్యలపై ప్రభుత్వాల దృష్టిని ఆకర్షించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా బీసీవై పార్టీ నాయకులు నక్క దుర్గ బాబు, పల్ల వెంకట అప్పారావు, చొప్ప మరిడి బాబు, వియ్యపు గంగరాజు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

### కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సహకారంతో

## గాజువాక గ్రంథాలయంలో మౌలిక వసతుల పనులు



గాజువాక,ఫిబ్రవరి 6,ప్రభాతవార్త

గాజువాక శాఖ గ్రంథాలయంలో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సహకారంతో రూ.15 లక్షల వ్యయంతో మౌలిక వసతుల పనులు కొనసాగు తున్నాయి. ఇందులో పెయింటింగ్, కబోర్డ్ పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కింద అంతస్తులో పనులు జరుగుతున్న కారణంగా పుస్తక విభాగం, పేపర్ విభాగం పై అంతస్తులో నిర్వహించబడుతున్నట్లు గ్రంథాలయ అధికారి బి. సూర్యకళ గాజువాక ప్రాంత పాఠకులకు తెలిపారు.

## లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

### 12న దేశవ్యాప్త సమ్మె.. గోడ పత్రిక విడుదల

గాజువాక,ఫిబ్రవరి 6,ప్రభాతవార్త



కార్మికులను బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మల్కాపురంలోని సిఐటీయూ కార్యాలయంలో అఖిల పక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటీయూ విశాఖ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.జగ్గునాయుడు, ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం, ఏఐటీయూసీ జిల్లా నాయకులు కె.సత్యనారాయణ రెడ్డి, వైఎస్ఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.అనిల్ కుమార్, సిఐటీయూ మల్కాపురం జోన్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలతో తీసుకువచ్చిన లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 12న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో పారిశ్రామిక ప్రాంతాల కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు తాతబాబు, షిప్‌యార్డ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటీయూ), గోడౌన్స్ ముఠా వర్కర్స్ యూనియన్ (సిఐటీయూ) అధ్యక్షులు పి. పైడిరాజు, సిఐటీయూ మల్కాపురం జోన్ నాయకులు ఎ. సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

## స్పర్శ లెప్రసీపై విద్యార్థులకు అవగాహన



గాజువాక,ఫిబ్రవరి 6,ప్రభాతవార్త

జీవీఎంసీ 66వ వార్డు పరిధిలోని గాజువాక కణితి రోడ్ విజ్ఞాన భారతి స్కూల్‌లో స్పర్శ లెప్రసీ (కుష్టు వ్యాధి) నివారణపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మాజీ కార్పొరేటర్, 66వ వార్డు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మహమ్మద్ రఫీ మాట్లాడుతూ, కుష్టు వ్యాధి అంటువ్యాధి కాదని, లక్షణాలు గుర్తించిన వెంటనే సంబంధిత ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లకు సమాచారం ఇస్తే తక్షణమే మందులు అందిస్తారని తెలిపారు. వ్యాధిగ్రస్తులను గౌరవంతో చూడాలని, పరిశుభ్రత పాటించడమే ఆరోగ్యానికి మేలని సూచించారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన భారతి స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ లక్ష్మీ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, కూటమి నాయకులు భాషా లక్ష్మణ్, సీనియర్ నాయకులు పొన్నాడ రమణ, పి. మురళి, రెడ్డి ఆనంద్, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

## కందిపంట సాగుపై ఆసక్తి చూపిన అనంతవరం రైతులు

పద్మనాభం, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త



మండలంలో అనంతవరం గ్రామ రైతులు ప్రస్తుత రబీ సీజనులో సాగుచేస్తున్న కంది పంటసాగుపై రైతులు ఈ సంవత్సరం ఆసక్తి చూపారు. దీంతో గ్రామంలో ఎక్కడ చూసినా పంటపొలాలలో కందిపంట దర్శనమిస్తుంది. అయితే గత సంవత్సరం ఈకంది పంటను ఒకరిద్దరు రైతులు మాత్రమే సాగుచేసారు. ఈ పంటకు యాజమాన్యం ఖర్చులు గాని, సాగునీరు గాని అవసరం లేదు. దీంతో ఆపంటకి అనుకున్న మద్దతు ధర ఉండడంతో రైతులకి లాభాలు రావడంతో గ్రామంలో ఉన్న మిగిలిన రైతులు కందిపంటను సాగుచేయడానికి ముందుకు వచ్చారు. సుమారు వంద ఎకరాలలో ఈపంట ఆశాజనకంగా ఉంది. ఖరీఫ్ సీజను వరిపంట కోసిన తరువాత కందిపంటను వేస్తారు.

## అంగన్వాడి కేంద్రంలో గర్భిణీలకు సామూహిక సీమంతాలు



ఆనందపురం, ఫిబ్రవరి 06, ప్రభాతవార్త

ఆనందపురం అంగన్వాడి కేంద్రంలో శుక్రవారం గర్భిణీలకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. అంగన్వాడి కార్యకర్త కొట్యాడ కాసులమ్మ తల్లి సర్వలక్ష్మి సొంత నిధులతో సీమంతాలు జరిపించారు. ఈ సందర్భంగా గంభీరం సెక్టార్ సూపర్ వైజర్ జి.శిరీష మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు పౌష్టిక ఆహారం తీసుకోవా లని గర్భిణీలు ప్రసవం అయిన తర్వాత గంటలోపు బిడ్డకు ముర్రపాలు పట్టించాలని దీనివలన బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు తల్లులు పాల్గొన్నారు.

## నక్సల్స్ ముప్పుకు చెక్..!

### అడవిలో బందీల విముక్తి - విశాఖలో ఎన్.ఎస్.జి విన్యాసం

(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)



నక్సల్స్, ఉగ్రవాద ముప్పులను సమర్థంగా ఎదుర్కొనే లక్ష్యంతో నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (ఎన్ఎస్జి) ఆధ్వర్యంలో విశాఖపట్నం పరిసర ప్రాంతాల్లో నిర్వహించిన హెచ్ఆర్ఓజె (హోస్టేజ్ రెస్క్యూ ఆపరేషన్ ఇన్ జంగల్) విన్యాసం విజయవంతంగా ముగిసింది. ఫిబ్రవరి 2 నుంచి 5 వరకు నాలుగు రోజుల పాటు ఈ విన్యాసాన్ని నిర్వహించారు.వాస్తవ యుద్ధ పరిస్థితులను అనుకరిస్తూ, నక్సల్స్ ప్రస్తుత కార్యకలాప విధానానికి అనుగుణంగా అడవి యుద్ధ తంత్రాలు, ఆపరేషనల్ వ్యూహాలు, ఆధునిక సాంకేతిక పద్ధతులతో ఈ డ్రిల్‌ను నిర్వహించారు. బందీల విముక్తి మిషన్లు, కౌంటర్ ఐఈడీ చర్యలు, అడవిలో శోధన--దాడి విధానాలపై ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. ఈ విన్యాసంలో ఆంధ్రప్రదేశ్ పోలీస్, గ్రేహౌండ్స్, ఆక్టోపస్ విభాగాలు ప్రథమ స్పందన దళాలుగా పాల్గొన్నాయి. అలాగే సిఆర్పిఎఫ్, ఐటిబిపి,ఎస్డిఆర్ఎఫ్ అటవీ శాఖ, అగ్నిమాపక శాఖ, వైద్య సేవలు, గూఢచారి సంస్థల నుంచి విస్తృత మద్దతు లభించింది. అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన స్పందన కోసం అంతర ఏజెన్సీల మధ్య సమన్వయం ఎంత కీలకమో ఈ విన్యాసం స్పష్టంగా చూపించింది. విన్యాసం అనంతరం హెచ్ఆర్ఓజే పరిస్థితుల్లో వినియోగించే ఆయుధాలు, పరికరాల ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఆధునిక ఆపరేషనల్ సాధనాల వినియోగంపై పాల్గొన్న దళాలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్ (ఆపరేషన్స్) డా. సుమిత్ గరుడ్, ఐపీఎస్ మాట్లాడుతూ, ఎన్ఎస్జి బృందం చేపట్టిన సమన్వయపూర్వక ప్రయత్నాలను ప్రశంసించారు. ఈ విన్యాసం ద్వారా ఎన్ ఎస్ జి-రాష్ట్ర పోలీస్ బలగాల మధ్య అనుసంధానం మరింత బలోపేతమైందని, వాస్తవ కాల ముప్పులను ఎదుర్కొనే సమగ్ర స్పందన వ్యవస్థ ఏర్పడిందని తెలిపారు.ఇలాంటి విన్యాసాలు ఆపరేషనల్ సిద్ధతను పెంపొందించడంతో పాటు, సంక్షోభ సమయంలో వేగవంతమైన నిర్ణయాలు తీసుకునేలా స్పందన దళాలను శక్తివంతం చేస్తాయని ఎన్ఎస్జి అధికారులు పేర్కొన్నారు. నక్సల్స్ లేదా ఉగ్రవాద సంబంధిత అత్యవసర పరిస్థితుల్లో ప్రజల భద్రతను నిర్ధారించడంలో ఈ సహకారం కీలకంగా నిలుస్తుందని తెలిపారు.

## దుర్గానగర్‌లో 'ఫ్రైడే-డ్రైడే'

### సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి-మలేరియా ఇన్‌స్పెక్టర్ రవికుమార్




గాజువాక,ఫిబ్రవరి 6,ప్రభాతవార్త

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారానే సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చునని మలేరియా ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు. జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్ పరిధిలో శుక్రవారం మల్కాపురం మలేరియా విభాగం ఆధ్వర్యంలో 'ఫ్రైడే- డ్రైడే' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో కలిసి వీధుల్లో పర్యటించి నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ప్రజలకు అవగాహన కల్పిస్తూ మాట్లాడారు. డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులు ప్రబలకుండా ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. ముఖ్యంగా ఇంట్లోని పూల కుండీలు, పాత టైర్లు, కూలర్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. ప్రతీ శుక్రవారం డ్రైడేను పాటించి దోమల వృద్ధిని అరికట్టాలని పిలుపునిచ్చారు. సీజనల్ వ్యాధుల పట్ల ఏ మాత్రం అశ్రద్ధ వహించినా ప్రమాదమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మలేరియా విభాగం సిబ్బంది, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నిందితుడికి ఐదేళ్ల ఆరు నెలల జైలు శిక్ష

### దువ్వాడ కేసులో కోర్టు సంచలన తీర్పు -రూ.16వేల జరిమానా విధింపు

గాజువాక,ఫిబ్రవరి 6,ప్రభాతవార్త

నేరం రుజువైన ఓ నిందితుడికి ఐదేళ్ల ఆరు నెలల జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ ఎనిమిదో అదనపు జిల్లా జడ్జి ఎస్.కవిత శుక్రవారం తీర్పునిచ్చారు. దువ్వాడ పోలీసుల కథనం ప్రకారం.. 2019లో దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో దాసరి బంగారు రెడ్డి అనే వ్యక్తిపై సెక్షన్ 304-2 ఐపీసీ కింద కేసు నమోదైంది (సీ.ఆర్. నెం: 15/2019) సుదీర్ఘ విచారణ అనంతరం, సాక్ష్యాధారాలు బలపడటంతో నిందితుడు బంగారు రెడ్డికి 5 సంవత్సరాల 6 నెలల కఠిన కారాగార శిక్ష, రూ.16,000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్‌ను సమర్థవంతంగా నిర్వహించిన పీపీ పోతిన రాంబాబు, కేసు దర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన దువ్వాడ సీఐ కె.మల్లేశ్వరరావు, సీఎమ్మెస్ హెచ్‌సీ మూర్తి, పీసీ సైదులను ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు. నేరస్తులకు శిక్ష పడేలా శ్రమించిన సిబ్బంది పనితీరును ప్రశంసించారు.

## 13వ వార్డులో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

ఆరిలోవ, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త



తూర్పు నియోజకవర్గం స్థానిక 13వ వార్డులో శుక్రవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తూర్పు శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు హాజరయ్యారు. అనంతరం ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పూజా కార్యక్రమాలతో శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ లక్ష్మీపార్వతి నగర్, వెర్ని దుర్గా నగర్, శివశంకర్ నగర్, సిద్ధార్థ నగర్‌లో సీసీ రోడ్లు, కాలువలకు జీవీఎంసీ నిధులతో రూ. 77లక్షల15 వేల రూపాయల వ్యయంతో శంకుస్థాపన కార్యక్రమం చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు వార్డు కార్పొరేటర్ కెల్లా సునీత సత్యనారాయణ, వార్డు అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు, జీవీఎంసీ తూర్పు జోన్ జోనల్ కమిషనర్ శివప్రసాద్, జీవీఎంసీ ఇఈ గంగాధర్, డిఈ చంద్రమౌళి, విశాఖ పార్లమెంట్ కమిటీ అధికార ప్రతినిధి పొత్రకండ ధర్మారావు, వార్డు ప్రధాన కార్యదర్శి తురకపూడి బాలస్వామి,వార్డు ఉపాధ్యక్షులు మారిక జక్కన్న, సీనియర్ నాయకులు యల్లమిల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## 7 నుండి ఆట కొత్త సీజన్

ఆరిలోవ, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త

తెలుగుప్రేక్షకులకు ఎప్పటికప్పుడు సరికొత్త కార్యక్రమాలని అందిస్తూ వినోదం పంచుతున్న జీతెలుగు ప్రతిభావంతులను వెలుగులోకి తీసుకురావడంలోనూ ముందుంటుంది. తెలుగు టెలివిజన్ చరిత్రలో అత్యంత ఆదరణ పొందిన డాన్స్ రియాలిటీ షో జీ తెలుగు 'ఆట'. ఈకార్యక్రమంతో ఎందరో ప్రతిభావంతులైన డాన్సర్లను వెలుగులోకి తీసుకొచ్చిన జీ తెలుగు ఆట సరికొత్త సీజన్తో మరోసారి ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. బుల్లితెర పాపులర్డాన్స్ షో 'ఆట' సరికొత్త సీజన్ ఫిబ్రవరి 7న ప్రారంభం, ప్రతి శని, ఆదివారాల్లోరాత్రి 9గంటలకు, మీ జీ తెలుగులో.. ఫిబ్రవరి 5 నుంచి ప్రతి గురు, శుక్రవారాల్లో కొత్త ఎపిసోడ్స్ టీవీ కంటే 48 గంటల ముందే మన జీ5లో! ఎందరో ప్రతిభావంతులను వెండితెరకు పరిచయం చేసిన ఆట సరికొత్త సీజన్కి ఎనర్జిటిక్ యాంకర్సుధీర్ వాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు. ఆట టైటిల్ కోసం నలుగురు మెంటర్స్ కావ్య, విష్ణుప్రియ, వంశీ, సమీరాభరద్వాజ్ మార్గ దర్శకత్వంలో 16మంది ప్రతిభావంతులు పోటీపడనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ నటి రాధికాశరత్కుమార్, కొరియోగ్రాఫర్జానీ మాస్టర్, మెగాడాటర్ నిహారికా కొణిదెల న్యాయనిర్ణేతలుగా వ్యవహరించనున్నారు. ఇటీవల బ్లాక్బస్టర్ హిట్ సాంగ్స్ 'సూసేకి అగ్గిపుల్ల', 'చుట్టమల్లే', 'గిర గిర గిర'వంటి పాటలకు అద్భుతమైన కొరియోగ్రఫీతో కంటెస్టెంట్లు, మెంటర్లు డాన్స్ చేసి అలరించనున్నారు. ఈ కార్యక్రమం ప్రేక్షకులనుఅలరించేందుకు జీ తెలుగు వేదికగా ప్రసారం కానుంది.

## ఐసీసీ గోల్డ్ అవార్డు అందుకున్న కేఎల్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ

ఆరిలోవ, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త

కేఎల్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ (కోనేరు లక్ష్మయ్య ఎడ్యుకేషన్ ఫౌండేషన్ -( కెఎల్ఈఎఫ్ ) గ్రీన్ ఎనర్జీ, ఎనర్జీ ఎఫిషియెన్సీ విభాగంలో అకడమిక్ రంగంలో ప్రతిభకు గాను ప్రతిష్ఠాత్మక ఐసీసీ గోల్డ్ అవార్డును అందుకుంది. ఈ అవార్డును భారతీయ వాణిజ్య మండలి (ఇండియన్ ఛాంబర్స్ అఫ్ కామర్స్ - ఐసీసీ) కేంద్ర నూతన, పునరుత్పాదక శక్తి మంత్రిత్వ శాఖ (ఎం ఎన్ అర్ ఇ) డెలాయిట్ సహకారంతో నిర్వహించిన 6వ గ్రీన్ ఊర్జా అండ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ అవార్డ్స్ కార్యక్రమంలో ప్రదానం చేశారు. కేఎల్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ తరఫున రిజిస్ట్రార్ డా. కె. సుబ్బారావు ఈ అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా కేఎల్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ ఎర్రి కోనేరు లక్ష్మణ్ హవిష్ మాట్లాడుతూ"స్థిరత్వం అనేది ఒక విడిపరిచిన కార్యక్రమం కాదని, అది విద్య, పరిశోధన, సంస్థాగత ఆచరణలో భాగంగా ఉండాల్సిన సమిష్టి బాధ్యతని తెలిపారు. ఈ గుర్తింపు గ్రీన్ ఎనర్జీ, ఎనర్జీ ఎఫిషియెన్సీ, వాతావరణానికి అనుకూలమైన అభివృద్ధిపై మా దీర్ఘకాలిక నిబద్ధతను ప్రతిబింబిస్తోందన్నారు. ఈ గౌరవం యూనివర్సిటీ నాయకత్వం, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు సిబ్బంది సమిష్టి కృషికి ప్రతిబింబమని, విద్య ఆధారిత నవోత్తేజం, బాధ్యతాయుతమైన క్యాంపస్ ఆచరణల ద్వారా స్వచ్ఛ శక్తి పరిష్కారాలను ముందుకు తీసుకెళ్లేందుకు కేఎల్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ కట్టుబడి ఉందన్నారు.

## స్వచ్ఛ రథం ద్వారా పొడి చెత్త సామానులు సేకరణ..

### వాటికి నిత్యావసర సరుకులు అందజేత

ఆనందపురం, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త



గ్రామాల్లో స్వచ్ఛ రథం ద్వారా పొడి చెత్తగా నిర్ణయించిన సామానులు సేకరించి అందుకు తగ్గట్టుగా నిత్యావసర సరుకులను అందించే కార్యక్రమం నిర్వహిస్తున్నామని దాన్ని ప్రజలు వినియోగించు కోవాలని ఎంపీడీవో జానకి కోరారు. జనవరిలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రారంభించిన స్వచ్ఛ రథం మండలంలో గల 26 పంచాయితీలకు నెలకు ఒక సారి వెళుతుందన్నారు. ప్రభుత్వం పొడి చెత్తగా నిర్ణయించిన పేపర్లు, ప్లాస్టిక్, గాజు, ఇనుము, స్టీలు, అట్ట పెట్టెలు వంటి వాటిని స్వచ్ఛ రథానికి అందజేస్తే వాటికి ప్రభుత్వం నిర్ణయించిన రేట్లు ప్రకారం నిత్యావసర సరుకులను అందజేస్తారని చెప్పారు. కిలోల వారీగా ఇనుము వస్తువులు రూ.20, పేపర్లు రూ.13, పుస్తకాలు, అట్ట పెట్టెలు రూ. 10, ప్లాస్టిక్ బాటిళ్లు, రేకులు, నూనె డబ్బాలు రూ. 18, స్టీలు రూ. 38, అల్యూమినియం రూ. 120, ప్లాస్టిక్ రూ. 12 చొప్పున కొనుగోలు చేస్తారని ప్రజలు వినియోగించుకొని గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడానికి సహకరించాలని ఎంపీడీవో జానకి ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో కుసులువాడ సర్పంచ్ మహంతి వెంకటలక్ష్మి శివాజీ, కార్యదర్శి జమీర్ తదితరులు పాల్గొన్నారు.

## భానోజీ నగర్ అక్షరాంధ్ర సెంటరును సందర్శించిన జిల్లా కలెక్టర్

### బోధన విధానం, స్వచ్ఛంద బోధకుల, పనితీరుపై ఆరా



విశాఖపట్నం, ఫిబ్రవరి 06 ప్రభాతవార్త

చదువు కోని ప్రతి ఒక్కరు అక్షరాంధ్ర కార్యక్రమంలో చదువు నేర్చుకోవాలని జిల్లా కలెక్టర్ మన హరేందిర ప్రసాద్ సూచించారు. వయోజనుల్లో నిరక్షరాస్యతను తగ్గించి అక్షరాస్యతను పెంపొందించడం, ప్రాథమిక విద్యను అందించడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న అక్షరాంధ్ర నిర్వహణ కేంద్రం పనితీరును జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. శుక్రవారం రాత్రి యూసీడీ పీడీ సరోజినితో కలిసి ఈస్ట్ జోన్ పరిధిలోని భానోజీ నగర్ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, అక్కడ చదువుకుంటున్న వయోజనులు, స్వచ్ఛందంగా బోధిస్తున్న ఎస్ హెచ్ జి మహిళలతో మాట్లాడారు. చదువు నిత్య జీవితంలో ఎంతో ఉపయోగ పడుతుందన్నారు.బోధన విధానం, స్వచ్ఛంద ఉపాధ్యాయుల సేవలు, నిర్వహణ కమిటీల పనితీరుపై వివరాలను అడిగి తెలుసు కున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు, ఉద్దేశాలను సరిగా అర్థం చేసుకొని ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని సూచించారు. అక్షరాంధ్ర కార్యక్రమం ద్వారా కల్పిస్తున్న అవకాశాన్ని 15 నుంచి 59 సం వత్సరాల మధ్య వయస్సు గల అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ హితవు పలికారు. ఈ సందర్భంగా అక్కడి లబ్ధిదారులతో మాట్లాడి, వివిధ అంశాలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.

## సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం

### డబ్ల్యూఎన్ఎస్ కార్యాలయంలో అవగాహన సదస్సులో పోలీస్ కమిషనర్ డా.శంఖబ్రత బాగ్చీ



(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)

రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ మోసాల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని విశాఖపట్నం నగర పోలీస్ కమిషనర్, విశాఖపట్నం సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ (వీసీఎస్సీ) చైర్మన్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ అన్నారు. విశాఖపట్నంలోని డబ్ల్యూఎన్ఎస్ కార్యాలయంలో ఉద్యోగుల కోసం నిర్వహించిన సైబర్ భద్రత అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఆన్‌లైన్ మోసాలు, ఫిషింగ్, నకిలీ కాల్స్, లింకుల ద్వారా జరిగే సైబర్ నేరాలపై ఉద్యోగులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. డిజిటల్ లావాదేవీలు చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత సమాచారాన్ని ఎలా రక్షించుకోవాలి, సైబర్ నేరం జరిగితే వెంటనే ఫిర్యాదు చేయడం ఎంత ముఖ్యమో వివరించారు. నిజ జీవితంలో జరిగిన పలు ఉదాహరణలను ప్రస్తావించడం ద్వారా సదస్సు ఆసక్తికరంగా సాగింది. ఈ అవగాహన కార్యక్రమాన్ని విశాఖపట్నం సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ సైబర్ సెక్యూరిటీ ఫోరం జాయింట్ సెక్రటరీ కిషోర్ దాసరి పర్యవేక్షణలో నిర్వహించారు. వీసీఎస్సీ సెక్రటేరియట్ టీం సభ్యులు అసిస్టెంట్ డైరెక్టర్ సీమా సిక్రీ, ప్రాజెక్ట్ మేనేజర్ మిస్టర్ నవీన్ జె సమన్వయకర్తలుగా వ్యవహరించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ కార్యక్రమానికి సహకరించి, ఆతిథ్యం అందించిన డబ్ల్యూఎన్ఎస్ లోకేషన్ హెడ్ మిస్టర్ ఆర్.ఎల్. నారాయణకి, ఎం వారి నాయకత్వ బృందానికి వీసీఎస్సీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది. పరిశ్రమలు, విద్యాసంస్థల సహకారంతో సైబర్ సురక్షిత సమాజ నిర్మాణానికి నిరంతరం కృషి చేస్తామని వీసీఎస్సీ ప్రతినిధులు తెలిపారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన గంటా

భీమిలి, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త



జీవీఎంసీ 3 వ వార్డు పరిధిలో రూ.1.27 కోట్ల విలువైన అబ్బివృద్ధి పనులకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. అలాగే రూ.42 లక్షలతో ఆధునికీకరించిన కృష్ణా నగర్ కమ్యూనిటీ హాల్‌కు ప్రారంభోత్సవం చేశారు. నేరళ్లవలస కాలనీ, ఎగువ పేట, గొల్లలపాలెం, అప్పికొండ వారి వీధి, కృష్ణ కాలనీ, నల్లి వీధి తదితర ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయిన్ల తదితర పనులను చేపట్టనున్నారు. నియోజకవర్గంలోని ప్రతి జీవీఎంసీ వార్డులో రూ. 15 కోట్ల విలువైన పనులు జరుగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ నాగేంద్ర, జడ్పీటీసీ గాడు వెంకటప్పుడు, కార్పొరేటర్లు గంటా అప్పలకొండ, గాడు చిన్ని కుమారి లక్ష్మి, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, గంటా నూకరాజు, గొలగాని నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## నర్సింగ్ వృత్తిలో ఉన్నత ప్రమాణాలపై కౌన్సిల్ దృష్టి

### గీతం సదస్సులో ఎపిఎనఎమ్‌సి రిజిస్ట్రార్



విశాఖపట్నం, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త

నర్సింగ్ వృత్తిలో ఉన్నత ప్రమాణాలను నెలకొల్పడానికి ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ కౌన్సిల్ (ఎపిఎనఎమ్‌సి) ప్రత్యేకంగా దృష్టి సారించిందని ఎపిఎనఎమ్‌సి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.సుశీల పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ నర్సింగ్‌లోని మెడికల్ సర్జికల్ నర్సింగ్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన జాతీయ సదస్సును ఆమె ముఖ్యఅతిథిగా హజరై ప్రాంరభించారు. నర్సింగ్ వృత్తిలోకి ప్రవేశించే వారు ప్రతి 5 సంవత్సరాలకు తమ వివరాలను కౌన్సిల్ లో విధిగా రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. అధిక శాతం మంది తమ వివరాలు కౌన్సిల్‌లో నమోదు చేయకుండా నర్సింగ్ వృత్తిలో కొనసాగుతున్నారని అది అనైతికం అని అమె పేర్కొన్నారు. వైద్య రంగంలో నర్సింగ్ వృత్తికి పెరుగుతున్న ప్రాధాన్యత దృష్ట్యా నర్సింగ్ కౌన్సిల్ ద్వారా పలు వర్క్‌షాప్‌లను, శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రోగుల భద్రత, సేవల పట్ల ఉన్నత ప్రమాణాలను, నైతిక విలువలను పాటించాలని ఆమె సూచించారు. జిమ్‌సర్ (గీతం ఆసుపత్రి) ప్రో-వైస్‌ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి మాట్లాడుతూ నూతన విధానాలను అనుసరిస్తు నర్సింగ్ వృత్తిలోని వారు అత్యుత్తమ వైద్య సేవకులుగా ఎదగాలన్నారు. వయోజనుల మరియు వృద్ధుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఆలఇండియా ఇనిస్టిట్యూటఆఫ్ మెండికల్ సైన్సెస్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్.ఆనంద ఆమట్లాడూతూ దేశంలో అంటు వ్యాధుల కంటే క్యాన్సర్, మధుమేహం, కీళ్ళ సమస్యలతో ఆసుపత్రులకు వస్తున్నవారి సంఖ్య అధికంగా ఉందని తెలిపారు. అలాగే రహదారి ప్రమాదాలలో మరణిస్తున్నవారు ఎక్కువగా ఉంటున్నారని పేర్కొన్నారు. దేశంలో ఆయుష్ మాన్ భారత్ వంటి పథకాలు అమలులో ఉన్నప్పటికి రోగులకు సరిపడా ఐసియు బెడ్‌లు లేవని ముఖ్యంగా లక్ష మందికి రెండు ఐసియు బెడ్‌లు మాత్రమే అందుబాటులో ఉన్నాయని ఈ కారణంగా సరిఅయిన చికిత్స అందక ప్రజలు చనిపోతున్నారని తెలిపారు. సామాన్యుడికి వైద్యం భారంగా మారుతోందని పేర్కొన్నారు. చికిత్స సమయంలో రోగితో పాటు వారి కుటుంభ సభ్యులకు నర్సింగ్ నిపుణులు మనోధైర్యంతో అండగా నిలవాలని సూచించారు. నర్సింగ్ వృత్తి కాలానుగుణంగా కొత్త రంగాల వైపు అడుగులు వేస్తోందని ముఖ్యంగా నర్సింగ్ శాస్త్రవేత్తలు, ఫోరెన్సిక్ నర్సింగ్, అంతరిక్ష నర్సింగ్ సేవలు, పలవేటివ్ కేర్ వంటి అధునాతన నైపుణ్యాలు వృద్ధి చెందుతున్నాయని తెలిపారు. గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేషన్ బాలు మాట్లాడుతూ వైద్య చికిత్స సంబంధ ఆధారాల సహాయంతో నర్సింగ్ వృత్తి నిపుణులు రోగులకు సేవలు అందించే పద్ధతులను మార్పు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫ్రాన్సుకు చెందిన నర్సింగ్ నిపుణురాలు హనీఫ్ మ్యాక్‌వెల్, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎమ్.సత్యవల్లి, ఎసఆరఎమ్ విశ్వవిద్యాలయం వైద్య కళాశాల నర్సింగ్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.సీతాలక్ష్మి, గాయిత్రి విద్యా పరిషత్ సైక్రియాట్రీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.శ్రావణి, నర్సింగ్ నిపుణురాలు డాక్టర్ బి.వల్లి, డాక్టర్ ఉషాపన్నగవేణి, సదస్సు నిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఎస్.వి.ఎల్.పద్మకుమారి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## గీతంలో ఐఎస్‌టిడి ప్రాంతీయ సమావేశాలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త



జాతీయ స్థాయి వృత్తి నిపుణుల సంస్థ ఇండియన్ సొసైటీ ఫర్ ట్రైనింగ్ అండ్ డవలప్‌మెంట్ (ఐఎస్‌టిడి) దక్షిణ ప్రాంత సమావేశాలు గీతం డీమ్డ్ విశ్వ విద్యాలయంలో శుక్రవారం ప్రారంభం అయ్యాయి. "బిల్డింగ్ సస్టైనబుల్ ఆర్గనైజేషన్స్ -న్యూఏజ్ టాలెంట్ రెడీనెస" అనే అంశంపై రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశాలను భారత పరిశ్రమల సమాఖ్య విశాఖ (సిఐఐ) ఛైర్మన్, డెక్కన్ ఫైన్ కెమికల్స్ ఎగ్జిక్యూటీవ్ డైరక్టర్ డి.వి.ఎస్.నారాయణరాజు ముఖ్యఅతిధిగా హజరై ప్రారంభించారు. కృత్రిమ మేధ వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చినప్పటికి మానవ నైపుణ్యాల ద్వారా మాత్రమే సంస్థల ప్రగతి ఆధారపడి ఉంటుందని తెలపారు. పారిశ్రామిక రంగంలో వైఫల్యాల నుంచి సవాళ్ళను అనుభవ పూర్వకంగా అర్ధంచేసుకోవాలని దానికి సాంకేతికతను జోడించి ఫలితాలు పొందాలన్నారు. జిఎమఆర్ ఎయిర్‌పోర్టుల బోర్డు సభ్యుడు డాక్టర్ ఈమంది శంకరరావు మాట్లాడుతూ దేశంలోని వివిధ రంగాలలో 50 శాతం ప్రైవేటు రంగం పెట్టుబడులు ఉన్నాయని ఈ కారణంగా నైపుణ్యం గల మానవ వనరులకు మాత్రమే భవిష్యత్తులో అవ కాశాలు లభిస్తాయని తెలిపారు. కార్పోరేట్ రంగంలో ప్రస్తుతం సంస్థలు బహుముఖ వాణిజ్య విధానాలను అనుసరిస్తున్నాయని ముఖ్యంగా ఒకే సంస్థ వివిధ రకాల ఉత్పత్తుల ద్వారా మార్కెట్‌లో నిలదొక్కు కోవాలని ప్రయత్నిస్తోందని ఆయన పేర్కొన్నారు. కృత్రిమ మేధలో ఇటీవల ఆంత్రోపిక్ సంస్థ భవిష్యత్తులో చాలా పనులకు మనుషుల ప్రమేయం లేకుండా పనిచేయగల సామర్ధ్యాన్ని అభివృద్ధి చేసిందని ఇది క్షలాది ఉద్యోగాలు కోల్పోవడానికి దారి తీస్తోందన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని యువత కృత్రిమ మేధతో పోటీ పడుతూ, కలిసి ప్రయాణం చేస్తూ అవకాశాలను అందుకోవాలని సూచించారు. ఐఎస్‌టిడి జాతీయ అధ్య క్షుడు అతుల్‌షా, ఉపాధ్యక్షుడు అతుల్ శర్మ, దక్షిణ భారత విభాగం ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ కె.ఎ.జకారియా తమ ప్రసంగాలలో మార్పును అర్ధం చేసుకోలేని, తమ సంస్థలోని మానవ వనరుల నైపుణ్యాల పెంపుదలకు ప్రాధాన్యత ఇవ్వని పక్షంలో వైఫల్యాలు ఎదుర్కొవలసి ఉంటుందన్నారు. మానవ వనరులకు నిరంతరం శిక్షణ అందించడం ద్వారా సంస్థలు మనుగడ సాగించగలవని తెలిపారు. నవతరం భాగస్వామ్యంతో సంస్థలు రానున్న రోజులలో ప్రగతి దిశగా ప్రయాణించాలని సూచించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా.ఫణి పప్పు మాట్లాడుతూ కృత్రిమ మేధ ప్రవేశంతో ప్రపంచ వ్యాప్తంగా మానవ వనరులకు సరికొత్త పోటీ ఎదురవుతోందని పేర్కొన్నారు. అయితే మానవ మేధకు ప్రత్యామ్నాయం లేదని ఎఐ ఆధారంగా సరికొత్త వాణిజ్య నమూనాలు భవిష్యత్తులో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం నూతన విద్యా విధానానికి అనుగుణంగా మానవ వనరులను సిద్ధం చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల నుంచి ఐఎస్‌టిడి సభ్యులు, విశ్వవిద్యాలయాల నుంచి అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 12న 'ఉక్కు' సమ్మెను జయప్రదం చేయండి

### -వడ్లపూడిలో కార్మిక సంఘాల పాదయాత్ర




గాజువాక,ఫిబ్రవరి 6,ప్రభాతవార్త

విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం, కార్మిక హక్కుల రక్షణ కోసం ఫిబ్రవరి 12న నిర్వహించనున్న సమ్మెను జయప్రదం చేయాలని స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు. శుక్రవారం వడ్లపూడిలో నిర్వహించిన పాదయాత్రలో నేతలు జె.అయోధ్యరామ్, పి.వి. రమణమూర్తి, డి.ఆదినారాయణ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. ఏడాది కాలంగా వేతనాల్లో కోతలు విధిస్తూ, కరెంటు చార్జీల పెంపు, పాఠశాలల మూసివేత వంటి నిర్ణయాలతో యాజమాన్యం కార్మికులను వేధిస్తోందని మండిపడ్డారు. ప్లాంట్‌ను ప్రైవేటీకరించే కుట్రలను ఐక్య పోరాటంతోనే తిప్పికొడతామన్నారు. కార్యక్రమంలో దాలినాయుడు, సన్యాసిరావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.




## విద్యార్థుల్లో జోష్ నింపిన జోషా టీం

**గొలుగొండ ఫిబ్రవరి 6,ప్రభాతవార్త**



జోగుంపేట హైస్కూల్లో పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల్లో జోష్ నింపిన హై స్కూల్ పూర్వ విద్యార్థుల అసోసియేషన్ సభ్యులు. హైస్కూల్లో విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థుల ప్రతిభ తోటే తల్లిదండ్రుల కళ్ళల్లో డాడీ ఆనందం నింపుతుందని ఇందుకు ప్రతి విద్యార్థి కష్టపడాలన్నారు. ఉపాధ్యాయుల తిట్టారో కొట్టారని కారణంగా చూపుకుంటా భవిష్యత్తును అంధకారంలోకి నెట్టుకోవద్దన్నారు. ప్రతి విద్యార్థి తాను ఎంచుకోబోయే గోల్ లక్ష్యంపై నిర్దిష్టమైన అవగాహన పెంచుకోవాలన్నారు. 1988 విద్యా సంవత్సరంలో జోగుంపేట హైస్కూల్లో చదివిన పూర్వ విద్యార్థులు ఇప్పటివరకు ఈ స్కూల్లో చదివి పూర్వ విద్యార్థులైన అందరితో ఏర్పాటు చేసిన జోషా టీం అండగా నిలుస్తుందని భరోసా కల్పించారు. ఈ ఏడాదితో మీరు కూడా జోషా టీమ్ లో చేరుతారని రాబోయే రోజుల్లో ఒకరికి చేయూతని అందించే విధంగా ఎదగాలని దీవించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ లు సత్యనారాయణ, కృష్ణ ప్రసాద్, పూర్వ విద్యార్థి అయిన నర్సీపట్నం ఎంఈఓ నాగేంద్ర విద్యార్థులకు తమ అనుభవాలను వివరించారు. జోష్ టీం జోకుంపేట హై స్కూల్ పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ద్వారా గత ఏడాది 10 పరీక్షల్లో పాఠశాలలో మొదటి రెండు స్థానాలు సాధించిన విద్యార్థులకు వారి తల్లిదండ్రుల సమక్షంల

## మంచినీటి పథకం పనుల్లో నిర్లక్ష్యం.. ట్యాంక్ లీకేజీ

**(రాంబిల్లి ఫిబ్రవరి 6 ప్రభాతవార్త)**



రాంబిల్లి మండలం దిమిలి గ్రామంలో నిర్మిస్తున్న మంచినీటి ట్యాంక్ లీకులు ఏర్పడ్డాయి, దిమిలిలో జల్ జీవన్ మిషన్ తొలి విడతగా రూ కోటి మంజూరు అయ్యాయి, ఈ నిధుల్లో రూ 20 లక్షలతో ప్రాథమిక పాఠశాల ఆవరణలో 60 వేల లీటర్ల సామర్థ్యంతో మంచినీటి పథకం నిర్మిస్తున్నారు, నిర్మాణం పూర్తవడంతో ట్యాంకు నీటిని ఎక్కించి పరీక్షిస్తుండగా పైపులు గుండా నీరు లీక్ అవుతుంది, ఈ విషయమై గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆర్ డబ్ల్యు ఎస్ ఏఈ కమలవికాస్ వద్ద ప్రస్తావించగా బిల్లులు మంజూరు అవ్వకపోవడంతో గుత్తేదారు ట్యాంకు పైకి వెళ్లే పైపులు రంద్రాలు పూర్తిగా మూయలేదని చెప్పారు, రంద్రాలు మూయకపోవడంతోనే నీరు లీక్ అవుతుందని ఆయన అన్నారు, లీకులు సరిదిద్ది ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని ఏఈ వివరించారు.

## తాగునీటి ఎద్దడి నివారణకు క్రాష్

**గొలుగొండ ఫిబ్రవరి 6 ప్రభాతవార్త**



ఈ వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా క్రాస్ కార్యక్రమంలో ద్వారా ముందస్తు చర్యలు చేపట్టినట్లు ఎంపీపీ గజ్జలపు మణికుమారి అన్నారు. మండల పరిషత్ లో శుక్రవారం క్రాస్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. 27 గ్రామపంచాయతీలో ఉన్న తాగునీటి బోర్లను ఎప్పటికప్పుడు సందర్శించి వాటి స్థితిగతులను ఇబ్బంది పరిశీలిస్తారని అన్నారు. వేసవి రాకముందే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని ఎంపీడీవో ఉలబాల శ్రీనివాసరావు తెలిపారు. క్రాష్ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక వాహనం ఏర్పాటు చేసి బోర్లకు అవసరమయ్యే మెటీరియల్ సిద్ధంగా ఉంటుందన్నారు. దీంతో తక్షణమే సిబ్బంది వాటిని రిపేర్ చేస్తారన్నారు. కార్యక్రమంలో ఏవో మహేశ్వరరావు, మండల పరిషత్ సిబ్బంది, ఆర్ డబ్ల్యూఎస్ సహాయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇళ్లకు పరిహారం చెల్లించేందుకు అంచనా

**(రాంబిల్లి ఫిబ్రవరి 6 ప్రభాతవార్త)**



రాంబిల్లి మండలం సీతపాలెం గ్రామంలో ఇళ్లకు కొలతలు వేస్తున్నారు, ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) భూసేకరణలో ఉన్న లాలం కోడూరు శివారు సీతపాలెం గ్రామంలో ఉన్న ఇళ్లకు నష్టపరిహారం చెల్లించేందుకు రెండు రోజులుగా అంచనాలు వేస్తున్నారు, మొత్తం 56 నివాసాలు ఉన్నాయని వీఆర్వో సూరిబాబు చెప్పారు, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రోడ్లు భవనాల శాఖ జేఈ సుందరపు. పద్మని మరియు రెవెన్యూ సిబ్బంది ప్రతి ఇంటికి కొలతలు తీసుకొని నమోదు చేస్తున్నారు, నిర్వాసితుల ఇళ్లకు నష్టపరిహారం చెల్లించాక గ్రామాన్ని ఖాళీ చేస్తామని స్థానిక తహసిల్దార్ ఏ. శ్రీనివాసరావు చెప్పారు, సీతపాలెం కృష్ణం పాలెం నిర్వాసితులకు పునరావాసం కల్పించేందుకు పంచదారలలో కొండవాలు ప్రాంతంలో 25 ఎకరాలు భూమిని కేటాయించామని ఆయన తెలిపారు, పునరావాసానికి కేటాయించిన స్థలాన్ని ఏపీఐఐసీ కి అప్పగించడంతో రెండు రోజులు లేఅవుట్ నిర్మించే పనులు సాగుతున్నాయని ఆయన చెప్పారు.

## ప్రకృతి వ్యవసాయ పంటలను వేయండి. ఆరోగ్యాన్ని కాపాడుకోండి

**ఎస్ రాయవరం, ప్రభాతవార్త**



ప్రకృతి వ్యవసాయ పంటలను పండించడం వలన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చుని డి పి ఎం సిహెచ్ లచ్చన్న అన్నారు. శుక్రవారం ప్రకృతి వ్యవసాయం పై ధర్మవరం అగ్రహారం చిన్న గుమ్ములూరు గ్రామల్లో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయం చేయాలని ప్రకృతి వ్యవసాయంలో ఉన్న ఆరోగ్యమైన పంట తినడం వలన మన ఆరోగ్యం కాపాడుకోవచ్చని ఎరువులతో పండించిన పంట అనేక రోగాలకు దారి తీస్తుందని.వైద్యులు ఇప్పటికే సర్వేలో క్యాన్సర్ బారిన పడుతున్నట్లు ప్రజలు ఈ సర్వేలు తేలుతున్నట్లు పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయం చేసిన రైతులకు సన్మానం చేయడం జరిగింది సాదిరెడ్డి సన్యాసిరావు, నగిరెడ్డి అప్పారావు లకు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నందుకు వారిని అభినందించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు ఏపీ సీఎం సిబ్బంది డిస్టిక్ ఇన్చార్జ్ గోవిందు, శివ, రాము, భూలోకరావు, కనకారావు, ఐ సి ఆర్ పి లు గ్రామ నాయకులు కొలగని కాశి బాబు, గాడి నాగేశ్వరావు, వెదుళ్ళ ప్రసాదరావు. రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా వినాయకుని ఆలయ వార్షికోత్సవం

**కసింకోట, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త**



మండలంలోని విశాఖ డిక్షలరీ కంపెనీ ఆలయ ప్రాంగణంలో కంపెనీ ఎండి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా వినాయకుని ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం భారీ ఎత్తున అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు.

## గడ్డి ట్రాక్టర్ దగ్ధం

**(ఎస్ రాయవరం ఫిబ్రవరి 6 ప్రభాతవార్త )**



వివరాల్లోకి వెళితే శుక్రవారం కర్రి వాని పాలెం గ్రామానికి చెందిన కవులురైతు గొర్లి శీను బంధలలో నూర్పు నూ ర్చుకొని సర్వసిద్ధి నుండి ఉప్పరపల్లి వెళ్లే మార్గంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అవడంతో గడ్డి పూర్తిగా దగ్ధమైంది. ట్రాక్టర్ ఓనర్ తుంపాల గోవింద ట్రాక్టరు టైర్లు.తొట్టి పూర్తిగా కాళి బూడిదయ్యాయి.

# మున్సిపాలిటీ అభివృద్ధికి భారీగా నిధులు కేటాయింపులు..

*- బడ్జెట్ అంచనాలకు ఆమోదం..*

*- ఐదు సంవత్సరాలు సహకరించిన కౌన్సిల్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపిన చైర్పర్సన్ పిల్లా రమాకుమారి..*

**ఎలమంచిలి, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:**





పట్టణ మున్సిపల్ చైర్పర్సన్ పిల్లా రమాకుమారి అధ్యక్షతన గురువారం మున్సిపల్ ఆఫీస్ ఆవరణలో సాధారణ మున్సిపల్ సమావేశం నిర్వహించారు. పట్టణ ప్రజల అవసరాలు, మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా 202526 సవరించిన బడ్జెట్ , 202627 ఆర్థిక సంవత్సరపు బడ్జెట్ అంచనాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఈ మేరకు ఇంజనీరింగ్, ప్రజారోగ్యం , పట్టణ ప్రణాళిక విభాగాలకు భారీగా నిధులు కేటాయించారు. ప్రజారోగ్య విభాగం కింద పారిశుద్ధ్య కార్మికుల జీత భత్యాలకు సుమారు ..3.40 కోట్లు,పట్టణంలో వీధి దీపాల నిర్వహణ , విద్యుత్ ఛార్జీల కోసం దాదాపు ..90 లక్షల వరకు అంచనాలు రూపొందించారు. తాగునీటి పైపులైన్ల మరమ్మత్తులు, క్లోరినేషన్, వాటర్ ట్యాంకర్ల సరఫరా కోసం ..15 లక్షలకు పైగా కేటాయింపులు చేశారు. పట్టణంలోని ప్రధాన రహదారుల ఇరువైపులా ఉన్న కాలువల్లో పూడికతీత పనుల కోసం ..15 లక్షలు, నీటి సమస్య పరిష్కారానికి వార్డుల వారీగా ప్రత్యేక నిధులు కేటాయించారు. వేసవి దృష్ట్యా బోర్ వెల్స్ మరమ్మత్తులు, కొత్త మోటార్ల కొనుగోలు కోసం ..5 లక్షలు వెచ్చించనున్నారు.చెత్త సేకరణ, వాహనాల నిర్వహణకు భారీగా నిధులు కేటాయించారు. మున్సిపల్ కార్యాలయ నిర్వహణ, కంప్యూటర్ల కొనుగోలు, లీగల్ ఫీజులు , ఇతర పరిపాలనా ఖర్చుల కోసం కూడా బడ్జెట్లో తగిన ప్రాధాన్యత కల్పించారు. పట్టణ అభివృద్ధికి కౌన్సిల్ తీసుకున్న ఈ నిర్ణయాల పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ లు గుప్త, బెజవాడ నాగేశ్వరరావు, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ రాజు, డి ఈ కనకరాజు, మున్సిపల్ ఏఈలు నానాజీ, గణ పతి సుబ్బారావు, పట్టణ ప్రజా ఆరోగ్యశాఖ అధికారి పల్లా శ్రీనివాస రావు, వివిధ శాఖల అధికారులు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎయిడ్స్ వ్యాధి నియంత్రణకు కీలక ముందడుగు

**- సంచార ఐసీటీసీ వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించిన జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్**

**అనకాపల్లి, ఫిబ్రవరి 6 (ప్రభాత వార్త):**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో మారుమూల ప్రాంతాల ప్రజలకు హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి సంబంధిత సేవలను మరింత చేరువ చేయడంలో మొబైల్ ఇంటిగ్రేటెడ్ కౌన్సెలింగ్ అండ్ టెస్టింగ్ సెంటర్ (ఐసీటీసీ) సంచార వాహన సేవలు కీలకంగా నిలవనున్నాయని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో హెచ్ఐవి ఎయిడ్స్ నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన కొత్త సంచార ఐసీటీసీ వాహనాన్ని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంచార ఐసీటీసీ వాహనం ఇంటింటికీ వెళ్లి హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధిపై కౌన్సెలింగ్, నిర్ధారణ పరీక్షలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనుందన్నారు. ఈ చర్య ద్వారా ప్రజలకు సులభమైన యాక్సెస్ కల్పిస్తూ, ఎయిడ్స్ వ్యాధి నియంత్రణలో ఇది ఒక ముఖ్యమైన ముందడుగుగా నిలుస్తుందన్నారు. దిశ క్లినికల్ సర్వీసెస్ అధికారి డాక్టర్ సి.హెచ్. స్పందన మాట్లాడుతూ, నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ , రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లాకు ఈ సంచార ఐసీటీసీ వాహనం కేటాయించబడిందన్నారు. ఈ వాహనం ద్వారా హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధిపై కౌన్సెలింగ్, నిర్ధారణ పరీక్షలు, సంపూర్ణ సమాచారంతో పాటు కరపత్రాలు, వీడియోల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హైమావతి, డీటీపీటీవో డాక్టర్ కె.స్వప్న, దిశ సిపిఎమ్ డాక్టర్ సి.హెచ్. స్పందన,ఎన్జీఓల ప్రతినిధులుపాల్గొన్నారు.

## ఘనంగా నూకాంబిక మాల ధారణ మహోత్సవం

**అనకాపల్లి ఫిబ్రవరి 6 (ప్రభాతవార్త)**



ఉత్తరాంధ్ర ఇలవేల్పు నూకంబిక అమ్మవారి మాల ధారాల సంఘం శ్రీ నూకాంబిక అమ్మవారి మాల ధారణ మహోత్సవాలు ఆలయ మండపంలో శుక్రవారం ఘనంగా జరిగింది. మాజీ మంత్రి , అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ పాల్గొని సంఘ సేవకులు కాండ్రేగుల శ్రీరామ్ ఆర్థిక సహకారంతో గ్రామ రక్షణ కొరకై కోటమీద నుండి ఏడుగురు అక్క చెల్లెలు తమ్ముడు పోతురాజు తో రథంపై వస్తున్న నూకాలమ్మ భారీ సెట్ ను ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. గురు స్వామి, ఎమ్మెల్యే సమక్షంలో మొదట మాలధారణ జరిగింది. వచ్చేనెల 14వ తారీఖున మంగళవారం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన, అంగరంగ వైభవంగా అమ్మవారి ఉత్సవమూర్తితో పలు సంస్కృతి కార్యక్రమాలతో ఊరేగింపు నిర్వహిస్తామని మాల ధారాల సంఘం వ్యవస్థాపకులు పొలిమేర శ్రీను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో. దేవస్థానం చైర్మన్ పిలా నాగ శ్రీను (గొల్ల బాబు), ఆలయ సహ కమిషనర్ యళ్ళ శ్రీధర్, ఆలయ ధర్మకర్తలు, మాలదారుల సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## జి.ఎఫ్.ఎల్.ఎన్. పరిశీలించిన డి.ఏ.ఎఫ్ టీం..!

**నర్సీపట్నం/ కోటఉరట్ల, (ప్రభాతవార్త)**



మండలంలో కొత్త గొట్టివాడ జల్లూరు ప్రాథమిక ఉన్నత పాఠశాలలో అమలవుతున్న జి ఎల్ .ఎఫ్. ఎన్ .కార్యక్రమాన్ని యలమంచిలి జిల్లా ఉప విద్యాశాఖ అధికారి పెన్నాడ అప్పారావు ఆధ్వర్యంలో జిల్లా మానిటరింగ్ సిబ్బంది పలు పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించారు. దీనిలో భాగంగా కొత్త గొట్టివాడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులను వారి యొక్క అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం జల్లూరు ప్రాథమిక పాఠశాలలో జి .ఎఫ్.ఎల్.ఎన్. పరిశీలించారు. విద్యార్థులు చదవడం, రాయడం పరిశీలించారు. ఉపాధ్యాయులకు సూచనలు ఇవ్వడం జరిగింది.అనంతరం జల్లూరు ఉన్నత పాఠశాలలో అసెస్మెంట్ పుస్తకాలు ప్రగతి పత్రాలు పదవ తరగతి వందరోజుల కార్యాచరణ ప్రణాళికను పరిశీలించి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. త్వరలో జరగబోయే పదవ తరగతి పరీక్షలకు విద్యార్థులు ధైర్యంతో ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని ఏమైనా సందేహాలు ఉంటే ఉపాధ్యాయులను వెంటనే అడిగి తెలుసుకుని నివృత్తి చేసుకోవాలని డివైఈవో పెన్నాడ అప్పారావు తెలిపారు విద్యార్థుల యొక్క ప్రగతిని పరిశీలించారు. ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని, రాత్రి వేళ విద్యార్థులు ఇండ్లకు ఉపాధ్యాయులు సందర్శించి తల్లిదండ్రులతో మాట్లాడి చదువుకునేటట్లు ప్రోత్సహించాలన్నారు. తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి పిల్లల ప్రగతిని తెలియజేయాలి అన్నారు . శతశాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్.ఎమ్.శ్రీనివాసమూర్తి,స్థానిక మండలవిద్యాశాఖాధికారి రామారావు జిల్లా అకాడమిక్ ఫోరం సభ్యులు కె నరేష్ ఆర్. నాగన్న దొర ఎన్.వి.ఎస్.ఆచార్యులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఇండ్లకు ఎంఈవో "నరేష్"

**(నక్కపల్లి, ప్రభాతవార్త )**



మండలంలో పదవ తరగతి విద్యార్థుల కార్యాచరణ ప్రణాళికపై మండలవిద్యాశాఖాధికారి కే.నరేష్ మరింత దృష్టి సారించారు.దీనిలో భాగంగా మనబాల వానిపాలెంలో గురువారం రాత్రి ఏమేరకు చదువుతున్నారో ఇండ్లకు వెళ్ళి ఆయన పలిశీలించి తల్లిదండ్రలతో మాట్లాడారు. పరీక్షలు పూర్తయ్యే వరకు ఇంటి వద్ద టీవీలో బందు చేయాలని సూచించారు. రాత్రి వేళ తెల్లవారుజామున లేచి చదవాలని అన్నారు. గ్రామ ప్రజల సహకారంతో మనబాలవానిపాలెం పాఠశాల ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన స్టడీ సెంటరుని ఆయన పరిశీలించి చిన్నారులను అభినందించారు.

## నూకాంబికను దర్శించుకున్న టీటీడీ డైరెక్టర్ శాంతా రామ్

**అనకాపల్లి రూరల్ ఫిబ్రవరి 6 :(ప్రభాత వార్త)**



ఉత్తరాంధ్ర ఇలవేల్పు అనకాపల్లి గవరపాలెం లో వెలిసిన శ్రీ నూకాంబిక అమ్మవారికి దేవస్థానంలో శుక్రవారం తిరుమల తిరుపతి దేవస్థానం డైరెక్టర్ వైద్యం శాంతా రామ్ దంపతులు అమ్మవారి దర్శించుకున్నారు. వీరిని అమ్మవారి చిత్రపటం ప్రసాదం అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు), ఆలయ సహ కమిషనర్ యళ్ళశ్రీధర్, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

## ప్రజాదర్బార్లో అర్జీలను స్వీకరిస్తున్న పప్పల చలపతిరావు...

**ఎలమంచిలి ఫిబ్రవరి 06, ప్రభాతవార్త:**



పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ సీనియర్ తెలుగుదేశం నాయకులు పప్పల చలపతిరావు పాల్గొని మండలంలోని మున్సిపాలిటీలో గల ప్రజల వద్ద నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా పప్పల చలపతిరావు మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలిగిన ఏదైనా సమస్య ఉంటే ఈ ప్రజా దర్బార్ కార్యక్రమంలో తెలియజేయాలని సాధ్యమైనంత త్వరగా ఆ సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ అధికార ప్రతినిధి దాడి రమేష్, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గొర్లె నానాజీ, జిల్లా ఉపాధ్యక్షుడు ఇత్తంశెట్టి రాజు, సీనియర్ నాయకులు రాజాన సూర్య నాగేశ్వరరావు, రాంబిల్లి పిఎసిఎస్ చైర్మన్ ఎరిపిల్లి చిట్టిబాబు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గొర్లె బాబురావు, యూనిట్ ఇంచార్జ్ షేక్ కాసిం, సురకాసుల రమణ, పాల్గొన్నారు.

## ఆటస్థలంలో ఫిల్టర్ బెడ్ వద్దు..

**- యలమంచిలి మున్సిపల్ చైర్మన్‌కు తెరువుపల్లి గ్రామస్తుల విన్నపం**

**ఎలమంచిలి, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:**



గ్రామస్తుల సామాజిక అవసరాలకు, పిల్లల భవిష్యత్తుకు కీలకమైన ఆటస్థలాన్ని కాపాడుకోవాలని కోరుతూ తెరువుపల్లి గ్రామస్తులు మున్సిపల్ అధికారులను ఆశ్రయించారు. శుక్రవారం మున్సిపల్ చైర్మన్ పిల్ల రమా కుమారిని కి వినతి పత్రాన్ని అందజేశారు. గ్రామంలో పాఠశాల విద్యార్థులు ఆడుకోవడానికి, గ్రామ సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకోవ డానికి ప్రస్తుతం ఉన్న స్థలం ఎంతో ఉపయోగకరంగా ఉందని గ్రామస్తులు తెలిపారు. ఆ ఆటస్థలంలో డ్రైనేజీ వాటర్ ఫిల్టర్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని గ్రామస్తులు ఏకగ్రీవంగా వ్యతిరేకిస్తున్నారు. ఫిల్టర్ బెడ్ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేసి, దానిని వేరొక ఖాళీ ప్రదేశానికి తరలించాలని గ్రామస్తులు కోరారు. భవిష్యత్తులో కూడా ఈ స్థలంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టకుండా క్రీడా ప్రాంగణంగానే ఉంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ యువకులు ఆటస్థలాన్ని కాపాడుకునే వరకు తమ పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు.

## 14వ వార్డు అభివృద్ధి శూన్యం...

**- ఐదు సంవత్సరాలుగా పట్టించుకోని అధికారులు..**

**ఎలమంచిలి,ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:**



పేరుకి మున్సిపల్ వైస్ చైర్మన్ కానీ వార్డులో అభివృద్ధి మాత్రం శూన్యం పరిస్థితి అగమ్య గోచరం. మున్సిపాలిటీలో ఐదు సంవత్సరాలుగా మున్సిపల్ వైస్ చైర్మన్ గా 13, 14వ వార్డు గుప్త పదవిని కొనసాగించారు. వచ్చే నెల మార్చి 17వ తారీకుతో పదవీకాలం పూర్తవుతున్న కనీసం వార్డులో ఒక అభివృద్ధి కార్యక్రమాన్ని కూడా చేయించలేకపోయానని మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశంలో తన గోడును వినిపించుకున్నారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కౌన్సి ల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ గుప్తా మాట్లాడుతూ 13 ,14 వార్డుల్లో కనీసం ఒక అభివృద్ధి కార్యక్రమాన్ని కూడా చేయకపోవడం ఎంతవరకు సమంజస్మని అధికారులను నిలదీశారు. శిలాఫలకాలికే పరిమితమా అంటూ కనీసం అధికారులు ఒక కార్యక్రమాన్ని కూడా చేయడానికి ఎందుకు వెనకాడుతున్నారని అడిగారు. ఐదు సంవత్సరాలుగా ప్రతి కౌన్సిల్ సమావేశంలోనూ తాను ప్రతిపాదిస్తున్నానని కానీ అంతవరకు ఒక్కటి కూడా చేయకపోవడం ఏమిటి అని అన్నారు. మున్సిపాలిటీలో వార్డులన్నీ ఒకే విధంగా చూడాలని కానీ అధికారులు కొన్ని వార్డులకు మాత్రమే ప్రయారిటీ ఇస్తున్నారు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పదవుల్లో ఉంటే ప్రజలకు సేవ చేయడానికి కానీ పదవుల్లో ఉంది అలంకారప్రాయంగా ఉండటానికి కాదని కనీసం అధికారులు పదవుల్లో ఉన్న తమకు సుముచిత గౌరవం ఇవ్వలేదని గుప్త తన ఆవేదాన్ని వ్యక్తం చేశారు. ఎప్పుడు కౌన్సిల్ సమావేశంలో ఏది అడిగినా అధికారులు దాటవేత ధోరణి ప్రదర్శించారని కనీసం అభివృద్ధి పనులను నిర్వహించడానికి ఎందుకు తాత్సారం చేస్తున్నారంటూ నిలదీశారు.

## గురుకుల పాఠశాల నిర్వహణ అధ్వానంగా ఉందంటూ ఎమ్మెల్యే ఆగ్రహం

**ఎలమంచిలి, ఫిబ్రవరి 06, ప్రభాతవార్త:**



మున్సిపాలిటీ పరిధిలోని కొక్కిరాపల్లి గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాల ఆవరణలో విద్యార్థులకు ఉపయోగించే టాయిలెట్స్ అద్వానంగా ఉండడాన్ని గమనించిన ఎమ్మెల్యే గురుకుల పాఠశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ ను నిర్వహణ ఇలాగే చేస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలోని ఎంతోమంది పిల్లలు ఉంటున్నారని వారి ఆరోగ్య భద్రత పాటించాల్సిన విషయం ఎంతైనా ఉంది కదా మీరు ఇలాగే నిర్వహిస్తారా అంటూ నిలదీశారు. అనంతరం విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న కళ్లద్దాలను అవసరమైన వారికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజాన శేషు, జనసేన పట్టణ పార్టీ అధ్యక్షుడు బోద్దపు శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ లవుడు లోవరాజు, గురుకుల పాఠశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## 84 వ వార్డులో 5 కోట్లు నిధులు మంజూరు: మాదంశెట్టి నీలబాబు

**అనకాపల్లి ఫిబ్రవరి 6 (ప్రభాతవార్త)**



84 వ వార్డులో కార్పొరేటర్ చిన్న తల్లి ప్రతి పాదించిన పనులకు 5 కోట్లు జీవీఎంసీ నిధులు మంజూరు చేశారని 84వ వార్డు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ మాదంశెట్టి నీలబాబు తెలియ జేశారు. 84వ వార్డులు కార్పొరేటర్గా చిన్నతల్లిని ఆదరించి జీవీఎంసీ ఎన్నికల్లో గెలిపించినందుకు వార్డు ప్రజలు ప్రతిపాదనలు ఇప్పటివరకు 50 కోట్ల నిధులతో పనులు చేపట్టడం జరిగిందని, ఇప్పుడు మరలా 5 కోట్లతో ప్రతిపాదించిన పనులకు శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్ జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావు అనకాపల్లి నియోజకవర్గ తెలుగుదేశం ఇన్చార్జ్ పీలా గోవింద సత్యనారాయణ సహాయ సహకారాలతో జీవీఎంసీ నుండి నిధులు మంజూరు కి సహకరించినందుకు వారికి అభినందనలు తెలియజేశారు. రింగ్ రోడ్డు లో రోడ్డు విస్తరణ పనులకు గతంలో 1.40 కోట్లు మంజూరు చేసినవి కాకుండా ఇప్పుడు మరలా 2 కోట్లుతో అభివృద్ధి చేయడానికి, కొండ కొప్పాక ప్రజలు అభ్యర్థన మేరకు కళ్యాణమండపం రెండు కోట్లు నిధులు మంజూరు చేసి టెండర్లు పిలిచి అనుమతించడం జరిగిందని తెలిపారు. పెరుగు బజారు నుండి స్టేషన్ రోడ్డు వరకు సెంట్రల్ లైటింగ్ 10 రింగ్ పోల్స్, బైపాస్ జంక్షన్ నుండి శారదా బ్రిడ్జి వరకు ఎలక్ట్రికల్ పోల్స్ కు జాతీయ రంగులు వేయడానికి నిధులు మంజూరు చేశారని నీలబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో 84 వ వార్డు టిడిపి అధ్యక్షులు తలారి ప్రసాదు, దానబోయిన నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.




## విజ్ఞానభారతి పాఠశాలలో ఘనంగా 31 వార్షికోత్సవం

**అరకులోయ, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త**



అరకులోయ విజ్ఞాన భారతి ( బి వి కె ) పాఠశాలలో శుక్రవారం 31 వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. పాఠశాల ప్రధానాచార్య కే వెంకటరావు ఆధ్వర్యంలో జరిగిన వార్షికోత్సవంలో పాఠశాల కరెస్పాండంట్ కావుగంటి కృష్ణారావు, అరకు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎల్.బి. వెంకటేశ్వరరావు, ప్రముఖ కాంట్రాక్టర్ సి. హెచ్ సింహాచలం నాయుడు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించి ఉన్నత స్థానాలను పొందాలని ఆకాంక్షించారు. వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేసారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయు లు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కినపర్తి,చుట్టుబందలో బాల్య వివాహ ముక్తభారత్

**కొయ్యూరు ఫిబ్రవరి 6 ప్రభాతవార్త**



ఐసిడిఎస్ సిడిపిఒ దేవమణి ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని కినపర్తి, చుట్టుబంద గ్రామాలలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు, స్థానిక అంగన్వాడి కార్యకర్తలు, హెల్పర్లు గ్రామస్తులతో కలిసి బాల్య వివాహ ముక్తభారత్ కార్యక్రమం నిర్వహించారు. బాల్యవివాహాల వలన కలిగే అనర్థాలను, చట్టాలను వివరించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బాల్య వివాహాల నిరోధానికి అందరి సహకారం అవసరమని కోరారు.

## ఎన్టీపి సంఘం అధ్యక్షుడిగా సంజీవరావు

**డుంబ్రిగుడ: ఫిబ్రవరి: 06: (ప్రభాతవార్త:)**



నోబెల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్ టి ఏ)(టిడిపి అనుబంధ ఉపాధ్యాయ సంఘం) డుంబ్రిగూడ మండల అధ్యక్షుడిగా కమ్మిడి సంజావరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో ఆ సంఘం మండల శాఖ నూతన కమిటీని జిల్లా అధ్యక్షుడు సింహాచలం ఆధ్వర్యాన ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఈ సందర్భంగా సింహాచలం మాట్లాడుతూసమస్యల పరిష్కారంతోపాటు ఎం టి ఏ సంఘం బలోపేతంపై శ్రమిస్తూ ఉపాధ్యాయుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కార దిశగా కృషి చేయాలన్నారు. నూతన మండల అధ్యక్షులు సంజీవరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి శక్తికి మించి కృషి చేస్తానని ఆయన చెప్పారు. అలాగే ఎన్ టి ఏ సంఘం బలోపేతానికై శ్రమిస్తానని ఆయన అన్నారు. నూతన కమిటీ లో ప్రధాన కార్యదర్శి లవకుశ, ఉపాధ్యక్షుడిగా రమేష్, కార్యదర్శులుగా పద్మావతి, అప్పలస్వామి, వీర్రాజు మధు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారూ.

## వృత్తి నైపుణ్య శిక్షణకు ఆహ్వానం

**డుంబ్రిగుడ: ఫిబ్రవరి 06:( ప్రభాతవార్త:)**

రాష్ట్ర ప్రభుత్వం సిడాప్, డీడీయూ, జీకేవై సంయుక్తంగా నిర్వహించనున్న వృత్తి నైపుణ్య శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని వెలుగు జేఆర్పి బొజ్జన్న తెలిపారు. మూడు నెలలపాటు ఉచితంగా ఫీల్డ్ టెక్నీషియన్(కంప్యూటింగ్, పెరిఫెరల్స్) ఎలక్ట్రిషియన్, రిటైల్సేల్స్ అసిస్టెంట్, వేర్హౌస్ క్లెయిమ్స్ కోఆర్డినేటర్పై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు పదో తరగతి ఉతీర్ణులై ఉండి 30ఏళ్లపు ఉండి ఈనెల 8న అరకులోయ వెలుగు కార్యాలయానికి సంప్రదించాలని ఆయన కోరారు.

## ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్..

**- ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవి**

**రాజవొమ్మంగి, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త**



ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్ కార్యక్రమమని రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవి అన్నారు. రాజవొమ్మంగి మండలం వట్టిగెడ్డ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ ప్రజాదర్బార్ కు వచ్చిన ప్రతీ సమస్యను పరిష్కారం చేస్తామన్నారు. దరఖాస్తుదారులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఆయా మండల కేంద్రాల్లో ప్రతీ శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమం ప్రభుత్వం పటిష్ఠంగా అమలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం దరఖాస్తుల పరిష్కారంపై చాలా చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. ప్రజాదర్బార్ లో పలు సమస్యలపై ఎమ్మెల్యేకు ప్రజలు విన్నవించారు. సింగంపల్లి గ్రామంలో నీరు, సీసీ రోడ్లు, రోఫ్ వే వంతెన మరమ్మత్తులు వంటి పలు సమస్యలను గ్రామస్తులు ఎమ్మెల్యేకు తెలిపారు. సంబంధిత అధికారులకు ఫోన్ లో మాట్లాడి పరిష్కారం చేయాలని ఆదేశించారు. పలు గ్రామాల ప్రజలు గృహ నిర్మాణ బిల్లులు మంజూరు, చేతిపంపులు ఏర్పాటు తదితర సమస్యలపై ఆమె దృష్టిలో పెట్టగా, ప్రాధాన్యత ప్రకారం పరిష్కారం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో స్థానిక నాయకులు రాష్ట్ర దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ సుభానీ, రంపచోడవరం మండల పార్టీ అధ్యక్షులు పెంటపాటి అనంత మోహన్, అడ్డతీగల సొసైటీ చైర్మన్ బుర్లె హరిబాబు, జనసేన మండల పార్టీ అధ్యక్షులు బొదిరెడ్డి త్రిమూర్తులు, పీసా కమిటి ఉపాధ్యక్షులు దేశగిరి శివ, విళ్లా గోపి, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## విద్యార్థి దశ నుంచే సభ్యత సంస్కారం కలిగిన చదువు కలిగి ఉండాలి

**- అరకు సీఐ హిమగిరి**

**అనంతగిరి పిబ్రవరి 6 ప్రభాతవార్త**



విద్యార్థి దశ నుంచే సభ్యత సంస్కారం కలిగిన చదువు కలిగి ఉన్నప్పుడు సమాజానికి ఉపయోగపడతరని అరకు సీఐ హిమగిరి అన్నారు మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికలపాఠశాల 2 లొ విద్యార్థినులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అరకు సీఐ హిమగిరి మాట్లాడుతూ.. గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పై అవగాహన కల్పించారు. సెలవల్లో విద్యార్థినిలు గ్రామాలకు వెళ్లినప్పుడు తల్లితండ్రులు మంచి విషయాలు చెప్పాలని గంజాయి మాదక ద్రవ్యాలు కారణంగా జరిగే అనర్థాలు నష్టాలపై వివరించాలని పిలుపునిచ్చారు. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేదని కృంగిపోకుండా ఆలోచించి, సాధించాలని మీపై కుటుంబ ఆధారపడి ఉంటుందని ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. మన చదువు సమాజానికి ఉపయోగపడే విధంగా ఉండాలని తద్వారా తల్లిదండ్రులు సంతోషిస్తారని చెప్పారు. లక్ష్యాలను సాధించడానికి నిరంతరం కృషి చేయాలని బాల్య వివాహాల కారణంగా జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రాజాంనాయుడు, సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

**అడ్డతీగల ఫిబ్రవరి 6,ప్రభాతవార్త**



రోడ్డు ప్రమాదాలపై సైబర్ నేరాల నివారణపై అడ్డతీగల మండలం దబ్బపాలెం గ్రామంలో శుక్రవారం నాడు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ నరసింహుమూర్తి. దుచ్చర్తి ఎస్సై పార్థసారధి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలపై వాహనదారులు అవగాహన అలవర్చుకొని ప్రమాదాల నివారణకై తోడ్పాటు నివ్వాలని అదేవిధంగా సైబర్ నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. అవగాహనతోనే ఎటువంటి విషయాన్ని అయినా నిర్మూలించగలమని ఆయన చెప్పారు. ముఖ్యంగా వాహనం నడిపే వాహన చోదకులు హెల్మెట్ వినియోగంతో పాటు మద్యం సేవించి వాహనాలు నడపరాదని ఆయన చెప్పారు. కార్యక్రమంలో గ్రామస్తులు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వినతుల పరిష్కారం వేగవంతం చేయాలి

**- సమస్యల పరిష్కారానికి అధికారుల చొరవ చూపించండి పిజిఆర్ఎస్ కు 137 అర్జీలు: జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్**

**పాడేరు,ఫిబ్రవరి6, ప్రభాతవార్త**



పాడేరు సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థకు 137 వినతులు వచ్చాయి. జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్, ట్రైనీ ఇండియన్ ఫారెస్ట్ ఆఫీసర్ చిదానందం, ఇంచార్జ్ జిల్లా రెవెన్యూ అధికారి అంబేద్కర్, పాడేరు ఇంచార్జ్ ఆర్డివో ఎమ్ వివిఎస్. లోకేశ్వరరావు, సంయుక్తంగా వివిధ మండలాల, గ్రామాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులు స్వీకరించారు. అర్జీ దారుల నుండి స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత శాఖ అధికారులకు అందించి త్వరితగతన పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ సంబంధిత భూ సమస్యలను తక్షణమే పరిష్కరించుటకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నందు ప్రత్యేకంగా రెవెన్యూ క్లినిక్ ని నిర్వహించడం జరుగుతుందని మండల రెవెన్యూ అధికారులు, డిప్యూటీ తాసిల్దారులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు,సర్వేయర్లు,విలేజి రెవెన్యూ ఆఫీసర్లు సంబంధిత సిబ్బంది అందుబాటులో ఉంటారని, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా ఫిర్యాదులను స్వీకరించడం, పరిష్కరించడం జరుగుతుందని కొన్ని రకాల ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించడం, పరిష్కరం కానీ ఫిర్యాదులను ఎంత గడువులోగా పరిష్కరిస్తారో తెలియజేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్వీకరించిన ఫిర్యాదులు కొన్ని అరకు మండలం, రవ్వల గూడెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు హరి బారికి చందు, జాన్ కుమార్, శోభ. సూర్య కిరణ్, కె. స్వప్న, బి. శ్వేత, శిథిలావస్థలో ఉన్న కళాశాల భవనములో తరగతులు నిర్వహించుకోవడానికి ఇబ్బంది పడుతున్నామని, ఆ భవన సముదాయంలో కొత్త భవనం నిర్మించాలని విన్నవించారు. పెదబయలు మండలం, గంపరాయి పంచాయతీ, జీడిపుట్టు గ్రామానికి చెందిన ఎస్. ఉదయ్ కిరణ్ జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామంలో మంచినీటి ట్యాంకు నిర్మించాలని, త్రాగునీరు సౌకర్యం కల్పించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్ బి ఎస్ నంద్, డిఆర్డిఎ పిడి వి మురళీ, జిల్లా భూగర్భ జల డిప్యూటీ డైరెక్టర్ డి. శ్రీనివాస్, జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి మోహన్, కాఫీ బోర్డ్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎల్.బొంజి బాబు, జిల్లా గ్రామీణ. నీటి సరఫరా మరియు పారిశుద్ధ్య శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.వి.వి. నాగేశ్వరరావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఆర్.వి. రమణా రావు, గ్రామ వార్డ్ సచివాలయ నోడల్ ఆఫీసర్ పి ఎస్ కుమార్, డిపివో కె.పి. చంద్ర శేఖర్, జిల్లా ఖజానా శాఖాధికారి ప్రసాద్ బాబు , డివిజనల్ డెవలప్మెంట్ అధికారి ఎ .జయప్రకాష్, జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ సిబ్బంది, జిల్లా ప్రణాళిక సిబ్బంది, పలువురు తాహాసిల్దార్లు తదితరులు ఉన్నారు.

## కేంద్ర బడ్జెట్ లో ఆదివాసీలకు తీవ్ర అన్యాయం

**సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాధం..**

**పాడేరు,ఫిబ్రవరి6, ప్రభాతవార్త:**



కేంద్ర ప్రభుత్వం 2026 సంవత్సర బడ్జెట్ కేటాయింపులు 53 లక్షల కోట్లు పైగా కేటాయింపులో ఆదివాసులకు 8.8 శాతం జనాభ ప్రాతిపదికన4 లక్షల 60 వేల కోట్లకు పైగా నిధులు కేటాయించాల్సి ఉండగా కేవలం కేంద్రం కేటాయించిందని పాడేరులో జరిగిన పార్టీ ప్లీనం సమావేశం లో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు కె. లోకనాధం విమర్శించారు.. బడ్జెట్ కేటాయింపులో (పివిటిజి) లకు పీఎం జన్మన్ యోజనకు 24 వేల కోట్లు రూపాయలు కేటాయింపులు చేసినట్లు చెప్పిన నిధులు లేక నిర్మాణంలో ఉన్న వేలాది ఇళ్ళలకు నిధులు లేక మధ్యలో నిలిచిపోయిందన్నారు. పీఎం జన్మన్ ఇళ్ళు నిర్మాణం యూనిట్ ఖరీదు నిర్మాణానికి కేటాయిస్తున్న 2 లక్షల 39 వేల రూపాయలు ఇళ్ళు నిర్మాణనికి నిధులు చాలక వేలాది నిర్మించిన ఇళ్లలు మధ్యలో నిలిచిపోయిందన్నారు. పీఎం జన్మన్ ఇండ్లు నిర్మాణానికి యూనిట్ ఖరీదు 10 లక్షలు రూపాయలు నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. గిరిజనయూనివర్సిటీ నిర్మాణానికి 800 కోట్లు రూపాయలు ఇవ్వాల్సి ఉండగా నిధులు లేక అతీ గతిలేక తాత్కాలిక భవనంలో యూనివర్సిటీ నడుస్తున్న పరిస్థితి ఉందన్నారు.. తక్షణమే నిధులు కేటాయించి యూనివర్సిటీ నిర్మాణం పూర్తి చేయాలన్నారు. ఎస్సీ ఎస్టీ బ్యాగ్ లాగ్ పోస్టుల భర్తీ పై బడ్జెట్ కేటాయింపులో ఎటువంటి ప్రస్తావన లేదు. ఏజెన్సీ ప్రాంతాల్లో టూరిజం, మైనింగ్ కోసం ఘనంగా ప్రాధాన్యత ఉందని ప్రకటన వెనుక ఏజెన్సీలో అపారమైన సహజవనరులు,అడవులు, భూములు కార్పొరేట్ సంస్థలకు అమ్మకానికి ముమ్మరం చేసినట్లు కనిపిస్తుందన్నారు.. గ్రామీణ కూలీలకు మోడీ ప్రభుత్వం చేస్తున్న ద్రోహాన్ని పక్కదారి పట్టించేందుకు ఈ పథకంలో మహాత్మా గాంధీ పేరును తొలగించారు. పనిదినాలు 100 నుండి 125 రోజులకు పెంచనున్నట్లు చెప్పడం ప్రజలను మభ్యపెట్టేందుకేనని, ఉపాధి హామీ పథకం అమలులో కీలకమైన రాష్ట్రాల భాగస్వామ్యం కొత్త బిల్లు వల్ల నామమాత్రంగా మారుతుందని పేర్కొన్నారు. అరకు ఎన్నికల సభలో చంద్రబాబు నాయుడు జి. ఓ నెంబర్ 3 ని పునరుద్దరిస్తామని నేటికీ ఆ హామీని ప్రభుత్వం అమలు చేయకపోవడం దారుణం.. ఇది ఆదివాసీలను మోసం చేయడమే.. ఆదివాసీలకు 100 ఉద్యోగ రిజర్వేషన్ పునరుద్ధరించాలి.. బెర్రీ బోర్రర్ సోకిన కాఫీ రైతులకు నష్టపరిహారం చెల్లించాలి.. గిరిజనులు పండిస్తున్న అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు కల్పించాలని డిమాండ్ చేశారు.. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కిల్లో సురేంద్ర, సీపీఎం జిల్లా కార్యదర్శి పి. అప్పలనరస, జిల్లా నాయకులు దీసరి గంగరాజు, వి. ఉమామహేశ్వరావు, పోతురాజు, చిన్నయ్య పడల్, త్రినాధ్, పాలికి లక్కు అన్ని మండలాల నుండి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

## అధిక ధరకు అమ్ముతున్న మద్యం దుకాణాలు..

**- క్వార్టర్ పై రూ.20 అదనం..గవర్నమెంట్ కి 10 రూపాయలు, సిండికేట్కి 10 రూపాయలు అంటున్న మద్యం షాపుల వ్యాపారస్తులు**

**గూడెం కొత్త వీధి ఫిబ్రవరి 6 (ప్రభాతవార్త)**



గూడెం కొత్త వీధి మరియు చింతపల్లి మండలాలలో మద్యం దుకాణాలు నిర్వహిస్తున్న దుకాణదారులు సంక్రాంతి నుండి నేటి వరకు అధిక ధరలకు విక్రయిస్తున్న అధికారులు సోద్యం చూస్తున్నారని సి.పి.ఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంకిపాటి సత్తిబాబు, వంతల టిష్ బాబులు మండిపడ్డారు. దుకాణాలలో క్వార్టర్ ఫుల్ బాటిల్ పై ఎమ్మార్పీ రేట్ల కన్నా 20 నుంచి 60 రూపాయలు ఒక్కొక్క బాటిల్ పై వసూలు చేస్తున్నారని వెంటనే మద్యం ధరలపై సంబంధిత అధికారులు విచారణ చేపట్టి దుకాణదారులపై చర్యలు తీసుకోవాలని,వైన్ షాప్ దుకాణదారులకు అధిక ధరలకు ఎందుకు విక్రయిస్తున్నారని అడిగితే దురుసు ప్రవర్తన తో పాటు ప్రభుత్వం ఇచ్చిన రేట్లకే ఇస్తున్నామని ఎగతాళిగా మాట్లాడుతున్నారని వారన్నారు. గవర్నమెంట్ కు 10 రూపాయలు, సిండికేట్ కి 10 రూపాయలు ఇవ్వాలి కనుక అధికంగా వసూలు చేస్తున్నామని వైన్ షాపు వ్యాపారస్తులు చెప్తున్నారు. ఇదిలా ఉండగా గ్రామాల్లో బెల్ట్ షాపులు విచ్చలవిడిగా నిర్వహిస్తున్నారని వాటిలో కూడాను 100 నుంచి 150 పైగానే అమ్ముతున్నారని అయినా అధికారులు చూసి చూడనట్టుగా ఉండటం బాధాకరమని తెలిపారు. అధికారులు దృష్టి సారించి మద్యం దుకాణాలు గ్రామాలలో బెల్ట్ షాపులపై సోదాలు నిర్వహించి ఎమ్మార్పీ రేట్లకే దుకాణాలలో అమ్మాలంటూ వారు డిమాండ్ చేసారు.

## డౌనూరు డిఆర్ డిపో పరిధికి గోపవరం

**కొయ్యూరు, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త**



తమకు ప్రస్తుతం నిత్యవసర సరుకులు అందిస్తున్న చిట్టింపాడు డిఆర్ డిపో తమకు సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్నందున, తమ గ్రామానికి దగ్గరలో ఉన్న డౌనూరు డిఆర్ డిపో పరిధిలోనికి తమ గ్రామాన్ని మార్చాలని మండలంలోని చిట్టెంపాడు పంచాయతీ, గోపవరం గ్రామ విని యోగదారులు తహసిల్దార్ మురళి బాబుకు వినతినందించారు. అయితే ఈ విషయమై వెంటనే స్పందించిన తహసిల్దార్ మురళి బాబు గోపవరం గ్రామాన్ని డవునోరు డిఆర్ డిపో పరిధిలోనికి తేవడానికి చర్యలు చేపట్టినట్లు గ్రామస్తులు హర్ష చేశారు. తమ సమస్యను విన్న వెంటనే స్పందించిన తాసిల్దార్ కు గోపవరం గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## రహదారుల సమస్య పరిష్కారంకోసం మరో ఉద్యమం

**రాజవొమ్మంగి, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త**



రాజవొమ్మంగి మండలంలో రహదారుల సమస్య పరిష్కరించాలని మరోసారి ఉద్యమం చేపట్టనున్నట్లు సీపీఎం పోలవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ అన్నారు. శుక్రవారం దుర్గానగర్ గ్రామంలో సీపీఎం ముఖ్య నేతలు సమావేశం పార్టీ మండల కమిటీ సభ్యులు జర్తా రాజు అధ్యక్షత జరిగింది. ఈ సమావేశానికి హాజరైన పార్టీ జిల్లా కార్యదర్శి కిరణ్ మాట్లాడుతూ గతంలో రహదారులు నిర్మించాలంటూ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు ఆధ్వర్యంలో గిరిజనులు స్థానిక ఎంపీడీవో కార్యాలయం ముట్టడించిన నేపథ్యంలో ఆయా గ్రామాల గిరిజనులతో చర్చలు జరిపి సమస్య పరిష్కారం అయ్యేలా కృషి చేస్తామని గిరిజన సంక్షేమశాఖ ఉన్నతాధికారులు హామీయిచ్చారు. రాజవొమ్మంగి నుండి బూరుగుపల్లి వెళ్లే 6 కిలోమీటర్ల రహదారి రూ 2.5 కోట్లతో బీటీ రహదారి,అమ్మిరేకుల నుండి కిమ్మలిగడ్డ 5.5 కిలోమీటర్ల రహదారి రూ3.5కోట్లతో, డి మల్లవరం కిలోమీటర్ రహదారికి రూ1 కోటి బిటి రహదారి,కింద్ర నుండి ముంజవరప్పాడు పాడు వెళ్లే 3.5 కిలోమీటర్ల రహదారి 4 కోట్లతో బీటీ రహదారి, లోదొడ్డి నుండి పాకవెల్లి వెళ్లే రెండు కిలోమీటర్ల రహదారి రూ1 కోటి తో బీటి రహదారి నిర్మాణం చేపట్టనున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ ఈఈ ఐ శ్రీనివాస్ వెల్లడించారని తెలిపారు. వీటిని డిసెంబర్ 2025 నాటికి పూర్తిచేసేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చినప్పటికీ వాటిలో మంజువరప్పాడు రహదారి ఒకటే పూర్తి అయిందని తెలిపారు. నేటికీ రహదార్ల హామీ అమలు కాలేదన్నారు. ఈ నేపథ్యంలో పోరాటమే శరణ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘ రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, మండల కార్యదర్శి కొండ్ల సూరి బాబు. మండల నాయకులు టి శ్రీను,పి రామరాజు, పి రాంబాబు, పి పాపారావు పాల్గొన్నారు.

## శ్రీ మొదకొండమ్మ ఆలయానికి భారీ అన్నదాన పాత్రల విరాళం

**పాడేరు,ఫిబ్రవరి6, ప్రభాతవార్త:**



పాడేరు ప్రాంత ఆరాధ్య దైవం శ్రీ శ్రీ శ్రీ మోదకొండమ్మ తల్లి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం నిర్వహించే నిత్య అన్నదాన కార్యక్రమానికి భారీ విరాళం అందించారు.. మాజీ జిల్లా చైర్మన్ మనవరాలు, సాయి లాడ్జి యజమాని పెరూరి రామకృష్ణ(అర్కె) సువర్ణ దంపతుల కుమార్తె వైష్ణవి, అన్నదాన వితరణ కోసం రెండు భారీ అన్నం వండే అండలను (పాత్రలను) ఆలయ కమిటీకి అందజేశారు.వీటిలో ఒకటి 60 కేజీల సామర్థం, మరొకటి 30 కేజీల సామర్థం కలిగిన పాత్రలు ఉన్నాయి. ఈ విరాళం అందజేత కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని వైష్ణవి సేవా గుణాన్ని అభినందించారు.అమ్మవారి క్షేత్రానికి వచ్చే భక్తులకు అన్నప్రసాద వితరణలో ఈ పాత్రలు ఎంతో ఉపయోగపడతాయని ఆలయ కమిటీ ప్రతినిధులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాడేరు మాజీ సర్పంచ్ పిన్నయ్య దొర,ఉప సర్పంచ్ బూరెడ్డి రాము, సర్వేయర్ భీమన్న దొర, చల్లా రామకృష్ణ, కొణతాల సతీష్, మాజీ ఎంపిటిసి చంద్రమోహన్,కిల్లు రాధాకృష్ణ, సత్తిబాబు, ప్రకాష్,రత్నాబాయి,రవణమ్మ, సత్యనారాయణ ,ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## స్పందించిన అధికారులు: పాపంపేట ఎల్లవరం రహదారికి మోక్షం

**అడ్డతీగల, ఫిబ్రవరి 06, ప్రభాతవార్త**



అడ్డతీగల మండల పరిధిలోని పాపంపేట మరియు ఎల్లవరం గ్రామాల మధ్య అధ్వాన్నంగా మారిన తారు రోడ్డుకు ఎట్టకేలకు మరమ్మత్తులు ప్రారంభమయ్యాయి. గత కొంతకాలంగా ఈ రహదారి గుంతలమయంగా మారి ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం విదితమే. ఈ రోడ్డు దుస్థితిపై గత నెల 29వ తేదీన ప్రముఖ వార్తా పత్రికలో వెలువడిన కథనం అధికారుల్లో కదలిక తెచ్చింది. అధ్వానంగా మారిన పాపంపేట ఎల్లవరం ప్రధాన రహదారి ప్రమాదాలు అంచున వాహనదారులు అనే శీర్షికతో ప్రచురితమైన వార్తకు స్పందించిన సంబంధిత శాఖ అధికారులు, తక్షణమే నిధులు మంజూరు చేసి రోడ్డు పునరుద్ధరణ పనులకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం ఈ మార్గంలో పెద్ద పెద్ద గుంతలను పూడ్చి, తారు పనులు (ప్యాచ్ వర్క్) చేపట్టారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. రహదారి సమస్య పరిష్కారం కావడంపై పాపంపేట మరియు ఎల్లవరం గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు బాగుపడటంతో అత్యవసర సమయాల్లో ఆసుపత్రులకు వెళ్లడానికి, పాఠశాల విద్యార్థులకు రవాణా ఇబ్బందులు తొలగిపోయాయి అని ప్రజా సమస్యను వెలుగులోకి తెచ్చిన వార్తా పత్రికా యాజమాన్యానికి మరియు వేగంగా స్పందించిన అధికారులకు గ్రామ పెద్దలు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. పనులు పూర్తయిన తర్వాత కూడా రోడ్డు నిర్వహణపై అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

## మంచినీటి కొళాయిలను ప్రారంభించిన సర్పంచ్

**గూడెం కొత్తవీధి ఫిబ్రవరి 6 (ప్రభాతవార్త)**



గూడెం కొత్తవీధి మండలం, వంచుల పంచాయతీలోని నడివీధి గ్రామంలో స్థానిక సర్పంచ్ వనపల కాసులమ్మ చేతుల మీదుగా మంచినీటి కొళాయిలను ప్రారంభించారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని ప్రజలు ఎటువంటి ఇబ్బంది పడ కుండా ఉండేందుకు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా మంచినీటి కుళాయిలు ప్రారంభించడం జరిగిందని ఈ సందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యురాలు కృష్ణ వేణి నాయకులు వనపల రాజేష్, పోత్తూరు గంగరాజు,లొంజా గణపతి,భగవాన్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## నియమాలు పాటించని వాహనదారులకు కౌన్సిలింగ్

**గూడెం కొత్తవీధి ఫిబ్రవరి 6 (ప్రభాతవార్త)**



మండలంలోని పెదవలస,రింతాడ తదితర ప్రాంతాలలో పోలీసులు ప్రత్యేక వాహన తనికులను నిర్వహించారు.దీనిలో బాగంగా వాహనదారులకు లైసెన్సులు,ఇన్సూరెన్సులు, ఆర్.సి మరియు పొల్యూషన్, హెల్మెట్ తప్పనిసరిగా వాహనదారులు కలిగి ఉండాలని గూడెం కొత్త వీధి సీఐ సుధాకర్, ఎస్సై కే సురేష్ కోరారు.వాహనాలు తనిఖీ చేస్తున్నప్పుడు సంబంధించిన పత్రాలు తప్పనిసరిగా ఉండాలని లేని పక్షాన వారిపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ముఖ్యంగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని,మద్యం సేవించి వాహనాలను నడపరాదని, ఒకవేళ నడిపి ప్రమాదానికి గురైతే ప్రభుత్వ ఇన్సూరెన్స్ లు పొందలేకపోవడంతో పాటు మీ కుటుంబానికి ఎటువంటి భరోసా లేకుండా ఉంటుందని నియమ నిబంధనలు పాటించ కుండా రాష్ డ్రైవింగ్ కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గూడెం కొత్తవీధి సీ.ఐ సుధాకర్, ఎస్.ఐ సురేష్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అమ్మవారి ఆలయంలో భక్తులకు అన్న సమరాధన

**పాడేరు,ఫిబ్రవరి6, ప్రభాతవార్త**



పాడేరు గిరిజన ఆరాధ్య దైవం శ్రీ శ్రీ మోదకొండమ్మ వారి ఆలయంలో పాడేరు ఎమ్మెల్యే , ఆలయ కమిటీ చైర్మన్ మధ్యరాస విశ్వేశ్వర రాజు ఆదేశాల మేరకు ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సమరాధన కార్యక్రమం నిర్వహింకారు. ఈ కార్యక్రమానికి మాజీ జెడ్పిటిసి రొబ్బ ఉషారాణి, ఆలయ కమిటీ సభ్యులు చల్లా రామకృష్ణ, కిల్లు రాధాకృష్ణ్ననాయుడు, వరలక్ష్మి దంపతులు కిల్లు చంద్రమోహన్ కుమార్, కొణతాల సతీష్, గబలంగి శంకర్రావు,లకే రత్నబయ్, గూడెపు సూర్య ప్రకాష్, పలాసి రమణమ్మ, కూర రాము,గుమస్తా సత్యనారాయణ పాల్గొన్నారు.

## నూతన సూపరింటెన్డెంట్ను కలిసిన డిప్యూటీ సూపరింటెన్డెంట్

**పాడేరు,ఫిబ్రవరి6, ప్రభాతవార్త:**



పాడేరు జిల్లా ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ సూపరింటెన్డెంట్ గా డాక్టర్ కొలిపాకుల శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టిన సందర్భంగా జిల్లా ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెన్డెంట్ డాక్టర్ తమర్బ నరసింగరావు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా సూపరింటెన్డెంట్ గా డాక్టర్ శ్రీనివాసరావు కు పూల గుచ్చాన్ని అందజేసి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ong-8_ong-8.qxd 2/7/2026 12:03 AM Page 1



## శివరాత్రి ఉత్సవ పోస్టర్ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

**చోడవరం, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:**



ఈ నెల 15వ తేదీన మహాశివరాత్రి ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో చోడవరం స్వయంభు గౌరీశ్వర స్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న శివరాత్రి ఉత్సవ పోస్టర్ను స్థానిక ఎమ్మెల్యే కె ఎస్ ఎన్ రాజు శుక్రవారం ఆవిష్కరించారు. ఈనెల 13 నుంచి 18వ తేదీ వరకు ఈ ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శివరాత్రి ఉత్సవాలను ప్రజలంతా జయప్రదం చేయాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. అతి పురాతనమైన ఈ శివాలయం ఎంతో ప్రాముఖ్యతతో కూడుకుందని శివరాత్రి ఉత్సవాలు ప్రతి ఏడాది ఘనంగా నిర్వహిస్తుంటామని,ఈ ఏడాది కూడా ఘనంగా నిర్వహిస్తామన్నారు. కాబట్టి భక్తులందరూ ఈ ఉత్సవాలు జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఆలయానికి గునూరు సురేష్ చైర్మన్గా, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎస్ వి వి సత్యనారాయణమూర్తి, ప్రధాన అర్చకులు కొడమంచిలి చలపతి వ్యవహరిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే గౌరవ అధ్యక్షులుగా ఉంటూ కమిటీగా చేదోడు వాదోడుగా సహకార అందిస్తుంటారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాలలో ముగిసిన జిల్లా స్థాయి ఆటలు పోటీలు

**చోడవరం, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త**



స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 5 6 తేదీల్లో నిర్వహించిన జిల్లా స్థాయి స్పోర్ట్స్, గేమ్స్ పోటీలు శుక్రవారం సాయంత్రం తో ముగిశాయి.తొలి రోజు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి కిరణ్ కుమార్ జిల్లా స్థాయి బాలికల కబడ్డీ, 100 మీటర్ల రన్నింగ్ పోటీలను ప్రారంభించారు.బాలికల కబడ్డీ పోటీలలో మొదటి స్థానం ప్రభుత్వ డిగ్రీ కళాశాల చోడవరం, ద్వితీయ స్థానం ఉషోదయ డిగ్రీ కళాశాల,100మీటర్ల పరుగు పందెంలో మొదటి,ద్వితీయ,తృతీయ స్థానాలను ప్రభుత్వ డిగ్రీ కళాశాల గెలుపొందినది. రెండవ రోజు బాలురులకు జరిగిన ఈ పోటీలలో జిల్లా వ్యాప్తంగా ఆరు క్రికెట్, వాలీబాల్ జట్లు పోటీలలో పాల్గొన్నాయి. పోటీలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి కిరణ్ కుమార్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాస్థాయి గేమ్స్ అండ్ స్పోర్ట్స్ పోటీలు నిర్వహించడం మంచి శుభదాయకమని,ఈ పోటీలలో ఉత్సాహంగా పాల్గొని బహుమతులు పొందవలసిందిగా విద్యార్థులను ఆశీర్వదించారు. విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. స్పోర్ట్స్ అండ్ గేమ్స్ కోఆర్డినేటర్, కమిటీ సభ్యులు డాక్టర్ మల్లిబాబు, వెంకటేష్ ఆధ్వర్యంలో ఇతర కమిటీ సభ్యులు ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించారు. వాలీబాల్ పోటీలలో ఉషోదయ డిగ్రీ కళాశాల విన్నర్ గాను, ప్రభుత్వ డిగ్రీ కళాశాల రన్నర్ గా విజయం సాధించారు.100 మీటర్ల పరుగు పందెంలో ఉషోదయ కళాశాల మొదటి స్థానము, ద్వితీయ స్థానము గవర్నమెంట్ డిగ్రీ కళాశాల, తృతీయ స్థానము ఉషోదయ డిగ్రీ కళాశాల, విజయం సాధించారు.వైస్ ప్రిన్సిపాల్ సత్యవతి, జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డి.మాల్యాద్రి,బి.పిచ్చమ్మ,కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## కంబాల,శోభ,పైలాలను సత్కరించిన వైకాపా అనుబంధ సంఘాల నాయకులు

**( ఎస్. రాయవరం ,ప్రభాతవార్త)**



వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పాయకరావుపేట నియోజకవర్గం పరిధిలో నక్కపల్లి మండలం నుంచి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ నాయకత్వంలో నియమితులైన పలు అనుబంధం సంఘాల నాయకులు మండలంలోని అడ్డరోడ్డు కేంద్రంగా శుక్రవారం జరిగిన సమావేశం అనంతరం మాజీ ఎమ్మెల్యే ,నియోజకవర్గ పరిశీలకులు కంబాల జోగులు, జిల్లా పరిశీలకులు, మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, నియోజవర్గ పరిశీలకులు పైల శ్రీనివాస్ లను ఘనంగా సత్కరించారు. సత్కరించిన వారిలో జడ్పిటిసి గోశల కాసులమ్మ , మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు అయినంపూడి మణి రాజు, మండల పరిషత్ అదనపు ఉపాధ్యక్షులు వెలగా ఈశ్వరరావు, జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి పొడగట్ల పాపారావు, పాయకరావుపేట నియోజకవర్గం ఎస్సీ సెల్ కన్వీనర్ కాకర వెంకట్రావు , జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గొర్ల గోవిందు, వాణిజ్య విభాగం నియోజకవర్గ కన్వీనర్ ఎల్లేటి సత్యనారాయణ, విద్యార్థి విభాగం నియోజకవర్గం కన్వీనర్ ఎలమంచిలి చందు, సర్పంచులు తల్లా భార్గవ్, సాదిరెడ్డి శ్రీను, మాజీ ఎంపీటీసీ పిక్కి తాతయ్యలు తదితరులు ఉన్నారు.

## స్లాబ్ పెచ్చులు పడి ఉద్యోగి మృతి.. ఒకనికి తీవ్ర గాయాలు.!

**(నక్కపల్లి రూరల్, ప్రభాతవార్త)**



మండలంలోని రాజయ్యపేట సమీపంలో ఉన్న హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్, యూనిట్-3 భవనంలో ఉన్న ఒక కార్యాలయ గదిలో ఒక లేయర్ స్లాబ్ శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో కూలి పడిన సంఘటనలో ఒక ఉద్యోగి మృతి చెంది, మరో ఉద్యోగి గాయపడిన సంఘటన శుక్రవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. మధ్యాహ్నం విధుల్లో ఉంటున్న సమయంలో ఈ సంఘటన చోటుచేసుకుంది.! ఈ ఘటనలో నర్సీపట్నం మండలం చెట్టుపల్లి కి చెందిన మేనేజర్ బి. చిరంజీవి (39 ), సహాయం మేనేజర్ గా ఉన్న గుంటూరుకు చెందిన షేక్ మస్తాన్ లు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని విశాఖపట్నం కేజీహెచ్ తరలించగా చిరంజీవి మృతి చెందాడు. స్వల్ప గాయాలతో బయటపడిన షేక్ మస్తాన్ ప్రస్తుతం విశాఖపట్నం అరిలోవలో ఉన్న అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతుని బంధువుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు నక్కపల్లి సిఐ జూరెడ్డి మురళి తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని సంఘటన జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. కంపెనీ కి సంబంధించిన ఉద్యోగులతో జరిగిన పరిస్థితులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సిఐ మురళి తెలిపారు.

## జాబ్ మేళాలో 56 మంది గిరిజన అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపిక

**అరకు రూరల్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త**



అరకు లోయ ప్రభుత్వ ఆర్ ఐ టి ఐ నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఏపీ ఎస్ ఎస్ డి సి, ఆర్ ఐ టి ఐ కాలేజ్ జాబ్ మేళా నిర్వహించడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి అధికారి.పి రోహిణి, మరియు ఉమా శంకర్ గవర్నమెంట్ ఆర్ ఐ టి ఐ కాలేజ్ ప్రిన్సిపల్ మాట్లాడుతూ, చదువుకున్న నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించటమే ప్రభుత్వం లక్ష్యమని తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు నైపుణ్యాలను అభివృద్ధి పరచుకోవాలని తెలిపారు. ఈ జాబ్ మేళ కి 137 మంది అభ్యర్థులు అటెండ్ అయ్యారు, వీరిలో పలు కంపెనీలకు 56,మంది ఉద్యోగాల కు ఎంపికయ్యారు. ఈ జాబ్ మేళా లో అపోలో ఫార్మసీ, నవత ట్రాన్స్పోర్ట్, వరుణ్ మోటార్స్, కోరమండల్ ఫెస్టిలైజేషన్ ఇలా ప్రముఖ కంపనీలు పాల్గొంఉన్నాయి. ఇంటర్వ్యూ లో ఎంపిక కాబడిన అభ్యర్థులకు నెలకు జీతం 12000 నుండి 23,000 వరకు ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. ఈ యొక్క జాబ్ మేళాలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నవారు. గవర్నమెంట్ ఆర్ ఐ టి ఐ కాలేజ్ ప్రిన్సిపల్ ఉమా శంకర్ ,మనోరమ్మ ,ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ , పి రోహిణి జిల్లా నైపుణ్యభివృద్ధి అధికారి, ఏపీ ఎస్ ఎస్ డి సి పాల్గొన్నారు.

## అసంక్రమిక వ్యాధులపై సర్వే.. ఫ్రై డే.. డ్రై డే కార్యక్రమం

**రాజవొమ్మంగి, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త**



జడ్డంగి గ్రామంలో శనివారం పి. హెచ్. సి డా. పావని ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది అసంక్రమిక వ్యాధులపై సర్వే చేశారు. ప్రతీ ఇంటి వద్ద వ్యక్తులు వివరాలుతో బాటు అసంక్రమిక వ్యాదులు అయిన బి. పి, షుగర్, కేన్సర్, గుండె జబ్బుల సమస్యలు ఉంటే వైద్య సిబ్బంది నమోదు చేయడం జరిగింది. ఫ్రై డే, డ్రై డే లో భాగంగా పరిసరాలు పరిశుభ్రత, దోమలు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహనను హెచ్ వి. నీలాద్రి లక్ష్మీ కల్పించారు. డా. పావని ఆదేశాలతో అన్ని గ్రామాల్లో ఫ్రై డే, డ్రై డే కార్యక్రమాలను వైద్య సిబ్బంది నిర్వహించారు. ఈకార్యక్రమంలో డా. పావని, హెచ్.వి. నీలాద్రి లక్ష్మీ, హెల్త్ అసిస్టెంట్ సింగిరెడ్డి పద్దరాజు, ఏ. ఎన్. యం లు దాసరి మంగరాజు ( మంజు ), కొరకూటి లక్ష్మీ, ఆశ గొర్లె వసంతకుమారి పాల్గొన్నారు.

## మోహన్‌బాబు యూనివార్సిటీ గుర్తింపును తక్షణమే రద్దు చేయాలి

**పాడేరు,ఫిబ్రవరి6, ప్రభాతవార్త:**



మోహన్ బాబు యూనివర్సిటీలో జరుగుతున్న అక్రమాలను అరికట్టాలని, ఆ యూనివర్సిటీ గుర్తింపును రద్దు చేయాలనీ, విద్యార్థులను కిడ్నప్ చేయించిన మంచు మోహన్ బాబు, విష్ణు లపై క్రిమినల్ కేసులు పెట్టి శిక్ష పడే విధంగా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని, అధిక ఫీజులు అరికట్టి విద్యార్థులకు న్యాయం చేయాలనీరాష్ట్ర సమితి పిలుపులో భాగంగా శుక్రవారం అల్లూరి సీతారామరాజు జిల్లా ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున 500 మంది విద్యార్థులు డిగ్రీ కాలేజ్ నుండి ఐటీడీఏ గేట్ వరకు ర్యాలీ, ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. రాజశేఖర్ అధ్యక్షులు వి.కృష్ణ ,ఎస్ఎఫ్ఐ జిల్లాఅధ్యక్ష,కార్యదర్శులు పి.జీవన్, కృష్ణ, కార్తీక్ లు మీడియా తో మాట్లాడుతూ యూనివర్సిటీ లో చదువుతున్నటువంటి విద్యార్థుల దగ్గర 26.17 కోట్ల రూపాయలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని తిరుపతి లో ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ రెండు సంవత్సరాల నుండి పోరాటాలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం క్రమంలో ఏఐఎస్ఎఫ్, ఎస్ ఎస్ ఐ నాయకులు చిన్నరావు, తదితరులు పాల్గొన్నారు.

## జడ్డంగిలో మహాశివరాత్రి ఏర్పాట్లును సి.ఐ. పరిశీలన

**రాజవొమ్మంగి, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త**



మహాశివరాత్రి సందర్భంగా శతాబ్ద చరిత్ర గల శ్రీశ్రీశ్రీ భ్రమరాంభికా మల్లిఖార్జునస్వామి ఆలయం వద్ద జరుగుతున్న ఉత్సవ ఏర్పాట్లను శుక్రవారం సాయంత్రం రాజవొమ్మంగి పోలీస్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ గౌరీశంకర్ పరిశీలించారు. ఉత్సవ ఏర్పాట్లను కమిటీ వారు సి. ఐ. గౌరీశంకర్ కు వివరించారు. వాహనాలు నిలుపుదల చేసే స్థలాలు, స్నానఘట్టాలు, దర్శనానికి వెళ్లే ప్రాంతంలో క్యూలైన్, త్రాగునీరు, శానిటేషన్, రాత్రి వేళల్లో విద్యుత్ సౌకర్యం ఏర్పాట్లను కమిటీ తెలిపారు. అన్నసంతర్పణ జరిగే ప్రాంతాన్ని సి. ఐ.చూసారు. పంచాయతీ వారిచే త్రాగునీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ఊరేగింపు ఏర్పాట్ల సమయాన్ని తెలుసుకొన్నారు. దర్శనానికి వచ్చే రహదారి ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా వలంటీర్లను ఏర్పాటు చేయాలని కమిటీ వారికి సి. ఐ సూచించారు. నూతనంగా నిర్మించిన స్టేజీ, ఆలయం వద్ద నీటి పథకంను చూసారు. వృద్దులు, చిన్నపిల్లలు స్నానాలు కోసం జల్లు ఘట్టం ఉందని కమిటీ సభ్యులు సి. ఐ కు వివరించారు. ఈకార్యక్రమంలో సి. ఐ గౌరీశంకర్, హెడ్ కానిస్టేబుల్ లు సుబ్బారావు, రాజ్ కుమార్, కానిస్టేబుల్ దేవుడు, ఆలయకమిటీ పాల్గొన్నారు.

## గంజాయి లేని సమాజం కోసం ప్రజలు సహకరించాలి : సి.ఐ

**రాజవొమ్మంగి, ఫిబ్రవరి 06, ప్రభాతవార్త**




గంజాయి లేని సమాజం కోసం ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని రాజవొమ్మంగి పోలీస్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ గౌరీశంకర్ అన్నారు. శుక్రవారం గడుటకుర్తి పంచాయితీ గడుటకుర్తి, చీడి పాలెం, గొబ్బిలమడుగు గ్రామాల్లో పోలీస్ జనమైత్రి కార్యాక్రమాలు జరిగాయి. గొబ్బిలమడుగు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో సి. ఐ. గౌరీశంకర్ మాట్లాడుతూ గంజాయి సాగు, అమ్మడం, రవాణా, ప్రోత్సహించడం కూడా నేరమని అన్నారు. గంజాయి తో పట్టుబడితే జైలుకు వెళ్లడంతో బాటు కుటుంబానికి, గ్రామానికి చెడ్డపేరు అని వెల్లడించారు. జైలు జీవితం వల్ల కుటుంబం చిన్నాభిన్నం అవుతుందన్నారు. గంజాయి సమాచారాన్ని పోలీస్ టోల్ ఫ్రీ నెంబర్ 9381123100 కు ఫోన్ చేసి తెలుపవచ్చునని అన్నారు. సమాచారం చెప్పే వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. ఆన్ లైన్ అప్పులు చేసి ఎవరూ మోసపోవద్దన్నారు.కార్యక్రమంలో సి. ఐ. గౌరీశంకర్, హెడ్ కానిస్టేబుల్ లు సుబ్బారావు, రాజ్ కుమార్, కానిస్టేబుల్ లు దేవుడు, పెద్దబ్బాయి, సిబ్బంది పాల్గొన్నారు.

## హైవే కోసం భూమి ఇచ్చిన బాధితులకు నష్టపరిహారంలో జాప్యం

**హుకుంపేట, ప్రభాతవార్త:**



హుకుంపేట మండలం అడ్డుమండ పంచాయతీ సన్యాసమ్మ పాలెం గ్రామంలో హైవే విస్తరణ పనులు బాధితులకు నష్టపరిహారం చెల్లించకుండానిర్లక్ష్యం కొనసాగుతుంది. హైవే కోసం తమ భూమిని త్యాగం చేసినప్పటికీ ఇప్పటివరకు నష్టపరిహారం అందక పోవడంతో బాధిత రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో చాలామందికి నష్టపరిహారం అందించిన అధికారులు కేవలం ఆరుగురు బాధితులకు మాత్రమే పక్కన పెట్టడం పలు అనుమానాలకు భావిస్తుంది. కొంత భూమిని హైవే కోసం ఇచ్చిన మోరీ మణికుమార్, నిక్కుల పాపారావు, మోద శ్రీనివాసరావు ,తమరుబ కొండమ్మ తదితర రైతులు న్యాయం కోసం అధికారులు చుట్టూ తిరుగుతున్న సరైన సమాధానం దొరకడం లేదని వాపోతున్నారు. నష్టపరిహారం చెల్లించకుండా పనులు ఎలా చేపడుతారని బాధితులు ప్రశ్నిస్తే స్థానిక తాసిల్దార్ నుంచి స్పష్టమైన సమాధానం లేకపోవడం ఆగ్రహానికి దారి తీస్తుంది. బాధితులకు నష్టపరిహారం చెల్లించే బాధ్యతను తాసిల్దార్ తీసుకోకుండా ఇతర శాఖల పై నెట్టేస్తూ కాలయాపన చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. అధికారుల బలంతోనే హైవే పనులు సాగుతున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భూదానం చేసిన ప్రతి బాతుడికి వెంటనే నష్టపరిహారం చెల్లించాలని లేకపోతే ప్రజా సంఘాలతో కలిసి ఉద్యమాన్ని చేయవలసి ఉంటుందని హెచ్చరించారు. జిల్లా అధికారులు వెంటనే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## 8న ఏపీ పి ఆర్ మినిస్టీరియల్ ఉమ్మడి విశాఖ జిల్లా ఎన్నిక.!

**నక్కపల్లి, ప్రభాతవార్త**



ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగులు ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ఎన్నికలు ఈనెల 8 ఆదివారం ఉదయం జిల్లాపరిషత్ కార్యాలయం వద్ద జరుగుతాయని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సత్తిబాబు, దెందుకూరి సీతారామరాజు లు శుక్రవారం తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లా ఎన్నికలు అధికారి విజయనగరం జిల్లా అసోసియేషన్ అధ్యక్షలు మురళి ఆధ్వర్యంలో జరుగుతుందని చెప్పారు. ఇప్పటికే అన్ని తాలూకా యూనిట్లు ఎన్నికలు పూర్తయి అని పూర్తయిన ఎన్నికల కార్యవర్గాల నుండి ఎన్నికైన అధ్యక్షులు, కార్యదర్శులు, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఈ ఎన్నికల్లో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా కార్యవర్గం ను ఎన్నికొనే ఎన్నికలు ప్రశాంతంగా జరిగేటట్లు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు.

## ప్రజాసమస్యలపై వినతులు స్వీకరించిన కొణతాల

**అనకాపల్లి,పిబ్రవరి 6, ప్రభాతవార్త**



అనకాపల్లి జనసేన కార్యాలయంలో ప్రజా సమస్యల తెలుసుకొని వినతులను స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ శుక్రవారం స్వీకరించారు. అనకాపల్లిలోని జనసేన పార్టీ కార్యాలయంలో స్థానిక అనకాపల్లి నియోజకవర్గ ప్రజల నుండి వారి సమస్యలకు సంబంధించిన వినతి పత్రాలను స్వీకరించారు. సమస్యలను శ్రద్ధగా విన్న మాజీ మంత్రివర్యులు అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృ ష్ణ వారి సమస్యలపై సానుకూలంగా స్పందించి అతి త్వరలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా, ప్రజల సమస్యల పరిష్కారానికి జనసేన పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన తెలియజేశారు.

### ఆర్ వో బి స్థలాన్ని పరిశీలించి నఎమ్మెల్యే కొణతాల



అనకాపల్లి 83వ వార్డు లక్ష్మీదేవి పేట రైల్వే గెట్ వద్ద అతి త్వరలో నిర్మించబోవు ఆర్ఒబి కి స్థలాన్ని స్తానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణశుక్రవారం పరిశీలన చేశారు. ప్లాన్, పర్యవేక్షణ చేసి వివరాలు అడిగి తెలుసుకుని తగు సూచనలు చేశారు. పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఒ ఆయేషా, జీవీఎంసీ జోనల్ కమిషనర్ చక్రవర్తి వివిద శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘం మండల శాఖ ఎన్నిక ఏకగ్రీవం

**ముంచంగిపుట్టు ఫిబ్రవరి 6 (ప్రభాతవార్త)**



అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండల అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘం మండల శాఖ ఎన్నికలు స్థానిక ఆదివాసి విద్య ఫౌండేషన్ సమావేశ మందిరంలో శుక్రవారం ఏకగ్రీవంగా జరిగాయి.. ఈ ఎన్నికల్లో అధ్యక్షులుగా బాజంగి. బాబురావు, గౌరవ అధ్యక్షులుగా ఎస్ నీలాంబరం, ఉపాధ్యక్షులుగా వెంగడ. రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా రెయ్యల. రామకృష్ణారావు, కోశాధికారిగా గల్లెల. కామేశ్వరరావు,వి. బాలరాజు, కార్యదర్శులుగా యు. సీతారాం, ఎల్. దాసు, పద్మారావు, మహిళా అధ్యక్షురాలుగా వంతినిభ. నూకాలమ్మ, ఉపాధ్యక్షురాలుగా కె. రత్నకుమారి, కె. రాధా, మహిళా కార్యదర్శిగా భవాని, కార్యదర్శులుగా కే భార్గవి, ఎస్ దమయంతి, ఎల్ పద్మ, సంయుక్త కార్యదర్శులుగా బాజంగి. శ్రీనివాసరావు, సలహాదారులుగా కోడా. లక్ష్మి, కవేర్ల కృష్ణారావు, పూజారి. గోవిందు,సొలగం. మాలయ్య,సి హెచ్. రమేష్ కుమార్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సంఘం నాయకులు మాట్లాడుతూ గిరిజన ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని ఉద్యోగులకు వారు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మండల గిరిజన ఉద్యోగ సంఘం నాయకులను మండల ఉద్యోగులు జిల్లా నాయకులు దుస్సాలువాలతో ఘనంగా సన్మాన సత్కారాలను నిర్వహించారు.



## ప్రధాని నరేంద్రమోడీతోనే దేశ భవిష్యత్తు

**- మండల బిజెపి సమావేశం భారీగా చేరికలు**

**కొయ్యూరు, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త**



ప్రధాని మోడీ దేశాన్ని విశ్వ విజేతగా తీర్చి దిద్దుతుండటంతో ఆకర్షితులైన ప్రజానీకం భారీగా పార్టీలో చేరుతున్నట్లు బిజెపి జిల్లా అధ్యక్షురాలు శాంతకుమారి పేర్కొన్నారు.మండలంలోని కినపర్తి గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు శివకుమార్ అధ్యక్షతన బిజెపి మండల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ వార్డు సభ్యుడు సుర్ల మణికంఠ కోన మహేష్, సుర్ల మల్లేశ్వరరావు, నూకరాజు, దుర్గాప్రసాద్ తో పాటు పంచాయతీకి చెందిన సుమారు 70 మందికి పైబడి వైసిపి కార్యకర్తలు బిజెపి లో చేరారు. వారందరికీ అధ్యక్షురాలు శాంతకుమారి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ మహిళలకు అధిక ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షులు పాంగి రాజారావు మాట్లాడుతూ క్రమశిక్షణ, నిబద్ధత కలిగిన పార్టీ బిజెపి యేనన్నారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యదర్శి స్వప్న కుమారి, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు అబ్బాయి దొర, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి మత్స్య కొండబాబు, పాడేరు ఎఎంసి చైర్పర్సన్ మచ్చల మంగతల్లి, మహిళా మోర్చా నేత కేజియా రాణి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి అచ్యుత్, మండల ప్రధాన కార్యదర్శులు పద్మరాజు, సన్యాసిరావు, మాజీ మండలాధ్యక్షుడు ఎం. అప్పలరాజు, ధార్మిక సంస్థల సేవా ప్రతినిధి డివిడి ప్రసాద్, గూడెం మండల మాజీ అధ్యక్షుడు చిరంజీవి, ఆర్టిఐ జిల్లా నేత అర్జున్ రెడ్డి, ఎస్ ఎస్ ఎఫ్ మండల ప్రచారక్ శ్రీను, అన్నపూర్ణ, ఉష, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సైబర్ సెక్యూరిటీపై ఐదు రోజుల వర్క్‌షాప్ ముగింపు

**కొయ్యూరు ఫిబ్రవరి 6 ప్రభాతవార్త**



పీఎం-ఉషా పథకం లో భాగంగా, మర్రిపాలెం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినుల కోసం సైబర్ సెక్యూరిటీపై ఐదు రోజుల వర్క్‌షాప్ సోమవారం ప్రారంభమై, శుక్రవారం విజయవంతంగా ముగిసింది. ఈ వర్క్‌షాప్‌ను పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా. వి. చిట్టబ్బాయి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డా. కె. సుధ మాట్లాడుతూ నేటి డిజిటల్ యుగంలో సైబర్ సెక్యూరిటీపై అవగాహన ప్రతి విద్యార్థినికి అత్యంత అవసరమన్నారు. ఈ వర్క్‌షాప్‌ను విద్యార్థినులు సద్వినియోగం చేసుకొని నూతన సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలను అభివృద్ధి చేసుకున్నారని తెలిపారు. భవిష్యత్‌లో మెరుగైన ఉపాధి అవకాశాలను పొందేందుకు ఈ తరహా శిక్షణ కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని ఆమె పేర్కొన్నారు. ఈ వర్క్‌షాప్‌కు కోఆర్డినేటర్‌గా కామర్స్ లెక్చరర్ బోండ్ల శేఖర్ వ్యవహరించగా, కంప్యూటర్ ట్రైనర్ సుర శరత్ బాబు సైబర్ సెక్యూరిటీకి సంబంధించిన వివిధ అంశాలపై శిక్షణ అందించారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, డేటా భద్రత, సోషల్ మీడియా భద్రత, సైబర్ ప్రమాదాలు, వాటి నివారణ చర్యలపై విద్యార్థినులకు విస్తృత అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొని విద్యార్థినులను ప్రోత్సహించారు. ఐదు రోజుల పాటు నిర్వహించిన ఈ వర్క్‌షాప్ ద్వారా విద్యార్థినుల్లో సాంకేతిక నైపుణ్యాలు, డిజిటల్ భద్రతపై అవగాహన మరింత పెరిగిందని నిర్వాహకులు తెలిపారు.

## పీ.గొందూరు గ్రామంలో సి సి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

**పాడేరు,ఫిబ్రవరి6, ప్రభాతవార్త:**



పాడేరు మేజర్ పంచాయతీ సర్పంచ్ కొట్టగుల్లి ఉషారాణి అధ్యక్షతన పి.గొందూరు గ్రామంలో కొత్తగా నిర్మించిన శివాలయం రహదారి సౌకర్యార్థం రూ/1.9 లక్షల అంచనాలు వ్యయంతో 70 మీటర్ల సిసి రోడ్డు నిర్మాణానికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొట్టగుల్లి సుబ్బారావు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ వసంత, మాజీ వార్డ్ మెంబర్ వర్తనలింగమ్మ, ఆనంద్, లక్ష్మణ్ తెలుగు యువత బాకూరు మహేష్, వర్తన నాని, అమరావతి, నాయుడు,రామారావు గొందూరు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ పౌరునికి ఆభా గుర్తింపు కార్డు తప్పనిసరి

**పాడేరు,ఫిబ్రవరి6, ప్రభాతవార్త:**



డిజిటల్ హెల్త్ రికార్డులపై డీఎంహెచ్ఓ ఆదేశాలు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రతీ పౌరుడికి విధిగా 14 అంకెలతో కూడిన ప్రత్యేక హెల్త్ ఐడెంటి నంబర్ ను సృష్టించుకోని తమ ఆరోగ్య వివరాలను ఈ హెచ్ ఆర్ డిజిటలైజ్ చేసుకోవడం తప్పనిసరి అని అల్లూరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. డి కృష్ణమూర్తి నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం తన కార్యాలయ ఆవరణలో ఆయుష్మాన్ భారత్ డిజిటల్ హెల్త్ మిషన్ కార్యాక్రమ బ్యానర్ మరియు కరపత్రాల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నాయక్ మాట్లాడుతూ వైద్య సేవలను మరింత పారదర్శకంగా, వేగంగా అందించేందుకు ఈ ఇహెచ్అర్ ఎంతగానో దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. కార్యాక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.డి కృష్ణమూర్తి నాయక్, జిల్లా కార్యక్రమ పర్యవేక్షణ అధికారి(ఎన్.ఎచ్.ఏం) డా. ఎం కిరణ్ కుమార్, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాలలో రూ. 48 లక్షలుతో టాయిలెట్స్ మంజూరు..

**రాజవొమ్మంగి, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త**



రాజవొమ్మంగి ఏ. పి. గిరిజన సంక్షేమ గురుకుల బాలికోన్నత పాఠశాలకు రూ 48 లక్షలతో స్వచ్ఛ భారత్ మిషన్ లో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ మంజూరు అయినట్లు ఆర్. డబ్ల్యూ. ఎస్ డీఈ సూర శివ తెలిపారు. పాఠశాలలో జరుగుతున్న పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. టాయిలెట్స్, బాత్ రూమ్స్ తో ఈ కాంప్లెక్స్ లో 16 యూనిట్స్ ఉంటాయన్నారు. ఓవర్ హెడ్ ట్యాంకు ఏర్పాటు చేసి రన్నింగ్ వాటర్ ఇస్తామన్నారు. కాంప్లెక్స్ పనులు నాణ్యత ప్రమాణాలతో చెయ్యాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్. సత్యవేణి, జె. ఇ. సీతారాం నాయక్ పాల్గొన్నారు.

## త్రాగునీటి సమస్యలు పట్టించుకోరా.. అధికారులను నిలదీసిన ప్రజాప్రతినిధులు



చీపురుపల్లి ఫిబ్రవరి 6 ప్రభాతవార్త

చీపురుపల్లి పట్టణముతో పాటు మండలంలో అస్త వ్యస్తముగా సరఫరా జరుగుతున్న త్రాగునీటి సమస్యలను అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదంటూ చీపురుపల్లి మండలంలోని పలు సర్పంచులు ఎంపీటీసీలు అధికారులు నిలదీశారు. శుక్రవారం చీపురుపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల ఉపాధ్యక్షురాలు వెంకట రమణమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. పరు శాఖల అధికారుల పనితీరుపైన స్థానిక ప్రజాప్రతినిధులు గొల్లల ములగాం, నిమ్మలవలస ప్రజాప్రతినిధులు, నడిపల్లి ప్రజాప్రతినిధులు త్రాగునీటి సరఫరా అధికారుల పనితీరుపైన ముక్తకంఠంతో ధ్వజమెత్తారు. సంకిలి ప్రాజెక్ట్ అధికారులు నీటి సరఫరా చేయడంలో 100% విఫలం కావడంతో పాటు కనీసం అధికారులు ఎక్కడ ఉన్నారన్న విషయం కూడా ప్రజా ప్రతినిధులకు తెలియకపోవడం ఆశ్చర్యకరమన్నారు. సంకిలి ప్రాజెక్ట్ అధికారులు ఉన్నారా.. లేరా.. ప్రశ్నించారు. చీపురుపల్లి మండలంలో త్రాగునీటి కష్టాలను ప్రజలు ఎదుర్కొంటున్నప్పటికీ సంబంధిత అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదంటూ ప్రజాప్రతినిధులు నీటి సరఫరా విభాగం అధికారులను నిలదీశారు. రూరల్ వాటర్ సప్లై సంబంధించి అధికారులు నివేదిక సమర్పిస్తుండగా మండలంలోని పలువురు ప్రజాప్రతినిధులు అధికారులు పనితీరును దియబడుతూ విమర్శలు చేశారు. సంకిలి నీరు రాకపోగా ప్రస్తుతం వస్తున్న నీటి సరఫరా కూడా గ్రామాల వారీగా పైప్ లైన్లు లీకులు జరుగుతూ కలుషిత నీరు సరఫరా కారణంగా పలువురు రోగాల బారిన పడుతున్నారని ప్రజాప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. వైసిపి పాలనలో పాఠశాలల వారీగా నిర్మించిన వాటర్ ట్యాంకుల పై కప్పులు కూడా నిర్మాణం జరగకపోవడంతో వాటిలో చెత్తాచెదారాలు చేరి ఆ నీటిని తాగుతున్న పలువురు విద్యార్థులు రోగాల బారిన పడుతున్నారు అంటూ మండల విద్యాశాఖ అధికారి బూసినాయుడిని ప్రజాప్రతినిధులు ప్రశ్నించారు. పాఠశాలలకు సంబంధించి త్రాగునీటి సరఫరా సక్రమంగా జరగకపోతే స్థానికంగా ఉన్న సర్పంచ్ ఎంపీటీసీలను సంప్రదించి విద్యార్థులకు మెరుగైన త్రాగునీటి అందించాలని కోరారు. విద్యా శాఖకు సంబంధించి అధికారులు కనీసం ప్రోటోకాల్ పాటించకుండా తెలుగుదేశం కార్యకర్తలతో గ్రామాలలో కార్యక్రమాలు నిర్వహించడం హాస్య ఉందని వారన్నారు. విద్యా శాఖకు సంబంధించి గ్రామాలలో ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించిన సంబంధించిన విద్యా కమిటీ చైర్మన్‌తో పాటు స్థానిక సర్పంచ్ ఎంపీటీసీలకు సమాచారం ఇవ్వాలన్న కనీస విజ్ఞానం లేకపోవడం విచారకరమన్నారు. ఇటువంటి సభలు మరొకసారి గ్రామాల్లో నిర్వహిస్తే పాఠశాలలను మూసివేస్తామని ప్రజాప్రతినిధులు హెచ్చరించారు. ఇదిలా ఉండగా ఆరోగ్య శాఖకు సంబంధించి అధికారులు నివేదిక సమర్పిస్తుండగా ప్రజా ప్రతినిధులు వైద్యశాఖ అధికారులను నిలదీశారు. పల్స్ పోలియో కార్యక్రమానికి గ్రామాల్లో నిర్వహించే సమయంలో కనీసం సర్పంచ్ ఎంపీటీసీలను ఎందుకు ఆహ్వానించట్లేదు అని ప్రశ్నించారు. అధికార పార్టీకి తొత్తులుగా అధికారులు పనిచేసిన అంతకాలం ప్రజాస్వామ్యం దెబ్బతింటుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. వైస్ ఎంపీపీ కరిమజ్జి రమణమ్మ, జడ్పిటిసి వలి రెడ్డి శిరీష, పతివాడ లక్ష్మి, మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, మండల పరిషత్ ఏవో ప్రవీణ్ కుమార్, చీపురుపల్లి మండలంలోని పలు పంచాయతీల సర్పంచులు ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

## అనుమతులు లేకుండా ఎలా.. కేకే స్టడీ హాలుపై విమర్శల వెల్లువ..

చీపురుపల్లి ఫిబ్రవరి 6, ప్రభాత వార్త




జిల్లా విద్యాశాఖ అధికారుల నుండి గాని, కనీసం మండల స్థాయి విద్యాశాఖ అధికారుల నుండి ఇటువంటి అనుమతులు లేకుండా చీపురుపల్లి పట్టణంలోని గరివిడికి పోవు ప్రధాన రహదారిలో కేకే స్టడీ సెంటర్ పేరుతో కేంద్రాన్ని ఎలా నిర్వహిస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. అధికార కూటమి పార్టీకి సంబంధించిన ఓ ప్రతినిధి ఈ సెంటర్ ను నిర్వహించడం కారణంగా అధికారులు కూడా పట్టించుకోకుండా సెంటర్ నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారంటూ పలువురు ఆరోపిస్తున్నారు. స్టడీ సెంటర్ పేరుతో వసూలు చేస్తున్న ఫీజులు ఎంత మేరకు వసూలు చేస్తున్నారు అనే దాని పైన కనీసం విద్యాశాఖ అధికారులు దృష్టి ఎందుకు సారించడం లేదంటూ పరువు ప్రశ్నిస్తున్నారు. జిల్లాలో స్టడీ సెంటర్లో పేరుతో ఎంతమందికి అనుమతులు ఇచ్చారు, వాటిలో చదువు కుంటున్న విద్యార్థుల సంఖ్య ఎంత అనేది కనీసం విద్యాశాఖ అధికారులు కూడా తెలియకపోవడం శోచనీయం. ఈ సంఘటనకు సంబంధించి ప్రజల నుండి వెల్లువెత్తుతున్న నిరసనలకు మండల విద్యాశాఖ అధికారి బూసి నాయుడును వివరణ కోరగా కేకే స్టడీ సెంటర్ కు సంబంధించి ఎటువంటి విద్యాశాఖ అనుమతులు లేవని, ఆదేశాలను అతిక్రమించి సెంటర్ ను నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని వివరణ ఇచ్చారు.



## ఇల్లు పన్ను నాలుగు కోట్లు వసూలే లక్ష్యం

రామభద్రపురం, ఫిబ్రవరి 6, ప్రభాత వార్త

ఈనెల 15లోగా ఇల్లు పన్ను వసూళ్లు నాలుగు కోట్లు వసూలు లక్ష్యంగా పెట్టుకున్నామని డిఎల్పిఓ కిరణ్ కుమార్ అన్నారు రామభద్రపురం మేజర్ పంచాయతీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు బాడంగి బొబ్బిలి తెర్లాం రామభద్రపురం దత్తరాజేరు మెంటాడ గజపతినగరం పంచాయతీల్లో ఎంతవరకు కోటి 68 లక్షలు వసూలు చేయడం జరిగిందని ఆయన అన్నారు పంచాయతీల్లో ఇళ్ల పన్ను వసూలు ముమ్మరం చేయాలని పంచాయతీ కార్యదర్శులకు ఈవోపీఆర్డీలకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని ఆయన అన్నారు ఇల్లు పన్నుతో వచ్చిన నిధులతో పంచాయితీల్లో తాగునీరు వీధి దీపాలు పారిశుధ్యం పనులు చేపడతామని ఆయన అన్నారు పంచాయతీల అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు స్వర్ణ పంచాయతీల్లో ఆన్లైన్ ద్వారా ఇల్లు పన్ను వసూలు చేస్తున్నామని ఆయన అన్నారు ఈ సమావేశంలో మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ చింతల రామకృష్ణ పిఓపిఆర్డి వెంకటరమణ ఈవో సూరిబాబు పూడి కిరణ్ చింతల వాసు తదితరులు పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్ పర్యవేక్షక కమిటీ చైర్ పర్సన్‌గా సంధ్యారాణి

నెల్లిమర్ల, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త



నెల్లిమర్ల నగర పంచాయతీలోని అన్నా క్యాంటీన్ పర్యవేక్షక కమిటీ చైర్పర్సన్‌గా జనసేన పార్టీ నాయకురాలు, 14వ వార్డ్ కౌన్సిలర్ జనా సంధ్యారాణి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కమిటీ చైర్ పర్సన్ గా జన సంధ్య రాణితో పాటు మరో ఐదుగురు సభ్యులకు కూడా నియమించింది. కమిటీ సభ్యులుగా కే. పవన్ కుమార్ (వార్డు శానిటేషన్ సెక్రటరీ ), ఎన్. సునీత (మహిళా సంరక్షణ కార్యదర్శి), సురకాశి కృష్ణమోహన్ (హెల్పింగ్ హ్యాండ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి), మురపాక లక్ష్మి (స్వయం సహాయక సంఘం సభ్యురాలు), కే. శివ నగర పంచాయతీ ఇంచార్జ్ అసిస్టెంట్ ఇంజనీర్) నియమితులయ్యారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ సంధ్యారాణి విలేకరులతో మాట్లాడుతూ తనకు చైర్పర్సన్ పదవికి సిఫారసు చేసిన ఎమ్మెల్యే లోకం నాగ మాధవ్ కి ధన్యవాదాలు తెలుపుతున్నాను అన్నారు. అలాగే అన్నా క్యాంటీన్ సక్రమ నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపడతానని, అన్న క్యాంటీన్ సేవలు అత్యధిక శాతం మంది ప్రజలు వినియోగించుకునేలా కృషి చేస్తానని అన్నారు. నాణ్యత గల ఆహార పదార్థాలు సరఫరా అయ్యేలా ఎప్పటికప్పుడు కమిటీ ప్రతినిధులతో కలిసి పర్యవేక్షణ చేస్తానని సంధ్యారాణి వివరించారు. చైర్పర్సన్ గా సంధ్యారాణి నియామకం పట్ల పలువురు జనసేన పార్టీ నాయకులు, అభిమానులు హర్షం ప్రకటిస్తూ ఆమెను అభినందించారు.



## అక్కడక్కడ కనిపిస్తున్న పొగాకు పంట

పాచిపెంట ఫిబ్రవరి 6. ప్రభాతవార్త

నాడు పొగాకు పంట మండలంలో అధిక విస్తీర్ణంలో రైతులు పండించినప్పటికీ 15 సంవత్సరాలుగా వాణిజ్య పంటలైన మొక్కజొన్న మరియు పత్తి పంటలు అధిక విస్తీర్ణంలో నేడు సాగు చేస్తున్నారు. పొగాకు పంట మండలంలో కేసలి, కోటికి పెంట రాయి గుడ్డి వలస తదితర గ్రామాల్లో తక్కువ విస్తీర్ణంలో పొగాకు పంట సాగు చేస్తున్నారు. తక్కువ పంట సాగు చేయడం వలన పొగాకు పంటలు సాగు చేసిన రైతులకు మంచి గిరాకి ఉంది. ఈ పొగాకు పెంట మండలంలో పాచిపెంట కర్రీవలస గురు నాయుడుపేట పాంచాలి తదితర గ్రామాల్లో పచ్చి పొగాకురోడ్డును కొనుగోలు చేసి వ్యాపారస్తులు తమ పంట పొలాల్లో పందిళ్లకు వేలాడదీసి కొద్దిరోజులు ఎండబెట్టి తయారు చేసేవారు. ప్రస్తుతం రైతులు పొగాకు పంట సాగు తగ్గించి వాణిజ్య పంటలైన మొక్కజొన్న పంటపై ఆసక్తి కనపడుతున్నారు. మండలంలో పొగాకు పంట కోటికి పంట కేసులు పరిధిలో దర్శనమిస్తుంది.

## పోలమాంబ హుండీల లెక్కింపు

మక్కువ ఫిబ్రవరి 6 ప్రభాతవార్త



శంబర గ్రామములో ఉత్తరాంధ్ర గిరిజన ఆరాధ్య దేవత రాష్ట్ర ప్రభుత్వంచే రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన పోలమాంబ అమ్మవారి 2026 సంవత్సరం జాతర మహోత్సవములు 1వ మంగళవారం, 2వ మంగళవారంలు, ఆలయ హుండీలు ను చదురు గుడి, వనంగుడి హుండీలను శుక్రవారం ఉదయం 9 గంటలకు దేవదాయ శాఖ ఉన్నతాధికారులు, ఆలయ ధర్మ కర్తల మండలి చైర్మన్, సభ్యులు సమక్షంలో లెక్కించారు. హుండీలు లెక్కింపు చదురుగుడి 6 హుండీలకు రూ.18,47,354లు, వనంగుడి 6 హుండీలకు రూ.7,00,065లు వెరసి రూ.25,47,419 ఆదాయం వచ్చిందని, బంగారం 27 గ్రాముల 520 మిల్లీ గ్రాములు, వెండి 243 గ్రాములు వచ్చిందని ఆలయ కార్యనిర్వాహక అధికారి బి శ్రీనివాసరావు వెల్లడించారు. హుండీలు 2026 సంవత్సరం ఒకటవ మంగళవారం, రెండవ మంగళవారం జాతర మహోత్సవములతో కలిపి 8 నెలలకు ఈ ఆదాయం వచ్చినది. ఈ హుండీలు లెక్కింపు కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా దేవదాయ శాఖ అధికారి రాజారావు, ఆలయ చైర్మన్ నైదాన చిన్న తిరుపతి, ఆలయ కార్య నిర్వహణ అధికారి బి శ్రీనివాస్, సర్పంచ్ సింహాచల మమ్మ, ఎంపీటీసీ పోలినాయుడు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



## సాలూరు ప్రభుత్వ ఐటిఐలో ఈ నెల 9న జాబ్ మేళా

సాలూరు ఫిబ్రవరి 6 ప్రభాతవార్త

సాలూరు పట్టణ గవర్నమెంట్ ఐటిఐలో ఈనెల 9 న జాబ్ మేళా నిర్వహిస్తున్నామని కన్వీనర్ ప్రిన్సిపల్ శ్రీనివాసచార్య స్థానిక విలేకరులకు తెలిపారు. శుక్రవారం ఆయన తెలియజేసిన వివరాలు ప్రకారం ప్రభుత్వ ఐటిఐ పాసైన విద్యార్థులు అందరూ ఈ జాబ్ మేళాలను ఉపయోగించుకోవాలని కోరారు. అలాగే ఈ జాబ్ మేళాకు వచ్చినవారు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో పాటు జిరాక్స్ కాపీలు ఎస్ఎస్ సీ,ఐటిఐ సర్టిఫికెట్ పాస్పోర్ట్ సైజ్ ఫోటోస్ అలాగే ఆధార్ కార్డు తీసుకు రావాలని క్లారిటీ ఇచ్చారు.అంతేకాకుండా వి.జెడ్.ఎం విశాఖ, చెన్నైలలో పలు కంపెనీలలో అంప్రటీష్ కొరకు నియమకాలు జరుపుతాయని తెలియజేశారు.

## కొండం పార్టీకి చేసిన సేవలు మరువలేనివి..



### కొండం మృతి పట్ల దిగ్బ్రాంతిని వ్యక్తం చేసిన ఎమ్మెల్యే..

శృంగవరపుకోట,ఫిబ్రవరి6,ప్రభాతవార్త

కొండం పార్టీకి చేసిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. ఎస్.కోట పట్టణానికి చెందిన టీడీపీ పార్టీ సీనియర్ నాయకులు కొండం మల్లేశ్వరరావు శుక్రవారం ఉదయం మృతి చెందారు.ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ విశాఖ లోని ఒక ఆసుపత్రిలో మృతి చెందారు.కొండం టీడీపీ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతూనే ఉన్నారు.ఎస్.కోట పుణ్యగిరి ట్రస్టు బోర్డు చైర్మన్ గా అలాగే పట్టణ పార్టీ అధ్యక్షులుగా పలు పదవులు చేపట్టారు.ఈసందర్భంగా ఎమ్మెల్యే లలితకుమారి ఆయన మృతికి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.ఎస్.కోటలోని కొండం నివాసంలో ఆయన పార్థీవ దేహానికి ఎమ్మెల్యే పూల మాలలు వేసి నివాళులర్పించారు.అలాగే ఎస్.కోట నియోజకవర్గంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు,ఆయన మృతి పట్ల దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

## యువత క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి : ఎస్పీ ఎ.ఆర్.దామోదర్

నెల్లిమర్ల,ఫిబ్రవరి 6, ప్రభాతవార్త



విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ ఏ. ఆర్ దామోదర్ అన్నారు. మండలంలోని సతివాడ గ్రామంలో నెల్లిమర్ల పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ను ఎస్పీ దామోదర్ గురువారం సాయంత్రం లాంచనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ దామోదర్ ముఖ్య అతిథిగా హాజరై, విద్యార్థులతో మమేకమయ్యారు. క్షేత్ర స్థాయిలోని విద్యార్థుల్లోగల క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు, విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ఆధ్వర్యంలో ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల ఎదుగుదలకు సహాయపడతాయన్నారు. క్రీడల్లో నియమ నిబంధనలు ఉన్నట్లే సమాజంలో ప్రతీ ఒక్కరూ స్వేచ్ఛగా జీవించడానికి నిర్వహించాల్సిన బాధ్యతలు ఉంటాయన్నారు. నిబంధనలకు విరుద్ధంగా క్రీడలు ఆడితే ఏవిధంగా తప్పు చేసిన వారమవుతామో, చట్టాన్ని గౌరవించని వారు, ఉల్లంఘించిన వారు జైలుకు వెళ్ళక తప్పదన్నారు. విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో వ్యవహరించి ప్రతీకూల పరిస్థితులను అనుకూలంగా మార్చుకుంటూ, విజయాలను సొంతం చేసుకోవాలన్నారు. గేమ్స్‌లో అపజయం ఎదురైనా వాటి నుండి గుణపాఠాలను నేర్చుకొంటూ విజయం కోసం కృషి చేయాలి అన్నారు. జీవితంలో ఎదురైన ఒడిదుడుకులను ఎదుర్కొంటూ, విజయం సాధించాలన్నారు. దేశ భవిష్యత్తు అంతా యువతపైనే ఉందన్నారు. మన మంచి కోసం తల్లిదండ్రులు చెప్పిన మాటలను వినాలని, చెడు స్నేహాలకు స్వస్తి పలికాలన్నారు. మంచి భవిష్యత్తును నిర్ణయించేది చదువేనన్న విషయాన్ని విద్యార్థులు ముందుగా గుర్తించాలన్నారు. ఆత్మ విశ్వాసంతో, క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి, ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. విద్యార్థినులకు తప్పని సరిగా గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇప్పటికే చాలా స్కూల్స్ ను మహిళా సంరక్షణ పోలీసులు, శక్తి టీమ్స్, మహిళా కానిస్టేబుళ్ళు సందర్శించి, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పట్ల విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. అమ్మాయిలకు ఎక్కడైనా, ఏమైనా ఇబ్బందులు తలెత్తినా, ఈవ్ టీజింగుకు గురైనా డయల్ 100 లేదా 112కు ఫోను చేయాలన్నారు. ప్రతీ మహిళ ఫోనులోను శక్తి (ఎస్.ఓ.ఎస్) యాప్ డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. ఈ యాప్ను మొబైల్ డౌన్లోడు చేసుకోవడం వలన ఆపద సమయంలో పోలీసుల సహాయాన్ని సులభంగా పొందవచ్చునన్నారు. యాప్ లోని ఎస్.ఓ.ఎస్. బటన్ ప్రెస్ చేసినట్లయితే, సమాచారం అందిన వెంటనే పోలీసులు మీరున్న ప్రాంతానికి పోలీసులు చేరుకొని, సహాయ పడతారన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, డాన్స్, ఆత్మరక్షణ విద్యలను నేర్చుకోవాలన్నారు. గంజాయి సేవించడం అలవాటైతే, భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. గంజాయి అలవాటు పడితే సమాజంలోను, కుటుంబంలోను గౌరవం కోల్పోవడంతోపాటు, క్రిమినల్ కేసుల్లో నిందితులుగా మారుతారన్న వాస్తవాన్ని విద్యార్థులు, యువత గుర్తించాలని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ కోరారు. అనంతరం, జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ రిబ్బను కట్ చేసి, టాస్ వేసి, ప్రీమియర్ క్రికెట్ లీగ్ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో 30 క్రికెట్ జట్లు పాల్గొంటున్నట్లుగా, విజేతలుగా నిలిచిన జట్లుకు బహుమతులను ప్రధానం చేయనున్నట్లుగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రెడ్డి సత్యనారాయణ, బిజెపి మండల ప్రధాన కార్యదర్శి అల్తి నల్లి బాబు, టిడిపి నాయకులు కోరాడ శ్రీనివాసరావు, రెల్లి వెంకటేష్, భోగాపురం రూరల్ సిఐ జి.రామకృష్ణ, ఎస్బీ సిఐ ఎ.వి.లీలారావు, నెల్లిమర్ల ఎస్ఐ గణేష్, డెంకాడ ఎస్ఐ ఎ.సన్యాసి నాయుడు, ఇతర పోలీసు అధికారులు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పురపాలక సంఘం అభివృద్ధి ధ్యేయం : ఎమ్మెల్యే విజయ్ చంద్ర

పార్వతీపురం, ఫిబ్రవరి6, ప్రభాతవార్త



పురపాలక సంఘం అభివృద్ధి ధ్యేయంగా ముందుకు వెళుతున్నామని ఎమ్మెల్యే విజయ్ చంద్ర అన్నారు. శుక్రవారం పురపాలక సంఘం బడ్జెట్, అత్యవసరసర్వసభ్య సమావేశం జరిగింది. ఈసమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ పురపాలక సంఘంలోని 30 వార్డులు పరిధిలో 100 అభివృద్ధి పనులు మంజూరు చేయడం జరిగిందన్నారు. పురపాలక సంఘంలో కులాల పేరుతో వీధులు ఉండకూడదన్న ఆలోచనతో పేర్లు మార్చడం జరిగిందని ఎమ్మెల్యే వివరించారు. చిన్న మాదిగ వీధి ని గుర్రం జాషువా నగర్,పెద మాదిగ వీధిని అరుంధతి నగర్, స్వీపర్వేదని లోటస్ స్ట్రీట్, రెల్లి వీధిని బిఆర్ అంబేద్కర్ స్ట్రీట్, చాకలి వీధిని జాస్మిన్ స్ట్రీట్ హరిజన వీధిని కన్సీరాం స్ట్రీట్, గాసి వీధిని జీవన్ రావు స్ట్రీట్ గా ఇకనుంచి పిలవడం జరుగుతుందని తీర్మానం చేసినట్లు ఎమ్మెల్యే వివరించారు. సమగ్ర రక్షిత నీటి పథకానికి నిధులు మంజూరయ్యాయని త్వరలో పనులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. పురపాలక సంఘం స్థాయిని కార్పొరేషన్ స్థాయికి తీసుకు వెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్నామని అందుకు కొన్ని పంచాయితీలు విలీనం చేసేందుకు ఆలోచన చేస్తున్నట్లు వివరించారు. కార్పొరేషన్ ను దృష్టిలో ఉంచుకొని ప్రస్తుత పురపాలక కార్యాలయాన్ని ఆధునీకరించే ఆలోచన చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇంకా ఏదైనా వార్డుల్లో అభివృద్ధి పనులు చేయాల్సి ఉంటే దృష్టికి తీసుకురావాలని సూచించారు. రాజకీయాలకతీతంగా పట్టణ అభివృద్ధి ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని అన్నారు. ప్లాస్టిక్ రహిత పట్టణం గా తయారు చేసేందుకు తొలిసారిగా కౌన్సిల్ సమావేశంలో ప్లాస్టిక్ వాటర్ బాటిల్ నిషేధాన్ని అమలు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. పట్టణ అభివృద్ధికి అవసరం మేరకు నిధులు మంజూరు చేస్తామని మంత్రి గారు హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్, మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్స్, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

## శివరాత్రి జాతర ఏర్పాట్లు పక్కాగా నిర్వహించాలి : ఎమ్మెల్యే కోళ్ల

శృంగవరపుకోట,ఫిబ్రవరి6,ప్రభాతవార్త..



రానున్న మహాశివరాత్రి జాతర మహోత్సవాల ఏర్పాట్లు పక్కాగా నిర్వహించాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. శుక్రవారం ఎస్.కోట తహశీల్దార్ కార్యాలయంలో మహాశివరాత్రి జాతర ఉత్సవాలకు సంబంధించి ముందస్తుగా మండలంలోని సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈనెల 15న మహాశివరాత్రి సందర్భంగా రెండు రోజుల పాటు ఎస్.కోట పుణ్యగిరి, ధర్మవరం శ్రీ సన్యాశేస్వర స్వామి దేవాలయాలు వద్ద జరగనున్న జాతర మహోత్సవాల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే కోళ్ల అధికారులను ఆదేశించారు.ముఖ్యంగా ట్రాఫిక్ నియంత్రణకు పోలిస్ శాఖ, భక్తుల రాకపోకలకు ఆర్టీసీ,పారిశుద్యం,తాగునీటి సమస్యలు తలెత్తకుండా పంచాయతీ రాజ్ శాఖ, విద్యుత్ సౌకర్యం కోసం విద్యుత్ శాఖలు దృష్టి సారించాలని ఆమె తెలిపారు.ఇతర శాఖాధికారులు కూడా అందరి సహకారంతో తమ బాధ్యతలు నిర్వర్తించి జాతర మహోత్సవాలను ఎటువంటి అవాంతరాలు లేకుండా సక్రమంగా జరిగేలా చూడాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనువాస రావు, ఎస్.కోట పీఏసీఎస్ చైర్మన్ జీఎస్ నాయుడు,టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్, పుణ్యగిరి ఉత్సవ కమిటీ చైర్మన్ పి.అప్పలరాజు పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## బలిజిపేట పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీలు మన్యం జిల్లా ఎస్పీ మాధవ రెడ్డి

బలిజిపేట ఫిబ్రవరి 6 ప్రభాతవార్త




స్థానిక పోలీస్ స్టేషన్ ను శుక్రవారం పార్వతిపురం మన్యం జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో స్టేషన్ పరిధిలో గల పెండింగ్‌లో ఉన్న ఫైల్స్‌ను పరిశీలించారు మాదక ద్రవ్యాలపై నిగా ఉంచాలని సూచించారు ప్రతి ఒక్క వాహన దారుడు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని సూచించారు రికార్డ్ రూమ్‌లో రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించారు స్టేషన్ హౌస్ ను స్థితిగతులను ఎస్సై ను అడిగి తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై సింహాచలం మరియు సిబ్బంది పాల్గొన్నారు

## ఘనంగా స్త్రీ శక్తి సమ్మేళన వేడుకలు

కురుపాం ఫిబ్రవరి 6 ప్రభాతవార్త



స్త్రీ శక్తి సమ్మేళన వేడుకలు స్థానిక విజ్ఞాన భారతి పాఠశాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం మండలం బియ్యాల వలస గ్రామంలో స్త్రీ శక్తి సమ్మేళన వేడుకలలో ముఖ్య వక్తలుగా కుమారి ప్రేమ, సౌజన్యలు కుటుంబ విలువలు, పర్యావరణశీ కోసం మాట్లాడి మహిళలకు అవగాహన కల్పించారు. మీనక గంగమ్మను సేవా ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. పువ్వల చిన్నారావు, తోయిక కాంతారావు, సాంబయ్య అధిక సంఖ్యలో మహిళలు, విజ్ఞాన భారతి పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు తీర్చడంలో వైసిపి ముందు ఉంటుంది..



### వైసిపి జిల్లా ప్రచార అధ్యక్షులు వలి రెడ్డి..

చీపురుపల్లి ఫిబ్రవరి 6 ప్రభాతవార్త

ప్రజా సమస్యలను పరిష్కరించడంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలకులు ముందంజలో ఉంటారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రచార అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాస నాయుడు అన్నారు. శుక్రవారం చీపురుపల్లి పట్టణం జి.అగ్రహారం శంకరాపు వీధి కల్లాలదగ్గర గత కొన్ని నెలలుగా త్రాగునీటికి ఇబ్బంది పడుతున్న సమస్య ను శుక్రవారం నాడు పరిష్కరించారు. సమస్యను వార్డ్ మెంబర్స్, ఎంపీటీసీ నాయకులు,మండల నాయకులు దృష్టికి తీసుకుని వెళ్లగా వెంటనే స్పందించి ఎంపీపీ ఇప్పిలి అనంతం మండల పరిషత్ నిధులు నుంచి మంచినీటి కొళాయిలకి సంబంధించిన పైప్ లైన్ అలాగే కొళాయిల కోసం మండల పరిషత్ గ్రాంట్ సుమారు 4 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం నాడు పనులకు శంకుస్థాపన జరిపారు. మండల వైస్సార్ పార్టీ అధ్యక్షులు మీసాల వరహాలనాయుడు,సర్పంచ్ మంగళగిరి సుధారాణి,శ్రీనివాస్,వైస్ సర్పంచ్ బెల్లన శ్రీదేవి, ఎంపీటీసీ కోసిరెడ్డి రమణ,కర్రోతు ప్రసాద్, గవిడి సురేష్ వార్డ్ మెంబెర్స్ రౌతు పైడిరాజు, బురదమహేష్,తలచిట్ల రాము ,కంచుపల్లి అశోక్, పాండ్రంకి వాసు, మహిళలు, పాల్గొన్నారు.

## బొబ్బిలి మున్సిపల్ శాఖ కార్యవర్గం ఎంపిక

బొబ్బిలి ఫిబ్రవరి 6 ప్రభాతవార్త



పట్టణ మున్సిపల్ ఉద్యోగుల సంఘ నూతన అధ్య క్షునిగా ఎస్ఎఫ్ అహమ్మద్ ఎంపికయ్యారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ సిబ్బంది నూతన కార్యవర్గం ఎన్నికలు నిర్వహించారు. జనరల్ సెక్రెటరీగా పి సురేష్ బాబు అసోసియేట్ అధ్యక్షులుగా పి విజయ గౌరి. వైస్ ప్రెసిడెంట్గా డి భాను ప్రకాష్ సిహెచ్ వి ఎస్ ఎస్ గుప్తాతో పాటు ఆర్గనైజింగ్ సెక్రటరీగా సంజయ్ పట్నాయక్‌తో పాటు కార్యవర్గ సభ్యులు ఎంపిక కాబట్టారని ముఖ్య కార్యదర్శి పి సురేష్ బాబు తెలియజేశారు.

## నేడు కెవికెలో కిసాన్ మేళా

కురుపాం ఫిబ్రవరి 6 ప్రభాతవార్త

కురుపాం మండలం రస్తాకుంటు బాయ్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో "సుస్థిర సేంద్రియ వ్యవసాయం- రైతాంగ ప్రగతికి సోపానం" అనే అంశంపై కిసాన్ మేళా కార్యక్రమం శనివారం నిర్వహి స్తున్నట్లు ఆ సంస్థ ప్రోగ్రాం అధికారి ఎంఎ విహారి తెలిపారు. సుమారు 550 మంది రైతులు పాల్గొంటారని తెలిపారు. ఈ కిసాన్ మేళాకు ముఖ్య అతిథులుగా వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యా రాణి, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, ఆచార్య రంగ విశ్వవిద్యాలయ అధికారులు, జిల్లా కలెక్టర్ ప్రభాకర రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు.

## బడ్జెట్ సమావేశాల్లో సమస్యలు పరిష్కరించండి : కార్మికులు



సాలూరు ఫిబ్రవరి 6 ప్రభాతవార్త

సాలూరు పట్టణ మున్సిపల్ కార్మికుల సమస్యలు జరగబోవు బడ్జెట్ సమావేశాల్లో పరిష్కరించాలని యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్.వై. నాయుడు ఆధ్వర్యంలో కార్మిక నాయకులు శుక్రవారం రాష్ట్ర మంత్రి గుమ్మిడి.సంధ్యారాణికి వినతిపత్రం అందజే సారు.అనంతరం వారి సమస్యలపై నాయుడు మాట్లాడుతు12 వ పీఆర్సీని వెంటనే ప్రకటించాలని ఇంకా మున్సిపల్ కార్మికుల అందరికీ ప్రభుత్వమే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.అలాగే కార్మికులకు కనేస వేతనం 26 వేలుగా పెంచాలని, మృతి చెందిన రిటైర్మెంట్ అయిన కార్మికుల వారసులకు ఉద్యోగ అవకాశం కల్పించాలని పలు సమస్యలు తెలియజేశారు.టి రవి, మీడియా ఇన్చార్జ్ శ్రీను,మహిళా కమిటీ నాయకులు ఇందు,సీత, కమిటీ నాయకులు పాల్గొన్నారు.

## తిరుపతిలో మోహన్ బాబు యూనివర్సిటీని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి

పాచిపెంట, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త



ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ నాయకులైన అక్బర్ వినోద్ లపై దాడి చేసినటువంటి వారిపై క్రిమినల్ కేసులు పెట్టి మోహన్ బాబు యూనివర్సిటీ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని మండల సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. విద్యార్థుల నుండిఅక్రమంగా ఫీజులు వసూలు చేసిన డబ్బులను తిరిగి యాజమాన్యం ప్రజలకు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు కోరారు. పాచిపెంట మండల కేంద్రంలో ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు మండల నాయకులు మంచాల శ్రీనివాస్ జన్నిరామయ్య లు ఒక ప్రయత్నంలో తెలిపారు.సినీ నటుడు మోహన్ బాబు యూనివర్సిటీలో దాదాపు 5 రోజులుగా జరుగుతున్నటువంటి ఘటన రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని అక్రమంగా కోట్ల రూపాయలు వసూలు చేస్తున్నటువంటి మోహన్ బాబు యూనివర్సిటీ అవినీతి బట్టబయలు చేసే పోరాటాల్లో భాగంగా. ఎస్ఎఫ్ఐ మరియు యూనివర్సిటీ రాష్ట్ర నాయకులైన అక్బర్ నవీన్ లను ప్రైవేట్ గుండాలను పెట్టి కొట్టించడం మోహన్ బాబు విలనిజం సినిమాలో లాగా చాలా దుర్మార్గం సినిమాల్లో వినను బయట కూడ విలన్‌గా తయారయ్యారని అన్నారు. ఇలా దాడులు చేసినటువంటి వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేసి యూనివర్సిటీలో ఇటువంటి మోసాలను అరికట్టాలని బౌన్సర్లు ద్వారా ఇటువంటి దాడులు గుండా గిరి చేయడం సరైన కాదని ఇటువంటి పద్ధతే ఆంధ్రప్రదేశ్లో సినీ నటుడు మోహన్ బాబు ప్రవేశపెడుతున్నారని దీన్ని ప్రజలందరూ కూడా ఖండించాలని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని వెంటనే దోషులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## గ్రామీణ పోస్ట్ ఆఫీసుల్లో మరిన్ని సేవలు..పోస్టల్ సూపరింటెండెంట్..



శృంగవరపుకోట,ఫిబ్రవరి6,ప్రభాతవార్త

గ్రామీణ పోస్ట్ ఆఫీసుల్లో కొత్తగా మరిన్ని సేవలు అందుబాటులోకి తెచ్చినట్లు జిల్లా పోస్టల్ శాఖ సూపరిండెంట్ కె.శ్రీనివాస్ తెలిపారు.శుక్రవారం ఎస్.కోట ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఎస్.కోట సబ్ డివిజన్ పోస్టల్ శాఖ ఇన్స్పెక్టర్ సతీష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్ ముఖ్య అతిథి గా పాల్గొని మాట్లాడుతూ స్పీడ్ పోస్టు,పార్సెల్ బుకింగ్ సౌకర్యాలు గ్రామాల్లో కల్పి స్తున్నామన్నారు. ఈనెల 18,19,20 తేదీల్లో నిర్వహించనున్న పోస్టల్ లైఫ్ ఇన్సూ రెన్స్ మేళాను సిబ్బంది విజయవంతం చేయాలని ఆయన కోరారు. పలువురు పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

## చీపురుపల్లి బి సి వసతి గృహ విద్యార్థిని అదృశ్యం

గరివిడి ఫిబ్రవరి,6 ప్రభాత వార్త

గరివిడి మండలం దేవాడ గ్రామానికి చెందిన పండూరి దీవెన అనే టెన్త్ విద్యార్థిని అదృశ్యమైంది.ఈ మేరకు ఆ బాలిక తల్లి పండూరి వరలక్ష్మిపోలీసు లకు పిర్యాదు చేశారు. చీపురుపల్లి వెనుకబడిన కులాల వసతి గృహంలో ఉంటూ చీపురుపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న దీవెన ఈ నెల 2 తేదీ నుండి కనిపించడం లేదని పోలీసులు కి పిర్యాదు అందింది.. కాగా వసతి గృహం నుండి జనవరి 30 న కడుపునొప్పి అని తల్లిదండ్రులు కి ఫోన్ చేసి దేవాడ లోగల ఇంటికి చేరుకున్న బాలికను ఒక ప్రైవేట్ వైద్యుని తో చికిత్స చేయించారు. అయితే ఫిబ్రవరి 2 స్కూలుకు వెళతానని ఉదయం 9 గంటలకు ఇంటి నుండి వెళ్లిన బాలిక ఆచూకీ లభించ లేదు. 3 వతేదీన పాఠశాల నుండి విద్యార్థిని తల్లిదండ్రులు కి ఫోన్ చేసిన ఉపాధ్యాయులు మీ కుమార్తె దీవెన రెండురోజుల నుండి పాఠశాల రావడం లేదని సమాచారం ఇచ్చారు. దీంతో హతాశులైన తల్లిదండ్రులు సమీప బంధువులు ఇళ్ల వద్ద వెతికి నా తమ కుమార్తె ఆచూకీ లభించ లేదని పోలీసులకు పిర్యాదు చేశారు. ఈ మేరకు గరివిడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

7- 2 pg 9.qxd:7- 2 pg 9.qxd 1/1/02 6:37 AM Page 1



# కాఫ్తాన్ స్టైల్‌గా..







ఫ్యాషన్ ఫ్యాషన్

చలి ఒక్కసారిగా తగ్గిపోయి.... ఎండ ప్రభావం మొదలైంది కదూ! ఎండంటే చెమటలు, ఉక్కబోత, ఇలాంటప్పుడు మన మనసు ఆహ్లాదకరంగా వైపే మళ్లుతుందంటే కాదంటామా? అలా ఇప్పుడు ఎక్కువమందిని ఆకర్షిస్తున్నమేటో తెలుసా... కాఫ్టాన్లు. ఫ్యాషన్ ప్రపంచాన్ని కుదిపేసిన స్టైల్ ఇది. కానీ వీటి ఉనికి మాత్రం వందల ఏళ్ల క్రితం నుంచే ఉంది. మధ్యప్రాచ్యం, ఆసియాల్లో ఎక్కువగా కనిపించే ఫ్యాషన్ ఇది. పైనుంచి కిందివరకూ ఉండేది. రానురానూ దానిలో మార్పులొచ్చాయి. తారల వల్ల కాఫ్టాన్ చాలామందికి పరిచయ మైంది. మెటర్నిటీ సమయంలో, బీచ్ వెకేషన్లలో వాటిల్లో మెరిసి పాపులారిటీ తెచ్చారు. దీంతో అమ్మాయిలూ మనసుపడ్డారు. ఇలా ప్రత్యేక సందర్భాలలో సరే! కానీ రోజువారీ కష్టమంటారు చాలామంది. కాఫ్తాన్... సౌకర్యవంతం. చూడటానికీ స్టైల్‌గా ఉంటుంది. ఎలాంటి శరీరాకృతికైనా నప్పుతుంది. సమస్యల్లా పొడవుగా ఉండటమే. కాస్త డిజైన్లు మారినా.. తుది రూపం మాత్రం అదే! పైగా ఇప్పుడు షార్ట్ ఫ్యాషన్ ట్రెండ్ అందుకే ప్యాడ్ స్టైల్ కో ఆర్డ్ సెట్ల హవా నడుస్తోంది. అలాంటప్పుడు ఈ పొడుగు ఫ్యాషన్‌ని మెచ్చేదెవరు? అలాగని దృష్ట్యా పక్కన పెట్టాలి అనిపించదు. ఈ మీమాంసని గుర్తించారేమో లక్షణాలు. కోర్డ్ సెట్లకి కాఫ్తాన్ని జోడించారు: ట్రెడీ డిజైన్లలో కూడా తీసుకొచ్చారు. బాగా ఉన్నాయి కదూ! రోజు వారీకే కాదు... వేడుకలకి తగ్గట్టుగా తీర్చి దిద్దారు. అంటే స్టైల్‌కి జోడి అన్నమాట. ఇవి వేసు కుంటే పెద్దగా యాక్సెసరీల అవసరమూ ఉండదు. అయినా మెరిసిపోవొచ్చు. ◻

# నిస్సహాయ మహిళలకు చేయూతనిస్తూ..



బిడ్డ పుట్టిన 14 రోజులకే ఆమె జీవన పోరాటం మొదలైంది. శారీరక, మానసిక సంఘర్షణలతో కుమిలిపోలేదామె. పరిస్థితులతో పోరాడటం నేర్చుకుంది. తన కాళ్లమీద తను నిలబడటమే కాకుండా... తనలాంటి నిస్సహాయ మహిళలకు చేయూతనిస్తోంది కారుణ్య గుణవతి. ఆమె గురించి తెలియాలంటే....

సమస్యల నుంచే చాలాసార్లు పాఠాలు నేర్చుకుంటాం. అవే భవిష్యత్తులో మన తీరు తెన్నులు ఎలా ఉండాలో నిర్దేశిస్తాయి. నా విషయంలోనూ అదే జరిగింది. మాది తెన్కాశీ పేరు చూశపెట్టి గ్రామం. నాన్న కరుణాకర్ పొన్రాజ్.. ఓ వర్క్‌షాప్‌లో పనిచేసేవారు. అమ్మ దేవా అన్బు భాగ్య సెల్వి మేము ఇద్దరం పిల్లలు. నాన్న జీతంతోనే ఇల్లు గడిచేది. దాంతో చదువుకోవడానికి కష్టమైంది. పదో తరగతి పూర్తవుతూనే నేను పార్టమ్ ఉద్యోగాల కోసం వెతకడం మొదలు పెట్టా. కానీ మేము ఉండే ప్రాంతంలో ఉద్యోగావకాశాలు చాలా తక్కువ. అరపిల్లల్ని చేర్చుకోవడమూ అరుదే అందుకే ట్యూషన్లు చదువుకునేదాన్ని, అలా చెబుతూ ఎలక్ట్రానిక్స్ పూర్తిచేశా. ఓ ప్రైవేట్ కంపెనీలో ప్రెజెంటేషన్ ఉద్యోగం సంపాదించా. కెరియర్లో వృద్ధి కోసం దూరవిద్యలో ఎంబీఏ కూడా పూర్తిచేశా. పని, చదువు ఇవే లోకంగా గడిపా. అంతలోనే పెళ్లి అన్నారు. బాధ్యత కదా అని పెళ్లికి ఒప్పుకొన్నా. అది మొదలు అన్నీ సమస్యలే. ఆర్థికంగా ఎన్నో కష్టాల్ని ఎదుర్కొన్నా. ప్రసవమైన 14 రోజులకే ఉద్యోగ వేటలో పడ్డాను. అన్నీ విఫలయత్నాలే. అయినా పట్టుదలగా 2021లో 'రఫెల్ క్రియేటివ్స్'అంకురాన్ని స్థాపించింది... సంస్థలు, ఉత్పత్తులకు బ్రాండింగ్, మార్కెటింగ్, ప్రొడక్ట్ రీచ్ వంటి వాటిలో సేవలందించడం మొదలుపెట్టా. రెండు సెకండ్ హ్యాండ్ ల్యాప్టాప్లతో, ఇద్దరు వినియోగదార్లతో నా ప్రయాణం మొదలైంది. ఏడాది



గడవకముందే విదేశీ క్లయింట్లను సంపాదించుకునే స్థాయికి చేరుకున్నా. ఇప్పుడు నెలకు రూ.45 లక్షలు సంపాదిస్తున్నా. ప్రస్తుతం రఫెల్ క్రియేటివ్స్కి 500మంది స్థిర వినియోగ దార్లు ఉన్నారు. 15మందికి ఉపాధి కల్పిస్తున్నా.

**ఊహించని మలుపు...** 2023 నుంచి స్థానిక మహిళలకు నైపుణ్య శిక్షణ ఇవ్వడం ప్రారంభించాం. 'కొట్రవై' అనే సంస్థను స్థాపించి దాని ఆధ్వర్యంలోనే కార్యకలాపాలు చేయడం మొదలు పెట్టాం. ఇది నాకు అదనపు భారం అవుతుందని తెలుసు! కానీ మహిళలు, అమ్మాయిలు ఆర్థిక సాధికారత సాధించాలనే లక్ష్యంతో పనిచేయడం మొదలు పెట్టా. ప్రస్తుతం ఈ సంస్థ ఆధ్వర్యంలో టెంకాయ చిప్పలతో గృహాలంకరణ వస్తువులు, టెర్రాకోట నగలు, హెల్త్ మిక్స్ లాంటి ఆహార ఉత్పత్తులు, అద్దాల ఫ్రేమ్‌లు, వాటర్ బాటిళ్లు తయారుచేస్తున్నారు. వీటిని నిర్వహిస్తున్న మా వెబ్‌సైట్ ద్వారా అమ్ముతున్నాం. విదేశాలకీ ఎగుమతులు చేస్తున్నాం. ఈ సేవల్ని ఇంకా విస్తరించే లక్ష్యంతో అడుగులు వేస్తున్నా. ◻

# గరుత్మంతుడు



**దయ తోటి మనుషులకే పరిమితం కాదు** పశు పక్ష్యాదులపట్ల కూడా అదే భావన కలిగుండాలి. దయాగుణానికి మరో రూపం జీమూతవాహనుడు. ప్రమాదకరమైన పాముల కోసం తనను తాను ఆత్మార్పణ చేసుకోవడానికి సిద్ధపడ్డాడు. ఇతడోరోజు పర్వతప్రాంతంలో విహరిస్తుండగా ఎముకల గుట్ట కనిపించింది. అక్కడో వృద్ధురాలు ఏడుస్తోంది. అవి పాముల ఎముకలనీ, గరుత్మం తుడు నిత్యం పాములను వేటాడుతుంటే భయంతో బతకలేక రోజుకొకటి ఆహారంగా వెళ్లేలా గరుత్మంతునితో ఒప్పందం కుదుర్చు కున్నాయని, ఆ రోజు తన పుత్రుడు శంఖచూడుడి వంతనీ చెప్పిందామె. ఆ తల్లి దుఃఖాన్ని చూడలేక గరుత్మంతునికి ఆహారంగా వెళ్లాడుజీమూతవాహనుడు. సాటి ప్రాణుల పట్ల అంతటి కరుణ చూపిన అతణ్ణి చూసి పశ్చాత్తాపం చెందాడు గరుత్మంతుడు. పైగా స్వర్గం నుంచి అమృతాన్ని తెచ్చి ఎము కలగుట్టగా ఉన్న నాగుల్ని బతికించాడు. జీమూతవాహనుని దయ ఆత్మార్పణ రూపంలో వ్యక్తమై, గరుత్మంతుని లోని ప్రతీకారాన్ని దయగా మలిచింది. సృష్టిలోని సకల జీవులూ సామాన్యంగానే జీవిస్తాయి. మనిషి మాత్రం కోరికల పుట్ట. తన అవసరాల కోసం అన్ని ప్రాణుల్నీ ఉపయోగించుకుం టాడు. నిజానికి బుద్ధిజీవులమైన మనం చుట్టూ ఉన్న ప్రాణుల అవసరాలను తీర్చేం దుకు ప్రయత్నించాలి. దీన్నే సంప్రదాయం భూతయజ్ఞంగా పేర్కొంది. ఇది పంచ మహా యజ్ఞాల్లో ఒకటి. మనం భోజనం చేసేటప్పుడు కొంత ఆహారాన్ని పక్కకు తీసి మంత్రపూర్వకంగా భోజనం చేయాలి. తిన్న వెంటనే పక్కనుంచిన ఆహారాన్ని తీసుకెళ్లి ఇంటి బయట శుభ్రమైన స్థలంలో అమంత్రకంగా ఇతర ప్రాణుల కోసం ఉంచాలి. ఈ భూత దయను పెంపొందించుకోవాలి.దయాగుణం ఎంత మహోన్నత మైనప్పటికీ దుర్మార్గుల పట్ల సముచితంకాదు. ◻

# కుట్టు ధాన్యం



చిరు ధాన్యాల్లో కుట్టు కొంచెం భిన్నమైంది. వీటిని బక్వీట్ మిల్లెట్స్ అంటారు. ఇవి జమ్మూ, కశ్మీర్, కార్గిల్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ వంటి ప్రాంతాలకు ప్రసిద్ధి. మనకూ్కడా అందుబాటులో ఉన్నాయి. వీటిలో విటమిన్ బి6, కాల్షియం, మాంగనీస్, మెగ్నీషియం, పొటాషియం, భాస్వరం, సెలీనియం, ఐరన్, కాపర్, జింక్, రిబోఫ్లెవిన్, ఫోలెట్.. ఇలా శరీరానికి మేలు చేసేవెన్నో ఉన్నాయి. శక్తినిచ్చే ఉపవాస సమయాల్లో వెంటనే కొందరు ఈ ధాన్యాన్ని ఎంచుకుంటారు. అనేక ప్రయోజనాలున్నాయి.. ◷ గుండె జబ్బుల నుంచి దూరంగా ఉంచుతాయి. ◷ రక్తపోటు అదుపులో ఉంటుంది. హైపర్టెన్షన్ రాదు. ◷ రక్తంలో చక్కెర స్థాయిని క్రమబద్ధం చేస్తుంది. ◷ జీర్ణ ప్రక్రియ సాఫీగా ఉంటుంది. ◷ గ్లూటెన్ సెన్సివిటీ సమస్యతో బాధ పడుతున్న వారికి కుట్టు ధాన్యం మంచి ప్రత్యామ్నాయం. ఇవి కొన్ని రకాల క్యాన్సర్లను నివారిస్తాయి. ◷ ఊబకాయం రాదు. ◷ చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. ఈ మిల్లెట్ పిండితో రొట్టె, ఇడ్లీ, పరోటా, పాయసం, పాస్తా, ప్యాన్‌కేక్, కారప్పూస లాంటి వంటకాలు చేయొచ్చు. కుట్టు రవ్వతో సులువుగా ఉప్మా చేసుకోవచ్చు. ◻

# ఆరోగ్య భాగ్యం — తీపి రుచి-2

**లాభాలు:** ఇది చర్మం, వెంట్రుకలపై ప్రభావం చూపుతుంది. ఇది గాయాల్ని నయం చేస్తుంది. ఇది ఇమ్యూనిటీని పెంపొందిస్తుంది. మీరు బరువు పెరుగుతారు. ఇది పిల్లలకి, పెద్దలకి మంచిది. దీనివల్ల వారి నోటియందు లాలాజలం విడుదలై నోరు తడిగా మారుతుంది. ఇంద్రియాలకి తృప్తినిస్తుంది. ఇది శరీరానికి న్యూట్రియెంట్ ఫ్లూయిడ్స్‌ని పెంపొందిస్తుంది. శరీరంలోని టాక్సిన్స్‌ని తగ్గిస్తుంది. శరీరానికి గట్టిదనాన్ని, శరీరంలో కణాల్ని పెంపొందిస్తుంది. వీరిలో రక్తం, మాంసం, ఎముకలు, శుక్రం నివృద్ధి చెందిస్తుంది. శరీరానికి బలాన్నిస్తుంది. దప్పికను తీరుస్తుంది. ఇది వెంట్రుకలకి, కంఠంకు, ముక్కు, నోరు. పెదవులు, నాలుకకు మంచిది. తీపి వస్తువులు ఎక్కువగా తీసుకోవడం వల్ల కలిగే దుష్ఫలితాలు: స్థూలకాయం, సోమరితనం అధిక నిద్ర, ఆహారం తీసుకోవాలనిపించదు. దగ్గు, జలుబు, అజీర్ణం, కడుపుబ్బరం వాంతి, బోధకాలు, నేత్ర, ముక్కు కఫ వ్యాధులు రావడం, శరీరం బరువుగా ఉఎండడం, ఆయాసం, మలబద్ధకం,కఫం ఎక్కువవడం వంటి లక్షణాలతో పాటు మెడలో గ్రంథులు వాయడం. సృహ తపనపడం, కడుపులో జఠరాగ్ని పెరగడం తీపిపై అధిక ఇష్టం ఏర్పడడం, మూడ్ ఛేంజ్ ఉండడం వంటి సైడ్ ఎఫెక్ట్స ఏర్పడతాయి.

**జాగ్రత్తలు :** వీరు ఆహారంలో ఫైబర్ ఎక్కువగా తీసుకోవాలి. ◻ ఎక్సర్‌సైజ్ రెగ్యులర్‌గా చేయాలి. ◻ నీళ్ళు ఎక్కువగా తీసుకోవాలి. ◻ సరైన నిద్ర అవసరం. ◻ స్ట్రెస్, టెన్షన్ లేకుండా చూసుకోవాలి. ◻ చక్కెర లేని చూయింగ్‌గమ్స్‌ని నమలాలి. బి.పి. షుగర్, థైరాయిడ్, గుండె జబ్బులు, ఫ్యాటీ లివర్, స్ట్రోక్, బరువు పెరగకుండా, ఇన్‌ఫ్లమేషన్ రాకుండా చూసుకోవాలి. ◻ నోటి పరిశుభ్రత చాలా ముఖ్యం. తీపికి బదులుగా కొన్ని సింథటిక్ చర్వన సమ్మేళనాలు సాచరిన్, సైక్లేమేట్స ఉఎక్రలోజ్, నియోటామ్‌ల్ని ఆహార సంకలనాలుగా ఉపయోగిస్తారు. తీపి రుచికి గుర్తుగా జిలేబిని నేషనల్ స్వీట్ ఆఫ్ ఇండియాగా గురించారు. పండ్లలో కింగ్‌గామామిడి, ద్రాక్ష, గుర్తించారు. నేషనల్ చాక్లెట్ కేక్‌డేగా జనవరి 27ని పరిగణించారంటే అధికంగా ఆహారాన్ని తినేటప్పుడు గుర్తించబడే ప్రాథమిక రుచిగా తీపికి ఉన్న ప్రాముఖ్యతే కారణం. దీన్ని ఎక్కువగా లావు, ఆయాసం, ఆమ్లం, కఫం ఉన్నవారు మానివేయాలి. రుచి మొగ్గలు శరీరంలోని చక్కెరకు మెదడులోని నిర్దిష్ట ప్రాంతాలకు సమచారాన్ని అందించడంలో ఇన్సులిన్, డోపమైన్, గ్రేలిన్, లెప్టిన్ వంటి కోరకలకు దోహదపడే హార్మోన్లని ప్రేరేపిస్తాయి. కాబట్టి భోంచేసేటప్పుడు మొదట స్వీట్ తినాలి. తీపి పదార్థాలు ఎక్కువగా తింటే డైజేషన్ పవర్ తగ్గడం లైపోమా, శ్వాసకోశ వ్యాధులు, ఆస్మా, రైనైటిస్:, జ్వరం, కడుపుబ్బరం, వాంతులు, స్వరంలో తేడా, కడుపులో క్రిములు ఏర్పడడం, వంటి వ్యాధులు, ట్యూమర్స్ ఏర్పడడం వంటి లక్షణాలు ఏర్పడతాయి. బేరివయయం క్లోరైడ్, లెడ్ అసిటేట్‌తో సహా అకర్బన సమ్మేళనం తీపిగా ఉంటాయి.కొన్ని రకాల ఆకులు (జిజిఫిన్, చైనీస్ జుజుబే ఆకుల వల్ల) కూడా తియ్యగా ఉంటాయి. నీరులోని కాల్షియం, ఐరన్ ఆయాన్ల వల్ల నీటినకి తయ్య రుచి వస్తుంది. తీపి ఎక్కువగా తినేవారు తీపికి విరుగుళ్ళగా లవంగాల్ని వాడాల్సి ఉంటుంది. ◻



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

# 'పిఠాపురంలో' డా.రాజేంద్రప్రసాద్



పద్మశ్రీ పురస్కారం తర్వాత విడుదలయ్యే డా. రాజేంద్రప్రసాద్ మొదటి చిత్రం 'పిఠాపురంలో' ప్రేయసి రావే, అయోధ్య రామయ్య, చెప్పాలని వుంది, జోరుగా హుషారుగా, ఒక్కడే, హనుమంతు, ఆలస్యం అమృతం, రెడ్ అలర్ట్" వంటి చిత్రాలతో దర్శకునిగా మంచి గుర్తింపు సంపాదించారు మహేష్ చంద్ర . తాజాగా ఆయన దర్శకత్వంలో రూపొందిన చిత్రం"పిఠాపురంల్తో. దీనికి ఉపశీర్షిక ' అలా మొదలైంది' .ఈ చిత్రంలో నటకిరీటిడా. రాజేంద్రప్రసాద్, పృధ్వీరాజ్, కేదార్ శంకర్, మణిచందన, జయవాహిని, అన్నపూర్ణమ్మ ప్రధాన పాత్రల్లో నటించారు. అలాగే దాసరి పద్మ, సన్నీ అఖిల్, విరాట్, సాయి ప్రణీత్, శ్రీలు, ప్రత్యూష, రెహానా, ర్పి. పవన్ కళ్యాణ్, J.D.V ప్రసాద్, K.A. పాల్ రాము, జబర్దస్త్ శేషు తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. మహేష్ చంద్ర సినిమా టీమ్ బ్యానర్‌పై దుండిగల్ల బాలకృష్ణ, ఆకుల సురేష్ పటేల్, ఎఫ్.ఎం. మురళీ (గోదారి కిట్టయ్య) ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. షూటింగ్ పార్ట్ పూర్తయిన ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. త్వరలోనే విడుదల తేదీని ప్రకటించనున్నారు. త్వరలో రిలీజ్ డేట్ ప్రకటిస్తాం" అని తెలిపారు.

# 'మన శంకరవర ప్రసాద్ గారు' ప్రపంచవ్యాప్త వసూళ్లు రూ.375 కోట్లు



25 రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా 375 కోట్లకు పైగా వసూలు చేసి ఆల్‌టైమ్ ఇండస్ట్రీ రీజినల్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన మెగాస్టార్ చిరంజీవి 'మన శంకరవర ప్రసాద్ గారు' సంక్రాంతి పండుగ కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన మెగాస్టార్ చిరంజీవి ' మన శంకర వర ప్రసాద్ గారు' బాక్సాఫీస్ సంచలనంగా మారింది. ఈ చిత్రం థియేటర్లలో విజయవంతంగా 25 రోజులు పూర్తి చేసుకుని, అన్ని ప్రాంతాలలోనూ అద్భుతంగా కొనసాగుతోంది. ఈ చిత్రం ఇప్పటికే ఎన్నో రికార్డులను బద్దలు కొట్టింది.ముఖ్యంగా కుటుంబ ప్రేక్షకులు, ఈ చిత్రంలోని వినోదం, భావోద్వేగం, చిరంజీవి మాగ్నటిక్ పెర్ఫార్మెన్స్ కోసం థియేటర్లకు పోటెత్తుతున్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో "MSG" నాల్గవ వారంలో కూడా తన విజయ పరంపరను కొనసాగిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా 375 కోట్ల మార్కును దాటిన ఈ చిత్రం ఇప్పుడు ఆల్‌టైమ్ రీజినల్ ఇండస్ట్రీ హిట్‌గా నిలిచి, అద్భుతమైన వసూళ్లను నమోదు చేస్తూనే ఉంది. ఇది చిరంజీవి, అనిల్ రావిపూడి ఇద్దరికీ అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది. ముఖ్యంగా, ఇది బుక్‌మైషోలో అత్యధిక టిక్కెట్ల అమ్మకాలతో కొత్త రీజినల్ రికార్డును కూడా నెలకొల్పింది. విదేశాలలో 3.5 మిలియన్ డాలర్ల మైలురాయికి చేరువలో ఉంది. విక్టరీ వెంకటేష్ కీలక పాత్రలో నటించిన "MSG" చిత్రం మరో మైలురాయిని చేరుకోవడానికి సిద్ధమోతోంది. 400 కోట్ల మార్కును చేరుకునే దిశగా దూసుకుపోతోంది.

తెర

# 'వెంకట్రామయ్య గారి తాలూకా' టైటిల్ పోస్టర్



సీనియర్ నటుడు మురళీధర్ గౌడ్, సీనియర్ నటి సుధ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం ' వెంకట్రామయ్యగారి తాలూకా' జయమ్మ పంచాయతీ' మూవీ ఫేమ్ దినేష్ కుమార్ హీరోగా, ఈటీవీ ప్రభాకర్ కుమార్తె దివిజ ప్రభాకర్ హీరోయిన్‌గా నటించారు. తండ్రి, పిల్లల మధ్య భావోద్వేగాల నేపథ్యంలో వారి వారి బాధ్యతలను తెలియజేసేలా రూపొందిన ఈ సినిమాను డైరెక్టర్ సతీష్ ఆవాల తెరకెక్కిస్తున్నారు. ఈ సందర్భంగా సీనియర్ నటుడు మురళీధర్ గౌడ్ మాట్లాడుతూ..ఈ చిత్రంలో వెంకట్రామయ్య గారు పాత్రను నేను పోషించా. అని చెప్పారు.సీనియర్ నటుడు కాశీవిశ్వనాథ్ మాట్లాడుతూ మురళీధర్ గౌడ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సినిమా మంచి కుటుంబ కథా చిత్రంగా వస్తోంది. సెంటిమెంట్ పరంగా, అన్నిరకాలుగా మూవీ బాగుంది. హీరో దినేష్ కుమార్ మాట్లాడుతూ."ఈ సినిమా అన్ని వర్గాల వారు చూడదగ్గ చిత్రం. కుటుంబ సమేతంగా అందరూ చూడాలని కోరుతున్నా, అన్నారు.నిర్మాత కోమలి మాట్లాడుతూ."సింగర్ అయిన నేను ఈ సినిమాతో నిర్మాతగా మారాను. ఈ సినిమాలో నటించిన అందరూ నాకు బాగా సపోర్ట్ చేశారు.

# 'మృత్యుంజయ్'27న వరల్డ్ వైడ్ రిలీజ్



కింగ్ ఆఫ్ ఎంటం టైన్‌మెంట్ శ్రీవిష్ణు ఎప్పటికప్పుడు వైవిధ్యమైన చిత్రాలతో ప్రేక్షకులను మెప్పిస్తూ వారి హృదయాల్లో తనదైన స్థానాన్ని సంపాదించుకున్నారు. ఆయన తాజా చిత్రం "మృత్యుంజయ్". ఈ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ హుస్సేన్ షా కిరణ్ దర్శకత్వంలో తెరకెక్కుతోంది. రమ్య గున్నం సమర్పణలో లైట్‌బాక్స్ మీడియా, పిక్చర్ పర్‌ఫెక్ట్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్స్‌పై సందీప్ గున్నం, వినయ్ చిలకపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. బ్లాక్ బస్టర్ మూవీ"సామజవరగమన్త మూవీ తర్వాత శ్రీవిష్ణు, రేబా జాన్ జంటగా నటిస్తున్నారు."మృత్యుంజయ్ సినిమాను ప్రపంచ వ్యాప్తంగా ఫిబ్రవరి 27న గ్రాండ్ రిలీజ్ చేస్తున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను మేకర్స్ అనౌన్స్ చేశారు. పోస్టర్‌ను గమనిస్తే..పేపర్లతో నిండిన రోడ్డుపై నిలబడిన శ్రీవిష్ణుని గమనించవచ్చు. ఈ విజువల్స్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతున్నాయి. పక్కా ప్రమోషన్స్, ఉత్కంఠతభరితమైన కథాంశంతో "మృత్యుంజయ్" మూవీ ప్రేక్షకులను మెప్పించేలా రూపొందుతోంది. హీరో శ్రీవిష్ణు స్టైల్లో ఆసక్తికరమైన థ్రిల్లర్ మూవీగా మృత్యుంజయ్ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్‌గా వర్క్ చేస్తున్న ఈ చిత్రానికి విద్యాసాగర్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా కాల భైరవ సంగీతాన్ని సమకూరుస్తున్నారు. మనీషా ఎ.దత్ ప్రొడక్షన్ డిజైనర్‌గా వర్క్ చేస్తున్నారు.

# ' మీర్జాపురం రాణి కృష్ణవేణి' భగీరథ ప్రయత్నం




' మీర్జాపురం రాణి కృష్ణవేణి' అరుదైన భగీరథ ప్రయత్నం శకపురుషుడు, తారకరామం, నాగలాదేవి, మీర్జాపురం రాణి కృష్ణవేణి లాంటి పరిశోధనాత్మక గ్రంథాలను రచించిన భగీరథ డాక్టరేటుకు అర్హుడు , నేను యూనివర్సిటీ లో ఉంటే డాక్టరేట్ ఇప్పించేవాడిని అని తెలుగు సినిమా రచయితల సంఘం అధ్యక్షుడు పరుచూరి గోపాలకృష్ణ చెప్పారు. సీనియర్ జర్నలిస్ట్ రచించిన "మీర్జాపురం రాణి కృష్ణవేణి" పుస్తక పరిచయ కార్యక్రమం గురువారం ఫిలింనగర్ కల్చరల్ సెంటర్లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిగా వచ్చిన గోపాల కృష్ణ మాటాడుతూ.. ఎన్. టి. రామారావు గారిని తెలుగు సినిమా రంగానికి పరిచయం చేసిన కృష్ణవేణమ్మ అంటే నాకు ఎంతో గౌరవం, అలాంటి కృష్ణవేణమ్మ జీవిత చరిత్రను వెలువ రించిన భగీరథను, నిర్మాత అనురాధాదేవిని నేను మనసారా అభినందిస్తున్నా అని చెప్పారు గోపాల కృష్ణ .దర్శకుల సంఘం అధ్యక్షుడు వీర శంకర్ మాట్లాడుతూ.. భగీరథ గారు చేయి తిరిగిన రచయిత, రామారావు గారి శత జయంతి సందర్భగా వెలువరించిన శకపురుషుడు, తారకరామం పుస్తకాలు ఆయన ప్రతిభకు నిదర్శనం. దర్శకుడు బి. గోపాల్ మాట్లాడుతూ.. భగీరథ నాకు ఇష్టమైన జర్నలిస్టు, రచయిత, ఆయన రాసిన పుస్తకాలన్నీ నేను చదివాను, రోజారమణి మాట్లాడుతూ.. కృష్ణవేణమ్మ అంటే నాకు ఎంతో అభిమానం, ఆమె మాలాంటి నటీమణులకు ఆదర్శం, ఆమె జీవిత కథను రచించిన భగీరథ గారిని, అనురాధాదేవి గారిని అభినందిస్తున్నా అని చెప్పారు. పుస్తక రచయిత భగీరథ మాట్లాడుతూ.. మీర్జాపురం రాణి కృష్ణవేణి పుస్తకాన్ని రాయడానికి ప్రధాన కారకురాలు శ్రీమతి అనురాధ దేవి, ఆమె సహకారం లేకపోతే ఈ గ్రంథం వెలువడేదే కాదు, కృష్ణవేణమ్మది విలక్షణమైన జీవితం, సామాన్య కుటుంబంలో పుట్టి అసామాన్యురాలుగా ఎదిగి ఒదిగిన మహానటి, జర్నలిస్ట్ మిత్రులంతా ఆత్మీయంగా సత్కరించారు.

# రికార్డులను బద్దలు కొట్టిన తేజ సజ్జా'మిరాయ్ '



సూపర్ హీరో తేజసజ్జా 'మిరాయ్' జైత్రయాత్ర కొనసాగిస్తోంది. థియేటర్లలో ఘనవిజయం సాధించిన ఈ చిత్రం, ఓటీటీ, ఇప్పుడు టెలివిజన్‌లోనూ సంచలన రికార్డులు సృష్టిస్తూ అరుదైన ఘనతను సాధించింది.కార్తిక్ ఘట్టమనేని దర్శకత్వంలో, People Media Factory బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన మిరాయ్ ఫాంటసీ, ఎమోషన్, యాక్షన్‌తో థియేటర్లలో బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. అనంతరం Hotstar ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లోనూ యువతతో పాటు కుటుంబ ప్రేక్షకుల నుంచి భారీ వ్యూయర్‌షిప్‌ను దక్కించుకుంది. మిరాయ్ హిందీ వెర్షన్ కూడా 2025లో Star Gold లో ప్రసారమైన టాప్ రేటెడ్ చిత్రంగా నిలిచింది. దేశవ్యాప్తంగా సినిమాకు వచ్చిన ఈ స్పందన, సీక్వెల్‌పై ఆసక్తి, డిమాండ్‌ను మరింత పెంచింది.థియేటర్లు, ఓటీటీ, శాటిలైట్.. మూడు మాధ్యమాల్లోనూ ఘన విజయాలు సాధించిన మిరాయ్, తేజ సజ్జాను భారతీయ సినిమా పరిశ్రమలో మోస్ట్ ప్రామెసింగ్ యంగ్ స్టార్‌గా నిలబెట్టింది.

## మహాశివరాత్రి ఏర్పాట్లు స్వయంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ

-క్యూలైన్లు, భక్తులు సౌకర్యాలపై అధికారులకు కీలక ఆదేశాలు -18న చక్రతీర్థం ఏర్పాట్లు పక్కాగా ఉండాలని స్పష్టం



జలుమూరు, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతున్న శ్రీముఖలింగం క్షేత్రాన్ని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ జిల్లా ఎస్పీ కె.వి మహేశ్వర రెడ్డి, నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిలతో కలిసి శుక్రవారం క్షేత్రస్థాయిలో సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయ పరిసరాలను క్షుణ్ణంగా తనిఖీ చేసిన ఆయన, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దర్శనానికి వచ్చే భక్తుల కోసం ఏర్పాటు చేస్తున్న క్యూలైన్లు, మంచినీటి వసతి, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ పనులను కలెక్టర్ పర్యవేక్షించారు. అత్యవసర సేవల కోసం మెడికల్ టీమ్స్, అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచాలని, పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఉత్సవాల పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. భద్రత విషయంలో రాజీ పడకూడదని, సీసీ కెమెరాలతో పాటు డ్రోన్ల ద్వారా నిరంతరం నిఘా ఉంచాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**చక్రతీర్థ యాత్రకు ప్రత్యేక ప్రణాళిక :**



ఉత్సవాల్లో అత్యంత కీలకమైన చక్రతీర్థ స్నానాల ఏర్పాట్లపై కలెక్టర్ సుదీర్ఘంగా చర్చించారు. 18వ తేదీన ఉదయం 10 గంటల వరకే భక్తులకు దర్శనాలు ఉంటాయని, మధ్యాహ్నం 12 గంటలకు చక్ర తీర్థ యాత్ర ప్రారంభమవుతుందని ఆలయ సిబ్బంది ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. 17వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచే ఒడిశా తదితర ప్రాంతాల నుంచి యాత్రికుల రద్దీ పెరుగుతుందని, వారందరికీ ఎటువంటి అసౌకర్యం కలగకుండా పార్కింగ్ స్థలాలు, ఇతర వసతులు సిద్ధం చేయాలని ఆయన ఆదేశించారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో ప్రతి అధికారి బాధ్యతగా పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యంగా చక్రతీర్థ స్నానాల రోజు భక్తుల తాకిడి ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున, వంశధార నది తీరంలో గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. భక్తులకు అవసరమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు చేరవేసేలా చూడాలన్నారు. జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ భక్తులు భద్రత దృష్ట్యా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని, వివిధ శాఖల అధికారులకు క్యూ లైన్లు బారికేడ్లు ఏర్పాటు, సీసీ టీవీ, పార్కింగ్ ప్రదేశాలు, కంట్రోల్ రూమ్‌లో ఉండవలసిన ఇతర శాఖల సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. ఈ క్షేత్రస్థాయి పర్యటనలో జిల్లా కలెక్టర్‌తో పాటు రెవెన్యూ, పోలీస్, దేవాదాయ, జలవనరులు శాఖల అధికారులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సరసనాపల్లి గ్రామం దళిత ఆదివాసీల పరిస్థితి దారుణం



రాజాం, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త

రేగిడి మండలం సరసనాపల్లి గ్రామంలో రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి జరజాన నీలయ్య పర్యటించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో దళితుల పరిస్థితి అధ్వానంగా ఉందని కనీసం మంచినీటి సదుపాయం కూడా లేకపోవడం, అపారిశుద్ధ్యం తాండవిస్తుందని ఆయన ఆవేదన చెందారు. సుమారు దళిత ఆదివాసీలు 100 కుటుంబాలు పైన ఉన్నామని మా కోసం కనీసం పట్టించుకునే నాయకులు ఎవరు లేరని ఆయనకు వారు వివరించారు, మా చుట్టూ ఎంత నీరు ఉన్నా, మా గ్రామంలో మాత్రం త్రాగడానికి మాకు మాత్రమే నీళ్ల రాకపోతే చాలా దారుణమని ఆయనకు విన్నవించారు. ఇప్పటికే ఇలా ఉంటే వచ్చే వేసవిలో మా పరిస్థితి ఏంటో మాకు అర్థం కావడం లేదని ఆయన ముందు వాపోయారు. అయితే మీడియాతో మాట్లాడుతూ గ్రామంలో చాలా సమస్యలు కొట్టుమిట్టాడు తున్నాయని, నీటి సమస్య తీవ్రంగా ఉందని, కుళాయిలుకి కనీసం ట్యాప్ సౌకర్యం కూడా లేదని, కాలువలో పారిశుద్ధం తాండవం ఆడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు, ఈ విషయంపై రాజాం నియోజకవర్గ ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ దృష్టికి తీసుకు వెళ్తానని ఆయన భరోసా ఇచ్చారు. స్థానిక సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ తక్షణమే అక్కడ సమస్యలను పరిష్కరించాలని అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రేగిడి మండల దళిత జేఏసీ అధ్యక్షులు తేగల మోహన్ మరియు సరసనపల్లి గ్రామ దళిత నాయకులు గునాన అప్పలస్వామి మరియు గ్రామ యువకులు పాల్గొన్నారు.

## ఏరియా ఆసుపత్రికి కంటి, చర్మవ్యాధి వైద్యులు కావలెను

సీతంపేట, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త



మండల కేంద్రమైన సీతంపేటలో ఇటీవల 19 కోట్ల రూపాయలతో ఏరియా ఆసుపత్రి అదనపు భవనాలు నిర్మించారు. ఈ ఆసుపత్రిలో అవసరమైన స్పెషలైజేషన్ చేసిన వైద్యులను భర్తీ చేసి రోగులకు అత్యవసర సేవలతో పాటు దీర్ఘకాలిక వ్యాధులకు వైద్యులు పరీక్షలు చేసి వాటికి అవసరమైన చికిత్స అందజేయవలసి ఉంది. సీతంపేట మన్యంలో తరుచూ కంటి చర్మ వ్యాధులతో బాధపడుతున్న వారు వైద్యం కోసం ఏరియా ఆసుపత్రికి వస్తున్నప్పటికీ వైద్యులు లేకపోవడం నిరాశతో వెళ్లవలసిన పరిస్థితి ఏర్పడింది. వీరిని ఇబ్బంది పెట్టకుండా ఉండాలని ఉద్దేశంతో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు చర్మ వ్యాధి రోగులను వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. కోట్ల రూపాయలు ఆసుపత్రి నిర్మాణ పనులకు ఖర్చు చేసినప్పటికీ వైద్యులు నియమించకపోవడం పట్ల రోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ఐటిడిఏ పిఓ డిసిహెచ్ దృష్టి సారించి కంటి చర్మవ్యాధి వైద్యులు వెంటనే భర్తీ చేయవలసిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.

## ప్రథమ స్థానంలో ఎంఎస్ పల్లి మోడల్ స్కూల్



కంచిలి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: కంచిలి మండలం మఖరాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం చిక్కోలు గణిత ఉపాధ్యాయ వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి గణిత క్విజ్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో మండలంలో గల అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఆరు, ఏడు తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానం ఏపీ ఎంఎస్ పల్లి విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. పోటీల్లో ఆరవ తరగతి దినేష్‌రావు, వజ్రపు వినయ్, నెయ్యల జ్యోష్న, ఏడవ తరగతి పిట్ట అవినాష్ పాల్గొన్నారు. వీరికి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శివప్రసాద్, గణిత ఉపాధ్యాయులు దివాకర్, భాగ్యలక్ష్మి, రవి, పాఠశాల సిబ్బంది అభినందించారు.

## అందరి సహకారంతో విద్యాంజలి 2.0



కంచిలి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న విద్యాంజలి 2.0 కార్యక్రమాల్ని అందరూ సహకరించాలని మండల విద్యాశాఖ అధికారి సప్పటి శివరాం ప్రసాద్ అన్నారు. శుక్రవారం కంచిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యాంజలి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలో గల అన్ని ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అన్ని పాఠశాల విద్యా కమిటీ చైర్మన్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ పాఠశాల మరియు సమాజానికి మధ్య ఉండే సంబంధాన్ని కులంకశంగా వివరించారు. సమాజంలో వ్యక్తులందరూ ఈ కార్యక్రమంలో స్వచ్ఛందంగా ఏ విధంగా పాల్గొనాలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 2 కే చిట్టిబాబు, స్థానికస్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ ఎస్ చాణిక్య, రిసోర్స్ పర్సన్ ఏ లోకేష్ పాల్గొన్నారు.

## రైతు కిసాన్ మేళాను వినియోగించుకోవాలి : ఐటీడీఏ పీవో పవార్ స్వప్నిల్



సీతంపేట, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త

రైతు కిసాన్ మేళా వినియోగించుకోవాలని ఐటీడీఏ పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ స్పష్టం చేశారు. శుక్రవారం ఐటిడిఏలో గిరిజన రైతులకు క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా జండా ఊపి ప్రారంభించారు. ఆమదాలవలసలోని కృషి విజ్ఞాన కేంద్రంకు రైతులకు పంపించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన్ కేంద్రంలో రైతులకు వివిధ రకాల పంటలపై నూతన సాంకేతిక పద్ధతులను తెలియజేయడం జరుగుతుందని, అదే విధంగా క్షేత్రస్థాయిలో వివిధ రకాల పంట పద్ధతులు గూర్చి అవగాహన కల్పించనున్నట్లు పీవో తెలిపారు. కొత్తూరు, హిరమండలం, పాతపట్నం మండలాల నుంచి రైతులు ఈ కార్యక్రమానికి పాల్గొన్నారు. ఏపీవో జి.చిన్నబాబు, పీహెచ్‌వో ఎస్.వి.గణేష్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజా దర్బార్

పాతపట్నం, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:



స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని శుక్రవారం ఎమ్మెల్యే మామిడి గోవింద రావు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజల నుండి నేరుగా సమస్యలు తెలుసుకొని, వాటిని తక్షణమే పరిష్క రించేలా సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. సుమారు 43 వినతులను స్వీకరించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేలా ప్రతి అర్జీపై స్పష్టమైన చర్యలు తీసుకుని, 15 రోజుల్లోగా పరిష్కార వివరాలు ప్రజలకు తెలియజేయాలని అధికారులకు ఆయన స్పష్టం చేశారు.

## సమాజ భాగస్వామ్యంతో పాఠశాలల అభివృద్ధి : ఎంఈఓ ధనుంజయ మజ్జి



కవిటి, ఫిబ్రవరి 5 (ప్రభాతవార్త) : సమాజ భాగస్వామ్యంతోనే పాఠశాలల అభివృద్ధి సాధ్యమవుతుందని కమిటీ ఎంఈఓ ధనుంజయ మజ్జి పిలుపునిచ్చారు. శుక్రవారం విద్యాంజలి 2 కార్యక్రమంలో భాగంగా కవిటిలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఎస్ఎంసి చైర్మన్‌లకు ఎమ్మార్సీలకు అలానే పలువురు విద్యార్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విద్యాంజలి 2 కార్యక్రమం ద్వారా పాఠశాలలను స్థానిక పెద్దలు ఎన్నారైలు సహకారంతో అభివృద్ధి చేస్తే విద్యాభివృద్ధితో పాటు పాఠశాల అభివృద్ధి మరింత వేగవంతంగా జరుగుతుందని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ఎంసి చైర్మన్లు గ్రామంలో పెద్దలు ఐక్యమత్యంతో సమాజ భాగస్వామ్యంతో అభివృద్ధికి బాటలు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 2 రామకృష్ణ తోపాటు ప్రధానోపాధ్యాయులు ఎన్.విశ్వనాథం, ఈశ్వరాచారి, త్రిలోశన బిసాయితోపాటు పలువురు పాల్గొన్నారు.

## శ్రీముఖలింగేశ్వర హుండీ లెక్కింపు రూ.2,92148లు

జలుమూరు, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:



ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన శ్రీముఖలింగేశ్వర స్వామి దేవస్థానం నందు గల ధర్మ హుండిని శుక్రవారం తెరిచి లెక్కించగా రూ.2,92,148ల ఆదాయం లభించిందని ఆలయ ఈవో టి.ఏడుకొండలు పేర్కొన్నారు. ఈ లెక్కింపునకు ధర్మకర్తల మండలి చైర్మన్, సభ్యులు, ఆలయ అర్చకులు, శ్రీ సత్యసాయి సేవా సమితి సభ్యులు, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ లెక్కింపునకు దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ వారి ఆదేశాలు ప్రాప్తికి పర్యవేక్షణకు మందస గ్రూపు దేవాలయంల కార్య నిర్వహణ అధికారి ఎస్.నాగేశ్వరరావు, ఆలయ ఈవో టి.ఏడుకొండలు పాల్గొన్నారు.

## పోస్టాఫీస్‌కి రండి... పట్టుచీర పట్టుకెళ్ళండి .. పోస్టల్ సబ్ డివిజన్ అధికారి శ్రావణ్ కుమార్

ఆమదాలవలస, ఫిబ్రవరి 6 (ప్రభాతవార్త)



ఆమదాలవలస పోస్టల్ సబ్ డివిజన్ ప్రజలు, ఖాతాదారులకు సబ్ డివిజన్‌లో ఖాతాదారు లకు, ప్రజలకు మొట్టమొదటి సారిగా ఒక అరుదైన అవకాశం కల్పించడం జరిగిందని పోస్టల్ డివిజన్ అధికారి పి.శ్రావణ్ కుమార్ తెలిపారు. సబ్ డివిజన్ పరిధిలో గల ఆముదాలవలస, పురుషోత్త పురం, భైరసింగపురం, హీరమండ లం, వెంగళరావు కాలనీ. ఎల్ ఎన్ పేట, కొత్తూరు, బత్తిలి, నివగాం పరిధిలోని అన్ని పోస్టాఫీసులలో తెరిచిన ఖాతాలకు మాత్రమే ఈ పథకానికి అర్హులని తెలిపారు. గ్రామీణ పోస్టాఫీసులు 77, సబ్ పోస్ట్ ఆఫీసులు 8, ఆముదాలవలస హెడ్ పోస్ట్ ఆఫీస్‌లో ఈ పథకం ఫిబ్రవరి 9 నుండి మార్చి 31 వరకు కొత్తగా తెరిచిన ఖాతాలకు మాత్రమే ఉంటుందని వివరించారు. ప్రజలకి పోస్ట్ ఆఫీస్ ఎన్నో పథకాల ద్వారా చేరువ అవుతున్న దని, ఆన్లైన్ ఖాతాలు, ఆధార్, ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ ఇన్సూరెన్స్ స్కీమ్స్, ఇలా ఎన్నో ఉత్తమమైన సేవలు అందిస్తున్నామని అన్నారు. ఈ వార్షిక సంవత్సరం మార్చ్ 2026 ముగింపు సందర్భంగా మరిన్ని కొత్త ఖాతాలు మరియు ఎక్కువ మంది ప్రజలు చేరువవడానికి ఈ ప్రత్యేక పథకం ఏర్పాటు చేయడం జరిగినదని, ప్రతి 1000 కొత్త ఖాతాలకి లక్కీ డ్రా తీయడం జరుగుతుందని, మినిమం 100 రూపాయలు ఖాతా ఒక వ్యక్తి ఎన్ని ఖాతాలు అయినా తెరవ కోవచ్చని వివరించారు. ప్రైవేటు స్కీముల్లో కాకుండా ప్రజలు కేంద్ర ప్రభుత్వ సంస్థ అయినటువంటి తపాల శాఖలో తమ పొదుపు ఖాతాలు ఎక్కువ తెరవాలని, ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వివరాల కోసం మీ దగ్గరలోని పైన చెప్పిన ఏదైనా పోస్ట్ ఆఫీస్‌లో సంప్రదించగలరని శ్రావణ్ కుమార్ తెలిపారు.

## రాష్ట్రంలో ఇంటి పన్ను వసూల్లో 'విక్రమపురం'కి ప్రథమ స్థానం

కమీషనర్‌తో ప్రశంసలు అందుకున్న కార్యదర్శి



వీరఘట్టం, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త : కష్టేఫలి అంటారు పెద్దలు... ఆ సామెత ఊరకే పోదు... కష్టపడితే ఎంతటి పనినైనా సునాయాసంగా సుసాధ్యం చేయవచ్చు అని నిరూపించారు మండలంలోని విక్రమపురం పంచాయతీ కార్యదర్శి చక్రధర్ రావు. ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తూ.. ఎంపీడీవో వెంకటరమణ సూచనలతో ముందుకు సాగుతూ... గ్రామ సర్పంచ్ మాచర్ల మహేష్ సహకారంతో ఇంటి పన్ను వసూల్లో నూటికి నూరు శాతం ప్రగతిని సాధించి రాష్ట్రస్థాయిలోనే విక్రమపురం గ్రామంతో పాటు మండలాన్ని ముందుంచి, అందరి చూపు వీరఘట్టం మండలం వైపు చూసేలా చేశారు చక్రధర్ రావు. గ్రామాల్లో నూటికి నూరు శాతం ఇంటిపన్నులు వసూలు అనేది అసాధ్యం. కానీ సాధ్యమని నిరూపించి అందరి ప్రశంసలు అందుకున్నారు కార్యదర్శి. అలాగే ప్రభుత్వం చేసే ఐవిఆర్ఎస్ కాల్స్‌కి గ్రామంలోని ప్రజలంతా సంతృప్తిగా సమాధానం చెప్పడంతో ఉన్నతాధికారులు ఈయనను గౌరవిస్తూ పంచాయతీరాజ్ రూరల్ డెవలప్మెంట్ కమిషనర్ వారి చేతుల మీదుగా అమరావతిలో రెండు ప్రశంసా పత్రాలను అందుకున్నారు. ఆయన ఈ సందర్భంగా తనకు సహకరించిన సర్పంచ్ మాచర్ల మహేష్, గ్రామ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఈయనను ఆదర్శంగా తీసుకొని మిగిలిన కార్యదర్శులు కూడా ముందుకు సాగితే మండలం అభివృద్ధిపథంలో ముందుకు సాగడం ఖాయం.

## ప్రారంభమైన ఆర్ అండ్ బి బంగ్లా రోడ్డు పనులు



వీరఘట్టం, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త : నిన్న ఎంతో అట్టహాసంగా ఆర్ అండ్ బి బంగ్లా రహదారికి ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ శంకుస్థాపన గావించగా, నేటి నుండి కూటమి నాయకులు పనులను ప్రారంభించి చక చక వేగాన్ని పెంచారు. గత ఎన్నో ఏళ్ల నుండి ఈ రహదారి పరమ అధ్వానంగా ఉండి, ప్రజలకు ఎన్నో ఇబ్బందులకు గురిచేసిన ఈ రహదారిని అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే జయకృష్ణ ముందుకు రావడంతో ఆ ప్రాంత వాసులంతా ఆయనకు జేజేలు పలుకుతున్నారు. గత ప్రభుత్వం హయాంలో పలుమార్లు ప్రజలు విన్నవించినప్పటికీ పట్టించుకోకుండా వదిలేసిన ఈ రహదారిని ఎంతో సుందరంగా నిర్మించేందుకు కూటమి నాయకులు ముందుకు వచ్చారు. ప్రజల కష్టాలను తమ కష్టాలుగా భావించి సిమెంటు రహదారి నిర్మాణంతోపాటు డ్రైన్స్‌ను కూడా ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశారు. ఎట్టకేలకు బీసీ కాలనీ, తదితర ప్రాంత వాసులు ఈ రహదారి నిర్మాణంతో తమ కష్టాలు గట్టెక్కుతాయని గంపెడాశతో వారంతా ఎదురుచూస్తున్నారు. అయితే వారి ఆశయాలకనుగుణంగా కూటమి నాయకులు మాత్రం అతి తొందరగా ఈ రహదారిని పూర్తి చేసి ప్రజలకు కానుకగా ఇవ్వాలని వారంతా కంకణం కట్టుకున్నారు. శుక్రవారం పనులు జరుగుతున్న తీరును టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు ఉదయాన ఉదయభాస్కర్, టిడిపి పట్టణ శాఖ అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ, యువ నాయకులు జంపు శేఖర్ తదితరులు పర్యవేక్షించారు. పనులు నాణ్యతగా ఉండాలని ప్రజలకు వీలైనంత తొందరగా రహదారిని అందుబాటులోకి తీసుకురావాలని వారంతా ఆకాంక్షించారు.

## ఎమ్మెల్యే ఎన్ఇఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన శివనాగగౌరి



రణస్థలం, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త : నూతనంగా గ్రూప్1లో డీఎస్పీగా ఎంపికైన ఎచ్చెర్ల మండలం, షేర్ మహమ్మద్ పురం గ్రామానికి చెందిన మాజీ తెదేపా జిల్లా అధ్యక్షులు చౌదరి నారాయణమూర్తి (బాబ్జి) తనయుడు డీసీఎమ్ఎస్ చైర్మన్ అవినాష్ భార్య సంపతిరావు శివనాగగౌరి ఆమె భర్తతో పాటు శుక్రవారం ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావును ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. గ్రూప్1లో ఫలితాల్లో డీఎస్పీగా ఎంపికైన శివనాగ గౌరిని అభినందిస్తూ దంపతుల ను ఎమ్మెల్యే ఎన్ఇఆర్ ఘనంగా సన్మానించారు. భవిష్యత్‌లో మరిన్నో విజయాలు సాధించి ఎచ్చెర్ల నియోజక వర్గానికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకొని రావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి, సర్పంచుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నడుకుదిటి రజని ఎన్ఇఆర్ పాల్గొన్నారు.

## రైతులకు రైతు మేళాల ద్వారా ప్రయోజనం : శ్రీకాకుళం ఎమ్మెల్యే శంకర



ఆమదాలవలస, ఫిబ్రవరి 6 (ప్రభాతవార్త) రైతులకు రైతు మేళాల ద్వారా ఎంతో ప్రయోజనం చేకూరుతుందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శుక్రవారం ఆముదాలవలస కృషి విజ్ఞాన కేంద్రంలో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిధిలో వ్యవసాయాధారిత వ్యాపార అభివృద్ధి పేరిట కెవికెలో కిసాన్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తలు వ్యవసాయ అధికారులు తరచూ వ్యవసాయ పంటలపై రైతులకు సూచనలు ఇస్తూ తగిన పంటలు పండించేలా చూడాలని, చిత్తడి నేలపై ఏ పంటలు పండుతాయో అని రైతులకు తెలియ పరచవలసిన ఆవశ్యకత సంబంధిత శాఖ అధికారులపై శాస్త్రవేత్తలపై ఉందని అన్నారు. రైతులు విధిగా వాటిని పాటిస్తే లాభాల బాట పడతారని రైతులకు సూచించారు. ఈ సందర్భంగా పలు వ్యవసాయ క్షేత్రాలను వ్యవసాయ ప్రదర్శనలు రైతులకు శాస్త్రవేత్తలతో అవగాహన సమావేశాలను తరచూ నిర్వహించి రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, అనకాపల్లి సహ పరిశోధన సంచాలకులు సిహెచ్ ముకుందరావు, జిల్లా వ్యవసాయ అధికారి కే.త్రినాథ్ స్వామి, కె వి కే సమన్వయకర్త కే.భాగ్యలక్ష్మిలతోపాటు స్థానిక శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

# శ్రీకాకుళం వార్త



## ఆర్థికపరమైన నష్టాన్ని తీర్చండి

మంత్రి అచ్చెన్నాయుడుకు వినతి పత్రం అందజేసిన యూటీఎఫ్ నాయకులు



కోటబొమ్మాళి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: ఉపాధ్యాయుల అర్థిక పరమైన నష్టాన్ని తీర్చాలని, రానున్న బడ్జెట్ సమావేశాలలో ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరుతూ యుటీఎఫ్ రాష్ట్ర, జిల్లా నాయకులు శుక్రవారం నిమ్మాడ తన క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయశాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు వినతిపత్రం అందజేశారు. పిఆర్సి కమీషన్ చైర్మన్‌ను వెంటనే నియమించాలి. ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలి. పెండింగ్ డిఏలను విడుదల చేయాలి. ఉద్యోగుల, పెన్షనర్ల బకాయిల చెల్లింపుకు రూటామ్యాప్ ప్రకటించాలని మంత్రికి వినతి పత్రంలో కోరారు. మంత్రి స్పందించి సమస్యలన్నీ సావధానంగా విని త్వరలోనే పి ఆర్ సి కమిటీ వేస్తామని ఉద్యోగుల న్యాయమైన కోర్కెలు తీర్చడానికి ముఖ్యమంత్రి కూడా సుముఖంగా ఉన్నారని హామీ ఇచ్చారు. ప్రభుత్వానికి యుటిఎఫ్ సంఘం తరపున కృతజ్ఞతలు తెలియజేసుకున్నాము. రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎల్.బాబు రావు, బమ్మిడి శ్రీరామ మూర్తి, జిల్లా గౌరవాధ్యక్షులు కోరాడ వైకుంఠరావు, జిల్లా కార్యదర్శులు గొందు నారాయణ, డి.గణపతి రావు, రాష్ట్ర కౌన్సిలర్లు బి.తవిటమ్మ, కే.దాలయ్య, వై.వాసుదేవరావు, కోట బొమ్మాళి మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.సింహాచలం, బి.ఆనందరావు, నరసన్నపేట మండలం నుండి ఎన్.అప్పయ్య, టి.సుధీర్, టెక్కలి ప్రధాన కార్యదర్శి డి.లక్ష్మీనారాయణ, నందిగాం గణపతిరావుతో పాటు కోటబొమ్మాళి మండలం నుంచి సుమారు 60 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు.

## 12న జరగబోయే సమ్మెను విజయవంతం చేయండి

కోటబొమ్మాళి, జనవరి 6 (ప్రభాతవార్త)



ఫిబ్రవరి 12 జరగబోయే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సి.ఐ.టి.యు కోటబొమ్మాళి కమిటీ శుక్రవారం సమ్మెకు సంబంధించిన బుక్ ని ఆవిష్కరించింది. ఈ బుక్ ఆవిష్కరణలో సి.ఐ.టి.యు జిల్లా కార్యదర్శి హనుమంతు ఈశ్వరరావు పాల్గొన్నారు. చట్టాల్ని లేబర్ కోడ్‌లుగా మారుస్తున్నారని, దాన్ని కార్మిక వర్గం వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. చట్టాల్ని కోడ్లుగా మారుస్తున్న కేంద్ర ప్రభుత్వం విధానాల్ని అందరూ ఖండించాలని పిలుపునిచ్చారు. బ్రిటిష్ కాలం నుండి పోరాడి సాధించుకున్న 46 చట్టాలను మోడీ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు తొత్తులుగా వ్యవహరిస్తూ, కార్మికులకు బానిస యుగానికి తీసుకెళ్లడానికి కార్పొరేటర్‌లను సంతోష పరచడానికి ఇట్లాంటి నిర్ణయాలు చేస్తుందని విమర్శించారు. ఇటువంటి మార్పులు కార్మికులకు పాతాళానికి తీసుకు వెళ్తుందని తెలిపారు. దీనికి వ్యతిరేకంగా జరుగుతున్న ఫిబ్రవరి 12 సమ్మెను ఉద్యోగులు, కార్మికులు జయప్రదం చేయాలని, ముక్తకంఠంతో వ్యతిరేకించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సి.ఐ.టి.యు మండల నాయకులు గుండ నీ, యాసై వైకుంఠరావు, చల్ల కాంతారావు, తెలుగు భాస్కరరావు, శ్రీను కార్మికులతో కలిసి ఈ పుస్తకాన్ని ఆవిష్కరించి సమ్మె చేయాలని కోరారు.

## నూతన వ్యవసాయ సాంకేతికలపై అవగాహన



పాతపట్నం, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: జిల్లాలోని ఆమదాలవలస కృషి విజ్ఞాన్ కేంద్రంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ శ్రీకాకుళం వారి సౌజన్యంతో శుక్రవారం నిర్వహించిన కిసాన్ మేళాలో పాతపట్నం మండలం కొరసవాడ, తీమర గ్రామాలకు చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు. వారి యొక్క వ్యవసాయ సాగు విజ్ఞానాన్ని పెంపొందించుకున్నారు. ఇందులో భాగంగా నూతన వ్యవసాయ సాంకేతికతో సాగు చేస్తున్న వేరుశెనగ, పెసర, మినుము, మొక్కజొన్న పంటలను క్షేత్ర పరిశీలన చేసి అనేక రకమైన నూతన పోకడల గురించి తెలుసుకున్నారు. అదే విధంగా రైతులు శాస్త్రవేత్తలతో చర్చించి అనేక రకాల వ్యవసాయ మెలకువలపై అవగాహన పొందారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కె త్రినాధస్వామి,టెక్కలి వ్యవసాయ సహాయ సంచాలకులు కె జగన్మోహనరావు, పాతపట్నం మండల వ్యవసాయ అధికారి కే సింహాచలం, రైతులు రామారావు, ధర్మారావు, పసల పాపారావు, బోను అప్పారావు, దాము పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికలకు కార్యకర్తలు సమాయాత్తంగా ఉండాలి : టీడీపీ ఇన్‌చార్జ్ పడాల భూదేవి

సీతంపేట, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త



పాలకొండ నియోజకవర్గం స్థానిక ఎన్నికలకు కార్యకర్తలు సమాయత్తంగా ఉండాలని టీడీపీ ఇన్‌చార్జ్ పడాల భూదేవి స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రతి ఒక్క కార్యకర్త, నాయకులు వివిధ హోదాలలో ఉన్న పార్టీ పెద్దలు మై టిడిపి యాప్‌ను వినియోగించాలని, కూటమి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం,అభివృద్ధి ప్రజలోనికి విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ కార్యదర్శి బిడ్డిక జయలక్ష్మి, ఏఎంసీ డైరెక్టర్స్ మూర మోహనరావు, సవర మంగయ్య, కన్వీనర్ సవర తోట మొఖలింగం, సవర కూర్మారావు, సిమ్మయ్య, మాజీ ఎంపీటీసీ సవర మంగయ్య, నిమ్మలవలస అప్పారావు, సవర భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

## డ్రోన్ ద్వారా వరి పొలంలో పిచికారి



వీరఘట్టం, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త : మండలంలోని రేగులపాడు గ్రామంలో శుక్రవారం డ్రోన్ ద్వారా వరిపొలంలో పిచికారి చేయడం జరిగిందని, మండల వ్యవసాయ శాఖ అధికారి జక్కు సౌజన్య అన్నారు. ఆ గ్రామంలో 8 ఎకరాల వరి పొలంలో కాండంతలుచు పురుగు అలాగే ఆకు ముడత పురుగుల నివారణకు ప్రొఫెనో పాస్, కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ కెమికల్స్ 8 ఎకరాలలో పిచికారి చేయడం జరిగిందన్నారు. అంతేకాకుండా ఈ డ్రోన్ ద్వారా నానో యూరియా అలాగే జింక్ లోపం ఉన్న వరి పొలాలకు చిలేటడ్ జింకు కూడా పిచికారి చేసుకోవచ్చని ఆమె సూచించారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం డ్రోన్ సేవలను అందరికీ అందుబాటు అయ్యేలా డ్రోన్ ఒబెరైజేషన్ ఆప్‌ను ప్రవేశపెట్టిందన్నారు. ఈ యాప్‌ను రైతులు ప్లే స్టోర్ నుంచి ఇన్‌స్టాల్ చేసుకుని ఓలా, ఉబర్ వంటి క్యాబ్ సర్వీసుల తరహాలో డ్రోన్ అవసరమైన రైతులు ముందుగా బుక్ చేసుకోవచ్చు అని ఆమె తెలిపారు. ఏఈఓ రాజేష్, వి ఏ ఏ అదీప్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులపై సమీక్ష

వీరఘట్టం, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త : ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలో జరుగుతున్న వివిధ పనులపై శుక్రవారం ఎంపీడీవో బి.వెంకటరమణ సమీక్ష నిర్వహించారు ఇందులో క్లోజర్ అఫ్ వర్క్స్, క్యాటల్ షెడ్స్, సోక్ పిట్స్, ఫాంపాండ్స్, ప్లాంటేషన్ మెయింటినెన్స్, అక్షరాంధ్ర /ఉల్లాస్ తరగతులు నిర్వహించడం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. పనులు విషయంలో పురోగతి కనిపించాలని అన్నింట్లో కూడా వీరఘట్టం మండలం ప్రథమ స్థానంలో ఉండేందుకు సిబ్బంది అంతా ప్రత్యేకంగా కృషి చేయాలని ఆయన అన్నారు. ఏపీవో జి.సత్యం నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఈసిలు, టిఏలు, సిఓలు, ఎఫ్ఓలు తదితరులు పాల్గొన్నారు.




**CHANGE OF NAME**

I, BOYINA GOVINDA RAJU (old name) S/o RAMANA MURTY aged about 69 Years,R/o Door No 10-146, Komati Veedhi, Kotabommali Village and Mandal, Srikakulam Srikakulam District, A.P. State pin- 532195.Shall Henceforth I will be called as BOYINA GOVINDARAJULU (New Name) for all purpose.

**CHANGE OF NAME**

I, BOYINA SARADAMBA (old name) W/o GOVINDARAJULU aged about 65 Years, R/o Door No 10-146, Komati Veedhi, Kotabommali Village and Mandal, srikakulam Srikakulam District. A.P. State pin- 532195. Shall Henceforth I will be called as BOYINA SARADA (New Name) for all purpose.

**CHANGE OF NAME**

I, KINJARAPU LALITAKUMARI (old name) W/o HARIVARAPRASAD aged about 55 Years,R/o Door No 0-1, Main Road, Nimmada, Village, Kotabommali Mandal, Srikakulam Srikakulam District. A.P. State Pin- 532439. Shall Henceforth I will be called as KINJARAPU LALITHA KUMARI (New Name) for all purpose.

07-02pg10exHMNWJQETLK.qxdO/P:07-02pg10exHMNWJQETLK.qxd 1/1/02 7:40 AM Page 1





# బాక్సమ్ ఎలైట్‌లో దూసుకుపోయిన నీతు, ప్రీతి

**న్యూఢిల్లీ:** భారత బృందం బాక్సమ్ ఎలైట్ ఇంటర్నేషనల్ 2026లో తన అద్భుతమైన ప్రదర్శనను కొనసాగించి మొత్తం 19 పతకాలను నిర్ధారించింది. శుక్రవారం జరిగిన టోర్నమెంట్ 3వ రోజునీతు (51 కిలోలు), ప్రీతి (54 కిలోలు) వారి వారి వెయిట్ కేటగిరీలలో సెమీఫైనల్లోకి దూసుకెళ్లారు. పురుషుల పోటీలో జదుమణి సింగ్ (55 కిలోలు) మరోసారి అద్భుతమైన ప్రదర్శన ఇచ్చాడు. పధాన కోచ్ శాంటియాగో నీవా నేతృత్వంలోని భారత మహిళల బృందం 12 పతకాలను ఖాయం చేయగా, పురుషుల జట్టు 7 పోడియం ఫినిషింగ్‌లను సెమీఫైనల్ దశకు చేరుకుందని నిర్ధారించింది. నీతు అద్భుతమైన ఫామ్‌లో కెనడాకు చెందిన మెకెంజీ రైట్‌ను 5:0 తేడాతో ఓడించింది. ప్రీతి స్పెయిన్‌కు చెందిన మరియా గొంజాలెజ్‌తో జరిగిన మ్యాచ్‌లో క్లినికల్ ప్రదర్శనతో, నిరంతర ఒత్తిడితో పోటీని నిర్దేశించిన తర్వాత రౌండ్ 3లో నిష్క్రమించవలసి వచ్చింది. పూనమ్ (54 కిలోలు) థాయిలాండ్‌కు చెందిన నట్నిచా చోంగ్‌ప్రోంగ్‌క్లాంగ్‌పై 5:0 తేడాతో మరో అద్భుతమైన విజయాన్ని నమోదు చేయగా, ప్రియా (60 కిలోలు) మరియు ప్రాంజల్ (65 కిలోలు) వరుసగా స్పెయిన్‌కు చెందిన లారా గలా మరియు చెక్ బాక్సర్ విక్టోరీ జిల్కోవాపై ఏకగ్రీవ విజయాలు నమోదు చేశారు. హోరాహోరీగా జరిగిన పోరులో కాజల్ (65 కిలోలు) కజకిస్తాన్‌కు చెందిన అక్బర్ ఇఖషనోవాను 4:1 తేడాతో ఓడించింది. పురుషుల పోటీలో, జదుమణి సింగ్ 55 కిలోల విభాగంలో చైనీస్ తైపీకి చెందిన పెంగ్ చియాఫెంగ్‌ను 5:0 తేడాతో ఓడించాడు. మహమ్మద్ హుస్సామ్ ఉద్దీన్ (60 కిలోలు) ఉక్రెయిన్‌కు చెందిన అలీ డాలీపై ఆధిపత్యం సంపాదించాడు.

# టీ20ల్లో మోస్ట్ డేంజర్ బౌలర్స్, బ్యాటర్లను తారెత్తించే వికెట్ టేకర్లు
















**న్యూఢిల్లీ:** ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచ కప్‌లో అత్యధిక వికెట్లు తీయడం అనేది ఏ బౌలర్ కైనా గొప్ప విషయం. ఈ క్రికెట్‌లో ఒక్క వికెట్ అయినా మ్యాచ్ ఫలితాన్ని మార్చేయగలదు. అందుకే ఈ వికెట్ టేకర్లు ప్రపంచ కప్‌లలో అంత ప్రాముఖ్యతను కలిగి ఉంటారు. బ్యాటర్లు మొదటి బంతి నుంచే దాడికి దిగే ఈ పొట్టి ఫార్మాట్‌లో, వరుసగా ప్రపంచ కప్‌లలో క్రమంగా వికెట్లు తీయడం అనేది క్రికెట్‌లో అత్యంత కష్టం. కానీ ఈ మోస్ట్ డేంజరస్ బౌలర్ల ఎలైట్ జాబితాలో టాప్ 5లో ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచ కప్ చరిత్రలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా బంగ్లాదేశ్‌కు చెందిన షకీబ్ అల్ హసన్ అగ్రస్థానంలో నిలిచాడు. వేగం లేదా స్పిన్ కంటే తన నియంత్రణ, సమతుల్యత, తెలివైన ఆలోచనలతో ఆయన ఈ విజయాన్ని అందుకున్నాడు. అయితే, 2026 ప్రపంచ కప్ నుంచి బంగ్లాదేశ్ తప్పుకోవడంతో, ఆయన ఈ మెగా ఈవెంట్‌లో కనిపించడు. దాదాపు 20 ఏళ్ల కెరీర్‌లో ఆయన సగటు 20కి పైగా ఉండగా, ఎకానమీ రేటు 7 కంటే తక్కువగా ఉంది. ఈ జాబితాలో పాకిస్థాన్ మాజీ కెప్టెన్ షాహిద్ అఫ్రిది రెండో స్థానంలో ఉన్నాడు. అఫ్రిది ఎప్పుడూ బ్యాటర్లపై దాడి చేయడానికి భయపడలేదు. గాలిలోకి బంతిని విసిరి, భారీ షాట్లు ఆడేలా బ్యాటర్లను ప్రేరేపించి వికెట్లు పడగొట్టేవాడు. ప్రత్యర్థి జట్టు పటిష్టంగా ఉన్న సమయంలో కీలక వికెట్లు తీసి మ్యాచ్‌ను మలుపు తిప్పడంలో ఆయన దిట్ట. అలాగే ఒత్తిడిలో బౌలింగ్ చేయడంలో శ్రీలంకు చెందిన లసిత్ మలింగ సిద్ధహస్తుడు. 38 వికెట్లతో ఆయన ఇప్పటికీ టీ20 ప్రపంచ కప్ చరిత్రలో అత్యంత భయంకరమైన బౌలర్లలో ఒకరిగా కొనసాగుతున్నాడు. ఆయన విలక్షణమైన బౌలింగ్ యాక్షన్, ప్రాణాంతకమైన యార్కర్లు ఎంతటి మేటి ఫినిషర్లనైనా ఇబ్బంది పెట్టేవి. ప్రపంచ కప్‌లో ఆయన ఒకే మ్యాచ్‌లో 5 వికెట్లు తీయడం అత్యంత మరపురాని ప్రదర్శనలలో ఒకటిగా నిలిచింది. ఈ జాబితాలో అత్యంత వేగంగా పైకి ఎదుగుతున్న శ్రీలంకు చెందిన బౌలర్ వానిందు హసరంగా.

కేవలం 19 మ్యాచ్‌లలోనే 37 వికెట్లు తీయడం ఆయన దూకుడుకు నిదర్శనం. 2026 ప్రపంచ కప్ పాక్షి కంగా శ్రీలంకలో జరగనుండటంతో, ఆయన ఈ జాబితాలో అగ్రస్థానానికి చేరుకునే అవకాశం ఉంది. రషీద్ ఖాన్ మాదిరిగానే, ఈయన కూడా అగ్రస్థానానికి చేరుకోవడానికి ఇంకా 14 వికెట్ల దూరంలో ఉన్నారు. చివరిగా అంతర్జాతీయ వేదికపై ఆఫ్ఘనిస్తాన్ తరఫున రషీద్ ఖాన్ ఒక గేమ్‌ఛేంజర్‌గా నిలిచారు. హసరంగాతో సమానంగా 37 వికెట్లతో ఆయన టాప్ 5లో కొనసాగుతున్నాడు. ఒత్తిడి సమయాల్లో బ్యాటర్లు ఆయన్ని ఎదుర్కోవడానికి చాలా ఇబ్బంది పడతారు.




ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో..

# ఆదర్శ రామ్‌కు కాంస్యం ప్రవీణ్, మణికంఠ విఫలం

**న్యూఢిల్లీ:** 2026 ఆసియా ఇండోర్ ఛాంపియన్‌షిప్‌లో భారత అథ్లెటిక్స్ బృందం నిరాశపరిచింది. అయితే భారతదేశపు మొట్టమొదటి పురుషుల హైజంప్‌లో కాంస్య పతకాన్ని జె ఆదర్శ్ రామ్ గెలుచుకున్నాడు. శుక్రవారం చైనాలోని టియాంజిన్‌లో జరిగిన పోటీలో 28 ఏళ్ల ఆదర్శ్ ఫైనల్లో 2.19 మీటర్లు దూకి మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకంతో చైనాలో భారత్ పతకాల ఖాతాను తెరిచాడు. అతడు 2.23 మీటర్ల మార్కును దాటడానికి ప్రయత్నించినా మూడు ప్రయత్నాలలోనూ విఫలమై కాంస్యంతో సరిపెట్టుకున్నాడు. ఇక ప్రవీణ్ చిత్రవేల్ నాల్గవ స్థానంలో నిలవగా, మణికంఠ హోబ్లిధర్‌పై అనర్హత వేటు పడింది. ఈ సీజన్‌లో ప్రవీణ్‌కి మంచి ఆరంభం లభించలేదు. అతను పురుషుల ట్రిపుల్ జంప్ పోడియంను 16.22 మీటర్లు జంప్ చేసి, ముగ్గురు చైనా అథ్లెట్ల కంటే 4వ స్థానంలో నిలిచాడు. తొలుత ప్రవీణ్ 15.66 మీటర్ల జంప్‌తో ప్రారంభించి తరువాతి జంప్‌లలో అతను దానిని స్వల్పంగా పెంచాడు. చివరి ప్రయత్నంలో 16.22 మీటర్లు దూకాడు. మరోవైపు భారతదేశపు అగ్రశ్రేణి స్ప్రింటర్ మణికంఠ హోబ్లిధర్ పురుషుల 60మీటర్ల ప్రాథమికరౌండ్‌లో తప్పుడు ప్రారంభం కారణంగా అనర్హతను ఎదుర్కొన్నాడు. అధికారులు హీట్3లో పునఃప్రారంభించాలని పిలుపునిచ్చిన తర్వాత అతను నేరుగా రెడ్ కార్డ్ అందుకున్నాడు. దీనితో చైనాలో అతని ప్రచారం ఒక్క రేసు కూడా నడపకుండానే ముగిసింది.

# బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్.. భారత్ మహిళల, పురుషుల జట్లు ఓటమి

**న్యూఢిల్లీ:** 2026 బ్యాడ్మింటన్ ఆసియా టీమ్ ఛాంపియన్‌షిప్‌లో భారత యువ మహిళల, పురుషుల జట్లు క్వార్టర్ ఫైనల్‌లో నిష్క్రమించాయి. కింగ్‌డావోలో శుక్రవారం జరిగిన టైలో ఆతిథ్య చైనా చేతిలో భారత్ మహిళల జట్టు ఓటమిపాలైంది. మొదటి మూడు మ్యాచ్‌ల్లో ఓడిపోయిన తర్వాత డిఫెండింగ్ ఛాంపియన్లు 0-3 తేడాతో పరాజయాన్ని ఎదుర్కొన్నారు. ప్రపంచ 10వ ర్యాంకర్ గావో ఫాంగ్ జీతో సహ అగ్రశ్రేణి ఆటగాళ్లు లైనప్‌లో ఉండటంతో, చైనా భారతదేశానికి గట్టి ప్రత్యర్థిగా నిలిచింది. 17 ఏళ్ల తన్వి శర్మపై 21-9, 21-9 తేడాతో ఘన విజయం సాధించి చైనా తరఫున గావో మ్యాచ్‌ను ప్రారంభించింది. తద్వారా ఆతిథ్య జట్టుకు ఈ టైకు బలమైన ఆరంభం లభించింది. ఆ తర్వాత, ప్రపంచ నంబర్ 4 జోడీ జియా యి ఫ్యాన్-జాంగ్ షు జియాన్




24-22, 21-17తో అగ్రస్థానంలో ఉన్న భారత ద్వయం ట్రీసా జాలీ-గాయత్రి గోపీచంద్‌లను ఓడించారు. తొలి గేమ్‌లో అదనపు పాయింట్లు సాధించడానికి 7 పాయింట్ల లోటు నుండి తిరిగి రావడానికి, ఉన్నత ర్యాంక్‌లో ఉన్న జంటపై యువ భారత జంట ధైర్యంగా పోరాడినా 22-24 తేడాతో దగ్గరగా ఓడి మ్యాచ్‌ను ముగించారు. మూడవ మ్యాచ్‌లో, రక్షిత శ్రీ సానుకూలంగా ప్రారంభించి, వెన్ జింగ్ జుతో జరిగిన తొలి గేమ్‌ను గెలుచుకుంది.
కానీ తరువాతి రెండు గేమ్‌లను 21-14, 15-21, 17-21 తేడాతో ఓడిపోయింది. అలాగే పురుషుల విభాగంలో కిదాంబి తన మ్యాచ్ గెలిచాడు. కానీ డబుల్స్ మరియు సింగిల్స్ లో ఆయుష్ శెట్టి తమ తమ మ్యాచ్ లలో ఓడిపోవడంతో భారత జట్టు 13 తేడాతో ఓటమిని ఎదుర్కొంది.

# జాగ్రెబ్ ఓపెన్..నీలం సిరోహికి రజతం



**న్యూఢిల్లీ:** జాగ్రెబ్ ఓపెన్ ర్యాంకింగ్ సిరీస్-2026, మహిళల 50 కిలోల విభాగంలో భారత్ అథ్లెట్ నీలం సిరోహి రజత పతకం గెలుచుకుంది. క్రొయేషియాలో జరుగుతున్న జాగ్రెబ్ ఓపెన్ ర్యాంకింగ్ సిరీస్‌లో భాగంగా శుక్రవారం జరిగిన ఫ్రీస్టైల్ రెజ్లింగ్‌లో భారత రెజ్లర్లు 4 పతకాలు గెలుచుకుని పతకాల పరుగును కొనసాగించారు. మహిళల 50 కిలోల విభాగంలో భారత్ డబుల్ పోడియంను కైవసం చేసుకుంది. అనుభ వజ్ఞురాలైన నీలం సిరోహి రజత పతకాన్ని గెలుచుకోగా, ముస్కా న్ కాంస్య పతకాన్ని గెలుచుకుంది. కాంస్య పతక పోరు లో ముస్కాన్ పోలాండ్‌కు చెందిన అగాటా వాలెర్జాక్‌పై టెక్నికల్ సుపీరియారిటీ విజయాన్ని నమోదు చేయగా, నీలం ఫైనల్‌లో జపాన్‌కు చెందిన అండర్ 23 ప్రపంచ ఛాంపియన్ హరునా మోరికావా చేతిలో 2-5 తేడాతో ఓడిపోయింది. నీలం అంతకుముందు ఆల్ఇండియన్ సెమీఫైనల్‌లో ముస్కాన్‌ను ఓడించి ఫైనల్‌కు చేరుకుంది.

# ఆర్‌బిఐ నిర్ణయాలతో మార్కెట్లలో జోష్..

## లాభాలతో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

## సెన్సెక్స్ 266, నిఫ్టీ 50 పాయింట్ల లాభం




**ముంబై, ఫిబ్రవరి 6:** రిజర్వ్ బ్యాంక్ ద్రవ్య పరపతి విధాన సమావేశం నుంచి సానుకూల సంకేతాలు అందడంతో, భారత ఈక్విటీ మార్కెట్లు శుక్రవారం లాభాలతో ముగిశాయి. 2027 ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధానికి వృద్ధి అంచనాలను ఆర్‌బిఐ పెంచడం మార్కెట్‌కు కలిసొచ్చింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 266 పాయింట్లు లాభపడి 83,580 వద్ద స్థిరపడగా, నిఫ్టీ 50 పాయింట్లు పెరిగి 25,693 వద్ద ముగిసింది.
వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచాలన్న ఆర్‌బిఐ నిర్ణయంతో పాటు, స్థిరత్వానికి ప్రాధాన్యం ఇస్తామన్న సంకేతాలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను బలపరిచాయి. అయితే, బెంచ్‌మార్క్ సూచీలకు భిన్నంగా బ్రాడర్ మార్కెట్లు మిశ్రమంగా స్పందించాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.02శాతం, స్మాల్ క్యాప్ 100 ఇండెక్స్ 0.27శాతం మేర నష్టపోయాయి. రంగాల వారీగా చూస్తే ఎఫ్‌ఎంసిజి సూచీ 2.27 శాతం మేర భారీగా లాభపడి టాప్ గెయినర్‌గా నిలిచింది. కన్స్యూమర్ డ్యూరబుల్స్, ప్రైవేట్ బ్యాంకులు, రియల్టీ రంగాలు కూడా లాభపడ్డాయి. మరోవైపు, నిఫ్టీ ఐటీ 1.47 శాతం, ఫార్మా 0.72 శాతం మేర నష్టపోయాయి. రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్‌లకు (ఆర్ఇఐటి) రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులకు అనుమతిస్తామని ఆర్‌బిఐ సూచించడం మార్కెట్‌కు మరింత మద్దతునిచ్చింది.

# గరిష్ట స్థాయికి విదేశీ మారక నిల్వలు

## 723.77 బిలియన్ డాలర్లకు చేరిక




**ముంబై, ఫిబ్రవరి 6:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తాజా గణాంకాల ప్రకారం, జనవరి 23తో ముగిసిన వారంలో భారతదేశ విదేశీ మారక నిల్వలు కొత్త చారిత్రాత్మక గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. బంగారు నిల్వలు, విదేశీ కరెన్సీ ఆస్తులు రెండింటిలోనూ పెరుగుదల కారణంగా, ఈ వారంలో విదేశీ మారక నిల్వలు 8.053 బిలియన్ డాలర్లు పెరిగి 709.433 బిలియన్ డాలర్లకు చేరాయి. గత కొన్ని వారాలుగా, విదేశీ మారక నిల్వలు ఎక్కువగా పెరుగుదల ధోరణిలోనే ఉన్నాయి. దీనికి ముందు సెప్టెంబర్ 2024లో 704.89 బిలియన్ డాలర్ల గరిష్ట స్థాయిని తాకింది. జనవరి 23తో ముగిసిన వారంలో విదేశీ మారక నిల్వలలో అతిపెద్ద భాగమైన భారతదేశ విదేశీ కరెన్సీ ఆస్తులు (ఎఫ్‌సిఎ) 2.367 బిలియన్ డాలర్లు పెరిగి 562.885 బిలియన్ డాలర్లకు చేరాయి. ఆర్‌బిఐ డేటా ప్రకారం, బంగారు నిల్వలు ప్రస్తుతం 123.088 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి, ఇది గత వారం కంటే 5.635 బిలియన్ డాలర్లు ఎక్కువ. డిసెంబర్ ప్రారంభంలో జరిగిన తాజా ద్రవ్య విధాన సమీక్ష సమావేశం తర్వాత, దేశ విదేశీ మారక నిల్వలు 11 నెలలకు పైగా వాణిజ్య దిగుమతులకు సరిపోతాయని ఆర్‌బిఐ పేర్కొంది. మొత్తంమీద, భారతదేశ బాహ్య రంగం పటిష్టంగా ఉంది. బాహ్య ఆర్థిక అవసరాలను సులభంగా తీర్చగలమని ఆర్‌బిఐ విశ్వాసంతో ఉంది. గణాంకాల ప్రకారం, 2025లో విదేశీ మారక నిల్వలు సుమారు 56 బిలియన్ డాలర్లు పెరిగాయి. 2024లో, నిల్వలు 20 బిలియన్ డాలర్లకు పైగా పెరిగాయి. 2023లో, భారతదేశం తన విదేశీ మారక నిల్వలకు సుమారు 50 బిలియన్ డాలర్లను జోడించింది, అయితే 2022లో మొత్తం 71 బిలియన్ డాలర్ల క్షీ ణత నమోదైంది. విదేశీ మారక నిల్వలు అనేవి ఒక దేశపు కేంద్ర బ్యాంకు లేదా ద్రవ్య అథారిటీ వద్ద ఉండే ఆస్తులు. వీటిని ప్రధానంగా అమెరికన్ డాలర్ వంటి రిజర్వ్ కరెన్సీలలో, మరియు తక్కువ మొత్తంలో యూరో, జపనీస్ యెన్, మరియు పౌండ్ స్టెర్లింగ్‌లలో ఉంచుతారు. రూపాయి విలువ తీవ్రంగా పడిపోకుండా నిరో ధించడానికి ఆర్‌బిఐ తరచుగా ద్రవ్య లభ్యతను నిర్వహించడం ద్వారా, డాలర్లను అమ్మడం వంటి చర్యలతో జోక్యం చేసుకుంటుంది. రూ పాయి బలంగా ఉన్నప్పుడు ఆర్‌బిఐ వ్యూహా త్మకంగా డాలర్లను కొనుగోలు చేస్తుంది మరియు

# తగ్గిన బంగారం, వెండి ధరలు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6:** బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు శుక్రవారం భారీగా కుప్పకూలాయి. రెండు రోజులుగా కొనసాగుతున్న లాభాలకు బ్రేక్ పడింది. ఇండియా బులియన్స్ వెబ్‌సైట్ ప్రకారం కిలో వెండి ధర రూ.2.47 లక్షలకు పడిపోగా, 10 గ్రాముల బంగారం ధర స్వల్పంగా తగ్గి రూ.1.52 లక్షల వద్దకు చేరింది. అంతర్జాతీయంగా ప్రతికూల సంకేతాలు, డాలర్ బలపడటం వంటి కారణాలతో ఈ పతనం చోటు చేసుకుంది. గత రెండు రోజులుగా లాభాల్లో పయనించిన వెండి, గురు వారం నాటి మార్కెట్ క్రాష్ తర్వాత కోలుకోలేకపోయింది. స్పాట్ మార్కెట్లో వెండి ధర ఏకంగా 20శాతం పతనమై ఔన్సుకు 71 డాలర్ల దిగువకు చేరింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసిఎక్స్)లో మార్చి నెల వెండి ఫ్యూచర్స్ ఏకంగా రూ.26,850 (10శాతం) తగ్గి కిలో రూ.2,42,000 వద్ద ట్రేడ్ అయింది. అంతకుముందు సెషన్‌లో దీని ధర రూ. 2,68,850గా ఉంది. బంగారం ఫ్యూచర్స్‌లోనూ ఇదే ధోరణి కనిపించింది. ఏప్రిల్ కాంట్రాక్ట్ రూ.2,310 (1.51శాతం)తగ్గి 10గ్రాములు రూ.1,50,736 వద్ద ముగిసింది. గత నెలలో స్పెక్యులేటివ్ ట్రేడింగ్, పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు వంటి కారణాలతో బంగారం, వెండి ధరలు రికార్డు స్థాయిలో పెరిగాయి. అయితే, ఈ పెరుగుదల ఎక్కువ కాలం నిల వదని, ధరలు చాలా వేగంగా పెరిగాయని విశ్లేష కులుహెచ్చరించారు. వారి అంచనాలకు అనుగుణంగానే గతవారం నుంచిమార్కెట్లలో భారీ దిద్దుబాటు మొదలైంది.
**ప్రధాన నగరాల్లో ధరలు:** దేశ ఆర్థిక రాజధాని ముంబైలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగా రంధర రూ.1,52,180గా ఉండగా, ఢిల్లీలో రూ.1,51,910గాఉంది. దక్షి ణ భారతనగరాల్లో ధరలు అత్యధికంగా ఉన్నా యి. చెన్నైలో తులం బంగారం ధర రూ.1,52,620 కాగా, హైదరాబాద్‌లో రూ.1,52,420, బెంగళూరులో రూ.1,52,300గా నమోదైంది. వెండి విషయానికొస్తే, చెన్నైలో కిలో వెండి ధర అత్యధికంగా రూ.2,47,590గా ఉంది. హైదరాబాద్‌లోరూ.2,47,260, బెంగళూరులో రూ.2,47,060 వద్ద ట్రేడ్‌అయ్యింది. ముంబైలో కిలోవెండి ధర రూ.2,46,870గా, ఢిల్లీలో రూ.2,46,440గాఉంది. కోల్‌కతాలో రూ. 2,46,540 వద్ద కొనసాగింది.

# ఎఐ పెనుముప్పు: అమెరికా ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం

## భారత్ టెట్ కంపెనీలపై ప్రభావం చూపే అవకాశం: యుఎస్ ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ హెచ్చరిక



**వాషింగ్టన్, ఫిబ్రవరి 6:** అమెరికా ఆర్థిక వ్యవస్థకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఒకముప్పుగా పరిణమించిందని, ఈ టెక్నాలజీ వినియోగంపై రెగ్యు లేటర్లు నిఘాను కఠినతరం చేస్తున్నారని యుఎస్ ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ వెల్లడించారు. సెనేట్ బ్యాంకింగ్ కమిటీ ముందు ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఫైనాన్షియల్ స్టెబిలిటీ ఓవర్‌సైట్ కౌన్సిల్ (ఎఫ్ ఎస్ఓసి) 2025 వార్షిక నివేదికలో ఏఐని నాలుగు ప్రధాన దృష్టి సారించాల్సిన అం శాల్లో ఒకటిగా చేర్చినట్లు బెస్సెంట్ తెలిపారు. "ఆర్థిక స్థిర త్వాన్ని బలో పేతం చేసేందుకు ఏఐని బాధ్యతాయుతంగా వినియోగించడానికి కౌన్సిల్ ప్రాధాన్యత ఇస్తోంది. ఏఐ అనేది ఒక గొప్ప సాధనం, కానీ అదే సమ యంలో ప్రభుత్వ, ప్రభుత్వేతర శక్తుల ద్వారా ప్రమాదకరంగా కూడా మా రగలదు" అని ఆయన హెచ్చరించారు. ఫ్రాడ్ గుర్తింపు, రిస్క్ మేనేజ్‌మెంట్ వంటి వాటిలో ఏఐ వినియోగం పెరుగుతోందని చెప్పారు. పెరుగుతున్న ముప్పులను పర్యవేక్షి ంచేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వాములతో పాటు అంతర్జాతీయ సంస్థలతో కలిసి ఎఫ్ఎస్ఓసి పని చేస్తోందని బెస్సెంట్ వివ రించారు. ఏఐతో పాటు సైబర్ సెక్యూరిటీ కూడా ఆర్థిక సంస్థలకు, కీలక మౌలిక సదు పాయాలకు పెను సవాల్‌గా మారిందని పేర్కొన్నారు. ఈ విచారణలో రిపబ్లికన్లు ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇవ్వడాన్ని స్వాగతించగా, డెమొక్రాట్లు మాత్రం తగిన రక్షణ చర్యలు లేకుం డా ఆర్థిక ఆవిష్కరణలు ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. భారత్‌లో బ్యాంకులు, ఫిన్‌టెక్ సంస్థలు రుణాల జారీ, కస్టమర్ సర్వీస్ కోసం ఏఐని వేగంగా వినియో గిస్తున్న తరుణంలో అమెరికా రెగ్యులేటరీ సంకేతాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈపరిణామాలు సరిహద్దు కార్యకలా పా లున్న భారత టెక్ కంపెనీలు, ఆర్థిక సంస్థలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

# ఫెడ్ భయం.. బిట్‌కాయిన్ డభేల్

## క్రిప్టో ప్రపంచంలో మహా పతనం

## కనిష్ఠానికి పడిపోయిన బిట్‌కాయిన్

## ఒక్కరోజులోనే ఇన్వెస్టర్ల సంపద 100కోట్ల డాలర్ల ఆవిరి

## టెక్ షేర్ల అమ్మకాలతో క్రిప్టో విలవిల



**ముంబై, ఫిబ్రవరి 6:** డిజిటల్ బంగారంలా వెలిగిపోతుందనుకున్న క్రిప్టో మార్కెట్ ఒక్కసారిగా కుప్పకూలింది. ట్రేడింగ్‌లో ప్రపంచంలోనే అతిపెద్ద క్రిప్టో కరెన్సీ బిట్‌కాయిన్ విలువ 13 శాతం మేర క్షీ ణించి, సుమారు 63,295 డాలర్ల వద్ద 15 నెలల కనిష్ఠ స్థాయిని తాకింది. 2024 నవంబర్‌లో అమెరికాఅధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ గెలిచినప్పటి నుంచి కొనసాగుతున్న జోష్‌ను ఈతాజా పతనం పూర్తిగా తుడిచిపెట్టేసింది. గత అక్టోబర్‌లో 1.26 లక్షల డాలర్ల రికార్డు స్థాయిని తాకిన బిట్‌కాయిన్, ఇప్పుడు ఆ గరిష్ఠాల నుంచి సగానికి పైగా విలు వను కోల్పోవడం గమనార్హం. కేవలం 24 గం టల వ్యవధిలోనే క్రిప్టో మార్కెట్లో సుమారు బిలియన్ డాలర్ల (సుమారు రూ. 8,300 కోట్లు) విలువైన పొజిషన్లు లిక్విడేట్ అయ్యాయి. అక్టోబర్ నుంచి ఇప్పటి వరకు ప్రపంచ క్రిప్టో మార్కెట్ ఏకంగా 2 ట్రిలియన్ డాలర్ల సంపదను కోల్పోయింది. రెండో అతిపెద్ద కరెన్సీ అయిన 'ఇథీరియం' కూడా 13 శాతానికి పైగా నష్టపోయి 1,854 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బిట్‌కాయిన్ మైనింగ్ చేసే కంపెనీలు సైతం తమ వద్ద ఉన్న నిల్వలను అమ్మకానికి పెట్టవచ్చనే వార్తలు ఇన్వెస్టర్లలో మరింత గుబులు రేపుతున్నాయి.
క్రిప్టో పతనానికి కేవలం ఒక్క కారణం మాత్రమే కాదు, అంతర్జాతీయంగా చోటుచేసుకున్న పరిణామాలు తోడయ్యాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ తదుపరి ఛైర్మన్‌గా కెవిన్ వార్ష్‌ను ట్రంప్ నామినేట్ చేయడం మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపింది. ఆయన కఠినమైన ద్రవ్య విధానాలను అనుసరిస్తారనే భయం ఇన్వెస్టర్లలో మొద లైంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంపై అంచనాలు తగ్గడంతో నాస్‌డాక్ వంటి అంతర్జాతీయ టెక్ ఇండెక్స్‌లు కుప్పకూలాయి. బిట్‌కాయిన్ కదలికలు టెక్ షేర్లతో ముడిపడి ఉండటంతో ఈ సెగ క్రిప్టోకు తగిలింది. బంగారం, వెండి ధరల్లో కనిపిస్తున్న విపరీతమైన అస్థిరత కూడా ఇన్వెస్టర్లను రిస్క్ అసెట్స్ నుంచి వెనక్కి తగ్గేలా చేసింది. ప్రస్తుత పతనం స్వల్పకాలిక సర్దుబాటు కాదని, మార్కెట్ పూర్తిగా గడ్డు కాలంలోకి ప్రవేశించిందని మార్కెట్ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. సంస్థాగత పెట్టుబడిదారులు క్రిప్టో ఇటిఎఫ్‌ల నుంచి బిలియన్ల కొద్దీ నిధులను వెనక్కి తీసుకుంటుండటం మార్కెట్ బలహీనతను స్పష్టం చేస్తోంది. బిట్‌కాయిన్ 60 వేల డాలర్ల స్థాయిని నిలబెట్టుకోకపోతే, అది మరింత దిగువకు జారుకునే ప్రమాదం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.